శ్రీ విశాల మానవతా సమతా
సాధనమే మా మనోరథం
భావిలోక కల్యాణ సుస్థిర
స్థాపనమే మాదృఢశపథం.
ఒక అడుగేనీ చెదరనీము - చెదరనీము
ఒక క్షణమేనీ వృధాపోనీము - వృధాపోనీము
శ్రీరస్తు శుభమస్తు శాంతిరస్తనీ దీవించు.

- శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి



State Council of Educational Research & Training
Andhra Pradesh

తెలుగుబాట-7 తెలుగు వాచకం

# తెలుగుబాట 7

## తెలుగు వాచకం











సమగ్ర శిక్షా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

C1B3H4

सत्यमेव जयते

## భారత రాజ్యాంగ పీఠిక

భారతదేశ ప్రజలమైన మేము,
భారతదేశమును
సర్వసత్తాక,సార్వభౌమ,సామ్యవాద
లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యముగా
నెలకొల్పుటకు, పౌరులందరికీ
సామాజిక, ఆర్థిక, రాజకీయ
న్యాయాన్ని
భావము, భావప్రకటన, విశ్వాసము,
ధర్మము, ఆరాధనలతో కూడిన స్వేచ్ఛ,
స్వాతంత్ర్యాలను
అంతస్తులోను, అవకాశములోను
సమానత్వమును చేకూర్చుటకు,
అందరిలో
వ్యక్తి గౌరవాన్ని, దేశ సమగ్రతను
తప్పక తీసుకొచ్చే
సౌభ్రాత్రతను పెంపొందించుటకు
సత్యనిష్ఠాపూర్వకంగా తీర్మానించుకుని
1949వ సంవత్సరం నవంబరు 26 వ తేదీన
రాజ్యాంగ పరిషత్ లో ఆమోదింపబడి చట్టబద్ధం
చేసుకొని మాకు మేము సమర్పించుకుంటున్నాము.

## భారత రాజ్యాంగం - పౌర విధులు

1. రాజ్యాంగమునకు బద్ధుడై వుండుట, దాని ఆదర్శాలను, సంస్థలను, జాతీయ పతాకమును,జాతీయ గీతమును గౌరవించుట;
2. జాతీయ స్వాతంత్ర్య పోరాటమునకు స్ఫూర్తినిచ్చిన ఉన్నతాదర్శములను మనస్సుయందు ఉంచుకొని వాటిని అనుసరించుట;
3. భారత సార్వభౌమత్వం, ఐక్యత, అఖండతను సమర్థించుట మరియు సంరక్షించుట.
4. దేశమును రక్షించుట మరియు కోరినపుడు జాతికి సేవ చేయుట;
5. భారత ప్రజల మధ్య మత, భాష, ప్రాంతీయ, వర్గ వైవిధ్యములను అధిగమించి, సామరస్యమును, సోదర భావమును పెంపొందించుట, స్త్రీల గౌరవం తగ్గించు ఆచారములను విడనాడుట;
6. మన ఉమ్మడి సంస్కృతినీ, సుసంపన్న సంప్రదాయాలను గౌరవించి రక్షించుట;
7. అడవులు, సరస్సులు, నదులు, అడవి జంతువులతో సహా ప్రాకృతిక పరిసరాలను కాపాడి అభివృద్ధి చేయుట మరియు సమస్త జీవుల యెడల కరుణార్ద్రత కలిగి వుండుట.
8. శాస్త్రీయ దృక్పథాన్ని, మానవతావాదాన్ని, జిజ్ఞాసను, సంస్కరణ తత్వాన్ని పెంపొందించుకొనటం;
9. ప్రజల ఆస్తిని సంరక్షించుట, హింసను విడనాడుట;
10. ప్రయత్నాలు, సాధనల ఉన్నతస్థాయిలను నిరంతరం అందుకొనునట్లుగా వైయక్తిక, సమిష్టి కార్య రంగాలన్నింటిలో శ్రేష్ఠత కోసం, కృషి చేయుట ప్రాథమిక కర్తవ్యమై వుండవలెను.
11. ఆరు నుండి పద్నాలుగు సంవత్సరముల వయస్సు కలిగిన బాలునికి లేదా బాలికకు తల్లి తండ్రి లేదా సంరక్షకునిగావున్న వ్యక్తి తనబిడ్డ లేదా సందర్భానుసారము తన సంరక్షితునికి విద్యార్జనకు అవకాశములు కల్పించవలెను.

(అధికరణం 51 A)

## విద్యాహక్కు చట్టం

6 నుండి 14 సంవత్సరముల పిల్లలందరికి ఉచిత నిర్బంధ ఎలిమెంటరీ విద్యనందించడానికి ఉద్దేశించబడినవి. ఇది ఏప్రిల్ 1, 2010 నుండి అమల్లోకి వచ్చింది.

**చట్టంలోని ముఖ్యాంశాలు:**

- పిల్లలందరికి అందుబాటులో పాఠశాలలను ఏర్పాటుచేయాలి.
- పాఠశాలలకు మౌలిక వసతులను కల్పించాలి.
- పిల్లలందరిని వయస్సుకు తగిన తరగతిలో చేర్పించాలి.
- వయస్సుకు తగ్గ తరగతిలో చేర్చిన తర్వాత తోటి వారితో సమానంగా ఉండటానికి ప్రత్యేకశిక్షణ ఇప్పించాలి.
- ప్రత్యేక అవసరాలు కల్గిన పిల్లలకు సాధారణ పిల్లలతోపాటు విద్యకొనసాగించడానికి తగువసతులు ఏర్పాట్లు చేయాలి.
- బడిలో చేర్చుకోడానికి ఎలాంటి పరీక్షలు నిర్వహించరాదు. ఎటువంటి రుసుము, చార్జీలు వసూలు చేయరాదు.
- బడిలో చేరిన పిల్లల పేరు తీసివేయడం, అదే తరగతిలో కొనసాగించడం చేయరాదు.
- పిల్లల్ని శారీరకంగా, మానసికంగా హింసించరాదు.
- వయస్సు నిర్ధారణ పత్రం, ఇతర ధృవీకరణ పత్రాలు లేవనే కారణం చేత పిల్లలకు బడిలో ప్రవేశాన్ని నిరాకరించరాదు.
- తగిన అర్హతలున్న వారిని మాత్రమే ఉపాధ్యాయులుగా నియమించాలి.
- పిల్లలు నిర్దేశించిన సామర్థ్యాలు సాధించేలా బోధనాభ్యసనం, మూల్యాంకనం ఉండాలి.
- ఎలిమెంటరీ విద్య పూర్తయ్యేవరకు పిల్లలకు ఎలాంటి బోర్డు పరీక్షలు నిర్వహించరాదు.
- పద్నాలుగు సంవత్సరాలు పూర్తయినప్పటికినీ, ఎలిమెంటరీ విద్య పూర్తయ్యేవరకు పాఠశాలలో పిల్లలు కొనసాగవచ్చును.
- బలహీన వర్గాలకు, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న బృందాలకు చెందిన పిల్లలు ఏ విధమైన వివక్షతకు గురికాకుండా చూడాలి.
- రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలకు అనుగుణంగా, విద్యార్థులను భయం, ఆందోళనకు గురిచేయని రీతిలో వారి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడే పాఠ్యప్రణాళిక రూపొందించాలి.

# తెలుగు బాట - 7

## తెలుగు వాచకం

## ఏడవ తరగతి (ప్రథమ భాష)

### పాఠ్యపుస్తక అభివృద్ధి, ప్రచురణ సమితి

**శ్రీ ప్రవీణ్ ప్రకాష్** I.A.S
ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పాఠశాల విద్య,
ఆంధ్రప్రదేశ్

**శ్రీ ఎస్. సురేష్ కుమార్** I.A.S
కమీషనర్, పాఠశాల విద్య, ఆంధ్రప్రదేశ్

**శ్రీ బి. శ్రీనివాసరావు** I.A.S
స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, సమగ్ర శిక్ష, ఆంధ్రప్రదేశ్

**శ్రీ కె. రవీంద్రనాథ్ రెడ్డి,** M.A., B.Ed.,
సంచాలకులు, ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయం,
ఆంధ్రప్రదేశ్

**డా॥ బి. ప్రతాప్ రెడ్డి** M.A., B.Ed., Ph.D
సంచాలకులు, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ, ఆంధ్రప్రదేశ్

### కార్యక్రమ సమన్వయకర్త

**డా॥ జి. కేశవ రెడ్డి,** M.Sc., M.Sc., M.Ed., M.Phil., Ph.D
ఆచార్యులు, విద్యాప్రణాళిక పాఠ్యపుస్తక విభాగము,
రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణా సంస్థ, ఆంధ్రప్రదేశ్

### సమన్వయకర్త

**డా. కాటాబత్తిన సుబ్రహ్మణ్యం,** M.Sc; M.A; M.Ed; M.Phil; Ph.D;
ఆచార్యులు, రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ, ఆంధ్రప్రదేశ్

### సంపాదకులు

**ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి**
విశ్రాంత ఆచార్యులు, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం,
అనంతపురం.

**ఆచార్య సి.మృణాళిని**
విశ్రాంత ఆచార్యులు, తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాద్,
తెలుగుశాఖాధిపతి, సిలికానాంధ్ర విశ్వవిద్యాలయం, అమెరికా.

**ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి**
విశ్రాంత ఆచార్యులు,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

**డా॥ కానుకొల్లు బాలకృష్ణ**
అధ్యక్షులు, తెలుగు విభాగం, ఎస్.ఆర్.ఆర్ & సి.వి.ఆర్
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విజయవాడ

**ఆచార్య డా. డి. చంద్రశేఖరరెడ్డి**
విశ్రాంత ప్రధానాచార్యులు,
ఆంధ్ర సారస్వత పరిషత్ ప్రాచ్యకళాశాల, హైదరాబాదు

**© Government of Andhra Pradesh, Amaravati**

*First Published 2021*
*New Impression - 2022, 2023, 2024*

**All rights reserved**

No part of this publication may be reproduced, stored in a retrieval system, or transmitted, in any form or by any means without the prior permission in writing of the publisher, nor be otherwise circulated in any form of binding or cover other than that in which it is published and without a similar condition including this condition being imposed on the subsequent purchaser.

The copyright holder of this book is the Commissioner of School Education, Amaravati, Andhra Pradesh.

This book has been printed on 70 G.S.M. SS Maplitho

Title Page 220 G.S.M. White Art Card

**సమగ్ర శిక్షా, పాఠశాల విద్యాశాఖ,**

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ**

Printed in India
at the A.P. Govt. Text Book Press
Amaravati
Andhra Pradesh

# వందే మాతరం

– బంకించంద్ర ఛటర్జీ

వందే మాతరం వందే మాతరం
సుజలాం సుఫలాం మలయజ శీతలాం
సస్యశ్యామలాం మాతరం వందే మాతరం
శుభ్రజ్యోత్స్నాపులకిత యామినీం
పుల్లకుసుమిత ద్రుమదళ శోభినీం
సుహాసినీం సుమధుర భాషిణీం
సుఖదాం వరదాం మాతరం వందే మాతరం.

# మా తెలుగు తల్లి

*- శంకరంబాడి సుందరాచారి*

మా తెలుగు తల్లికి మల్లెపూదండ
మా కన్నతల్లికి మంగళారతులు
కడుపులో బంగారు కనుచూపులో కరుణ
చిరునవ్వులో సిరులు దొరలించు మా తల్లి
గలగలా గోదారి కదలిపోతుంటేను
బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను
బంగారు పంటలే పండుతాయి
మురిపాల ముత్యాలు దొరలుతాయి
అమరావతీ నగర అపురూప శిల్పాలు
త్యాగయ్య గొంతులో తారాడు నాదాలు
తిక్కయ్య కలములో తియ్యందనాలు
నిత్యమై, నిఖిలమై నిలిచియుండేదాక
రుద్రమ్మ భుజశక్తి, మల్లమ్మ పతిభక్తి
తిమ్మరుసు ధీయుక్తి, కృష్ణరాయల కీర్తి
మా చెవుల రింగుమని మారుమ్రోగేదాక
నీ ఆటలే ఆడుతాం – నీ పాటలే పాడుతాం
జై తెలుగు తల్లీ ! జై తెలుగు తల్లీ! జై తెలుగు తల్లీ!

## జాతీయ గీతం

- రవీంద్రనాథ్ ఠాగూర్

జనగణమన అధినాయక జయహే!
భారత భాగ్యవిధాతా!
పంజాబ, సింధు, గుజరాత, మరాఠా,
ద్రావిడ, ఉత్కళ, వంగా!
వింధ్య, హిమాచల, యమునా, గంగా!
ఉచ్ఛల జలధి తరంగా!
తవ శుభనామే జాగే!
తవ శుభ ఆశిష మాఁగే
గాహే తవ జయగాథా!
జనగణ మంగళదాయక జయహే!
భారత భాగ్య విధాతా!
జయహే! జయహే! జయహే!
జయ జయ జయ జయహే!!

## ప్రతిజ్ఞ

- పైడిమర్రి వెంకటసుబ్బారావు

భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరూ నా సహోదరులు.

నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం. దీనికి అర్హత పొందడానికై సర్వదా నేను కృషి చేస్తాను.

నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్ని గౌరవిస్తాను. ప్రతివారితోను మర్యాదగా నడుచుకొంటాను. జంతువులపట్ల దయతో ఉంటాను.

నా దేశంపట్ల, నా ప్రజలపట్ల సేవానిరతితో ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను.

వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.

## పాఠ్యపుస్తక రూపకర్తలు

**డా॥ ఎన్.కె.మద్దిలేటి**
పాఠశాల సహాయకులు, తెలుగు,
జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల, పసుపుల,
బనగానపల్లె మం., కర్నూలు.

**పెద్దింటి శారంగపాణి**
పాఠశాల సహాయకులు, తెలుగు
జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల, ఉన్నవ, గుంటూరు.

**గన్నమనేని గంగాధర్ నాయుడు**
పాఠశాల సహాయకులు, తెలుగు
వై.వి.యస్.పురపాలక బాలికోన్నతపాఠశాల
ప్రొద్దుటూరు, కడప.

**కె.శంకర్ రావు**
పాఠశాల సహాయకులు, తెలుగు,
ప్రభుత్వ ఉన్నతపాఠశాల, పత్తికొండ, కర్నూలు.

**డా॥ యం.ప్రసాద్**
పాఠశాల సహాయకులు, తెలుగు
ప్రభుత్వ ఉన్నతపాఠశాల, రాపూరు, నెల్లూరు.

**గుండేపల్లి ప్రభావతి**
పాఠశాల సహాయకులు, తెలుగు
జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల,
అంతర్వేదిపాలెం, తూర్పుగోదావరి.

**పొట్నూరు కోటిబాబు**
పాఠశాల సహాయకులు, తెలుగు,
ప్రభుత్వగిరిజనసంక్షేమ ఆశ్రమ ఉన్నతపాఠశాల
లబ్బ, శ్రీకాకుళం.

**ముతుకూరి గోపాలాచార్యులు**
పాఠశాల సహాయకులు, తెలుగు
జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల, బురాన్‌దొడ్డి,
కర్నూలు.

**నంబూరు శ్రీనివాసరాజు**
పాఠశాల సహాయకులు, తెలుగు,
జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల,
రఘుమండ, విజయనగరం.

**డా. మాలేపట్టు పురుషోత్తమాచారి**
పాఠశాల సహాయకులు, తెలుగు
జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల,
నాగరాజుకుప్పం, చిత్తూరు.

**డా. షేక్ బాబూజి**
పాఠశాల సహాయకులు, తెలుగు
జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల,
మేదినరావుపాలెం, పశ్చిమగోదావరి.

**డా. ఇలింద్రపర్తి శ్రీనివాసరావు**
పాఠశాల సహాయకులు, తెలుగు
ప్రభుత్వ ఉన్నతపాఠశాల,
కోటదిబ్బ, పశ్చిమగోదావరి.

**పొతకమూరి మధుబాబు**
పాఠశాల సహాయకులు, తెలుగు,
మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల,
గుండ్లసముద్రం, ప్రకాశం.

**శిష్టా శ్రీవేంకటాచలపతి**
ద్వితీయశ్రేణి ఉపాధ్యాయుడు
మండలపరిషత్ ప్రాథమికపాఠశాల
శ్రీరామనగర్‌కాలనీ, కాజులూరు, తూర్పుగోదావరి.

### సహాయ సమన్వయకర్త

**శ్రీమతి వి. శారదా దేవి**
M.A, M.A; M.Ed; M.Phil; PGCTE (EFLU)
రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ, ఆంధ్రప్రదేశ్.

### విషయ నిపుణులు

**డా. వేంపల్లి గంగాధర్**
పాఠశాల సహాయకులు,
పభుత్వ బాలుర పాఠశాల, ముద్దనూరు, వై.ఎస్.ఆర్ కడప

**వంగీపురం స్వర్ణలత**
పాఠశాల సహాయకులు,
జి.ప.ఉ.పాఠశాల, తాళ్ళపూడి, పశ్చిమగోదావరి

### చిత్రకారులు

**బత్తుల సాయి వెంకట రమేష్** చిత్రకారుడు,
జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల, మల్లవోలు, కృష్ణా జిల్లా.

### కవర్ పేజి & లేఅవుట్ డిజైనింగ్

**స్టార్‌మీడియా,** హైదరాబాద్
**స్టాక్‌ఎసార్ట్‌మెంట్,** బాపట్ల

## ఉపాధ్యాయులకు సూచనలు

★ విద్యాసంవత్సరం ప్రారంభంలోనే ప్రారంభ పరీక్ష నిర్వహించాలి. పిల్లలస్థాయిని అంచనావెయ్యాలి.

★ పాఠ్యపుస్తకంలో రాయడానికి అవకాశంలేని అభ్యాసాలను నోటుపుస్తకాలలో రాయించాలి.

★ పదజాలం, వ్యాకరణాంశాల అభ్యాసాలు మాత్రం ఎక్కువగానే ఉన్నాయి. విద్యార్థికి భాషమీద పట్టురావాలంటే ఉపాధ్యాయులు ఆ అభ్యాసాలను, వ్యక్తిగతకృత్యాలు, జట్టుకృత్యాల ద్వారా శ్రద్ధతో చేయించాలి.

★ ప్రాచీన,ఆధునిక సాహిత్యాల నుండి పాఠ్యాంశాలను సేకరించారు. ఉపాధ్యాయులు పాఠ్యబోధనకు ముందే సంబంధిత పాఠాల మూలాలను, నేపథ్యాలను, పాఠ్యభాగ ఉద్దేశాలను ఆకళింపు చేసుకొని విద్యార్థులకు వివరించాలి.

★ పాఠ్యాంశాన్ని బోధిస్తున్నప్పుడు సందర్భానుసారంగా నైతికవిలువలు, మానవవిలువలు, కళలు, సంస్కృతి, జాతీయత, సమానత్వం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై చర్చింపజేయాలి. పిల్లలలో మంచిపరివర్తనకోసం ప్రయత్నించాలి.

★ ప్రతిపాఠానికీ ముందిచ్చిన ఉన్ముఖీకరణచిత్రాలను ఉపయోగించి పిల్లల ఆలోచనలకు, వివేచనకు, మాట్లాడే సామర్థ్యానికి పదునుపెట్టాలి.

★ పాఠాల స్వభావాన్నిబట్టి బోధనావ్యూహాలను ఎంపికచేసుకోవాలి. పిల్లలకు ప్రశ్నించే అవకాశం కల్పించడం అందరినీ భాగస్వాములనుచేయడం ప్రధానం.

★ ఇందుకోసం ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా బోధించాలి. ప్రతి పాఠానికీ కింది విధంగా పాఠ్యప్రణాళిక రాయాలి.

★ 1. పాఠం పేరు 2. అవసరమైన పీరియడ్ల సంఖ్య 3. సాధించాల్సిన సామర్థ్యాలు 4. పీరియడ్ల విభజన

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం | బోధనావ్యూహం | సామగ్రి / వివరాలు |
|---|---|---|---|
| | | | |

★ పాఠంలోని విషయాన్ని అర్థమయ్యేలా చెప్పడానికి 3 నుండి 4 పీరియడ్లు కేటాయించుకోవాలి. అభ్యాసాలు, ప్రశ్నలు-జవాబులు పిల్లలతో సొంతంగా రాయించడానికి ఎక్కువ పీరియడ్లు కేటాయించుకోవాలి.

★ తప్పనిసరిగా ప్రతిపాఠానికి ఉక్తలేఖనం నిర్వహించాలి. ఇవిచేయండి అభ్యాసాలను తరగతిలో చర్చించాలి. విద్యాప్రమాణాలను తగ్గించలేదు. 7 విద్యాప్రమాణాలను 3 విద్యాప్రమాణాలుగా మార్చడమైనది.

**I. అవగాహన - ప్రతిస్పందన : (వినడం మాట్లాడటం - చదవడం రాయడం)**

★ ఈ అభ్యాసాలను, ప్రశ్నలను పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించాలి.

★ జట్లలో చర్చింపజేసి తర్వాత వ్యక్తిగతంగా చేసేటట్లు చూడాలి.

N9N7D6

**II. వ్యక్తీకరణ - సృజనాత్మకత : (స్వీయరచన - సృజనాత్మకత - ప్రశంస)**

★ ప్రశ్నలను తరగతి గదిలో చర్చింపజేసి, జవాబులను రాబట్టి, దోషసవరణచేసి వ్యక్తిగతంగా రాసేటట్లు ప్రోత్సహించాలి.

**III. భాషాంశాలు : (పదజాలం - వ్యాకరణాంశాలు)**

★ పదజాలం, వ్యాకరణాంశాల బోధనలో ఉపాధ్యాయులపాత్ర ఎక్కువగా ఉండాలి. ప్రతివిషయాన్నీ సోదాహరణంగా వివరించి రాయించాలి.

★ **ప్రాజెక్ట్‌పని :** విద్యార్థుల సౌలభ్యం దృష్ట్యా 4 నిర్మాణాత్మక మూల్యాంకనాలకు 4 ప్రాజెక్ట్‌లు మాత్రమే ఇవ్వడమైనది. ఈ ప్రాజెక్ట్ పనులను సులభశైలిలో జట్టుకృత్యాలుగా లేదా వ్యక్తిగతకృత్యాలుగా చేయించాలి.

# విద్యార్థులకు సూచనలు

పిల్లలూ! .....

మీరందరూ ధారాళంగా చదవగలగాలి. తెలిసినదానిని గురించి సొంతంగా రాయగలగాలి. ఒకవేళ మీరు చదవడం, రాయడం చేయలేకపోతే ఉపాధ్యాయుల సాయంతో చదవడం, రాయడం తప్పనిసరిగా నేర్చుకోవాలి.

R9L2P3

మీకోసం మీరు నేర్చుకోవలసిన అంశాలను దృష్టిలో పెట్టుకొని తెలుగు పుస్తకాన్ని రూపొందించారు. ఈ పుస్తకంలో మీరు సాధించాల్సిన అభ్యసనఫలితాలు గురించి ఒకపేజీలో ఇచ్చారు. విద్యాసంవత్సరం పూర్తయ్యేసరికి మీరు వాటిని చేయగలగాలి. అవి చదివి తెలుసుకోండి.

★ ప్రతిపాఠం ప్రారంభంలో చిత్రం ఉంటుంది. దానిని గురించి మాట్లాడండి. ప్రశ్నలకు జవాబులు చెప్పండి.

★ మీ ఉపాధ్యాయుడు పాఠంలోని విషయంగురించి బోధించేటప్పుడు తప్పనిసరిగా మీకుతెలియని పదాలు, వాక్యాలు విషయాలను గురించి ప్రశ్నించండి, చర్చించి తెలుసుకోండి.

★ తరగతిగదిలో చర్చలు జరుగుతున్నప్పుడు, జట్టుపనులు నిర్వహిస్తున్నప్పుడు మీరు కూడా పాల్గొనాలి, మాట్లాడాలి, అవసరం అయితే ప్రశ్నించాలి.

★ పాఠం తర్వాత 'ఇవిచేయండి' అనే పేరుతో అభ్యాసాలు ఉన్నాయి. వాటిని మీరు సొంతంగా పూర్తిచేయాలి. ప్రశ్నలకు మీరే ఆలోచించి సొంతంగా జవాబులు రాయాలి. ఎలాంటి పరిస్థితుల్లో గైడ్లు, స్టడీమెటీరియల్‌ను చూసి ప్రశ్నలకు జవాబులు రాయగూడదు. ఒకవేళ అలా రాస్తే నిర్మాణాత్మక మూల్యాంకనంలో మీకు మార్కులు ఇవ్వరు.

★ పాఠంలోని ప్రాజెక్టుపనులకు సంబంధించిన అభ్యాసాలను మీరు మీ మిత్రుల సహాయంతో చేయవచ్చు. వీటిని ఎలా చేయాలో మీ ఉపాధ్యాయుణ్ణి అడిగి తెలుసుకోండి. వీటిని చేసిన తర్వాత మీరు ఎలాచేశారు? ఏంచేశారు? ఏంనేర్చుకున్నారు? మీరే సొంతంగాచెప్పాల్సి ఉంటుంది.

★ సృజనాత్మకతలోని అంశాలను ఎలాచేయాలో తరగతిగదిలో మీ ఉపాధ్యాయుణ్ణి అడిగితెలుసుకోండి. మీరు తరగతిలో రాసిచూపాలి. దీనిపైన చర్చ జరిగిన తర్వాతే మీ నోటుపుస్తకాలలో రాయాలి.

★ వ్యక్తీకరణ సృజనాత్మకత అభ్యాసాలను మీరే సొంతంగా చేయండి. చేయలేని వాటిని గురించి మాత్రమే ఉపాధ్యాయుణ్ణి అడిగి తెలుసుకోండి.

★ అభ్యాసాలలో ఇచ్చిన భాషాంశాలలోని వ్యాకరణాంశాలు మీకు అర్థంకావడానికి మొదట ఉదాహరణలు ఇచ్చారు. వాటి ఆధారంగా మీకు అర్థమయ్యేలా సూత్రాన్ని ఇచ్చారు. కాబట్టి ఉదాహరణలను జాగ్రత్తగా పరిశీలించి వాటిని విశ్లేషించి సూత్రాన్ని తెలుసుకోండి.

★ ప్రతిపాఠంలో చివరకు 'నేనివి చేయగలనా?' అనే పట్టిక ఉంది. ఒక్కొక్క వాక్యాన్ని చదవండి. చేయగలిగితే 'ఔను' వద్ద '✓' పెట్టండి. చేయలేకుంటే 'కాదు' వద్ద '✓' పెట్టండి. వీటిలో మీరు చేయలేనివాటిని మీ ఉపాధ్యాయుడి సహాయంతో పునరభ్యాసం చేయండి.

★ ఉపవాచకం పాఠాలను మీరే సొంతంగా చదవండి. వాటిని గురించి మాట్లాడండి.

★ పాఠాలకు సంబంధించిన ఇతర పుస్తకాలను, గ్రంథాలను పాఠశాల గ్రంథాలయానికివెళ్ళి అడిగితీసుకొని చదవండి.

★ మీరు తప్పనిసరిగా వ్యాసాలు, లేఖలు, కరపత్రాలు, సంభాషణలు వంటివి రాయగలగాలి.

★ కొన్ని పాఠాలలో నాటకీకరణ చేయడం, ఏకపాత్రాభినయం చేయడం, గేయాలను రాగంతో పాడడం – అభినయంచేయడం, పద్యాలను కంఠస్థంచేసి రాగభావయుక్తంగా పాడడంవంటివి ఉన్నాయి. వీటిని మీరు తప్పనిసరిగా సాధనచేయండి.

★ సృజనాత్మకతలోని అంశాలను మీరురాసిన తరవాత ఒక పుస్తకరూపంలో సంకలనంచేసి తరగతిలో ప్రదర్శించండి.

# సెమిస్టర్ - 1

# విషయసూచిక


| క్ర.సం. | పాఠం | ప్రక్రియ | ఇతివృత్తం | కవి / రచయిత | మాసం | పుట |
|---|---|---|---|---|---|---|
| | సంసిద్ధతా కార్యక్రమం | | | | జూన్ | |
| 1. | అక్షరం | వచన కవిత | చదువు విశిష్టత | రావినూతల ప్రేమకిశోర్ | జులై | 1 |
| 2. | మాయాకంబళి | జానపదకథ | మానవ స్వభావం | కలువకొలను సదానంద | ఆగస్టు | 12 |
| 3. | చిన్నిశిశువు | పదకవిత | శైశవ వర్ణన | తాళ్ళపాక అన్నమయ్య | | 23 |
| 4. | మఱ్ఱిచెట్టు | స్వగతం/ స్కెచ్ | సహానుభూతి | త్రిపురనేని గోపిచంద్ | సెప్టెంబర్ | 33 |
| 5. | పద్య పరిమళం | శతకం | నైతికవిలువలు | శతక కవులు | అక్టోబర్ | 47 |
| 6. | మన విశిష్ట ఉత్సవాలు (ఉపవాచకం) | వ్యాసం | సంస్కృతి - సంప్రదాయాలు | రచయితల బృందం | | 61 |
| | 1. సిరిమానోత్సవం | | | | జులై | |
| | 2. గుణదల మేరీమాత ఉత్సవం | | | | జులై | |
| | 3. కోటప్పకొండ ప్రభల తిరునాళ్ళు | | | | ఆగష్టు | |
| | 4. రొట్టెల పండుగ | | | | ఆగష్టు | |
| | 5. అహోబిలం పార్వేట ఉత్సవం | | | | సెప్టెంబరు | |
| | 6. లేపాక్షి ఉత్సవాలు | | | | అక్టోబరు | |


**సంస్కృతం కాంపోజిట్‌కోర్సుగా చదివేవారు ఉపవాచకం మినహా అన్ని పాఠ్యాంశాలను చదవాలి.**

★ **నక్షత్రం గుర్తుఉన్న పద్యాలను విద్యార్థులు కంఠస్థం చేయాలి.**

## ఈ పాఠ్య పుస్తకం ద్వారా విద్యార్థులు సాధించాల్సిన అభ్యసన ఫలితాలు

### I. అవగాహన - ప్రతిస్పందన (వినడం మాట్లాడటం - చదవడం, రాయడం)

★ విని చదివి తెలుసుకున్న రచనలు, సంఘటనల వంటి అంశాలపైన అవగాహనతో అభిప్రాయాలు వ్యక్తీకరించడం.

★ ఉపన్యాసాలు, వార్తలు విని అర్థం చేసుకోవడం, ప్రతిస్పందించడం.

★ విభిన్న భాషలు, కట్టుబాట్లు, ఆచారవ్యవహారాలకు సంబంధించిన వృత్యాసాలను గురించి మాట్లాడగలగడం, ఆసక్తిని, అభిరుచిని పెంచుకోవడం.

★ పద్యం, వచనం, గేయం మొదలైన సాహితీప్రక్రియలను శైలీభేదంతో అవగాహనతో చదవడం

★ వ్యాసరూప అంశాలను, లేఖలను చదివి అర్థంచేసుకోవడం.

★ చదివిన అంశాల్లోని కీలకాంశాలు గుర్తించడం, రాయడం, శీర్షికలు సూచించడం, విశ్లేషించడం, అభిప్రాయాలు చెప్పడం.

### II. వ్యక్తీకరణ - సృజనాత్మకత (స్వీయరచన - సృజనాత్మకత - ప్రశంస)

★ తాము అర్థం చేసుకున్న విషయాలను, తెలిసిన విషయాలను స్పష్టంగా లిఖిత రూపంలో రాయగలగడం.

★ పాఠాలనుండి సూచిత అంశాలకు సారాంశాలు, భావాలు రాయడం.

★ విరామచిహ్నాలను పాటిస్తూ, సరైన పదజాలాన్ని ఉపయోగిస్తూ దోషరహితంగా రాయగలగడం.

★ తాను చదివిన, విన్న, అనుభవంలో ఉన్న, చూసిన అంశాలను వర్ణించి చెప్పడం, బొమ్మలుగీయడం.

★ వివిధ భాషా ప్రక్రియలను మార్చగలగడం, సంభాషణలు, నాటకీకరణం చేయడం.

★ ఆత్మకథ, డైరీ వంటి వివిధ వ్యవహారరూపాలు రాయడం.

★ భాషా ప్రయోగాలలోని సూక్ష్మాంశాలను, భాషానిర్మాణాలను, శైలిని గమనిస్తూ వాటిని ప్రశంసించడం.

★ తరగతిలోని బాలురు, బాలికలు, ప్రత్యేకావసరాల పిల్లలు అందరు సమానమని గుర్తించి, వారు చేసిన మంచి పనులను ప్రశంసించడం.

### III. భాషాంశాలు (పదజాలం - వ్యాకరణాంశాలు)

★ నిఘంటువును ఉపయోగిస్తూ అర్థాలు, పర్యాయపదాలు వంటివి స్వీయ అధ్యయనం చేయడం

★ ప్రకృతి వికృతులు, జాతీయాలు, సామెతలు గుర్తించడం. అవగాహన చేసుకొని, కొత్త పదాలను సొంతవాక్యాల్లో ఉపయోగించడం.

★ వ్యాకరణాంశాలపట్ల అవగాహన పెంచుకోవడం. (అక్షరమాల - విభాగాలు, భాషాభాగాలు, పారిభాషిక పదవిజ్ఞానం, విభక్తులు, సంధులు, సమాసాలు, వాక్యభేదాలు)

★ వ్యాకరణ నియమాలను స్పష్టంగా గుర్తించగలగడం. సందర్భానుసారంగా వ్యాకరణ దోషాలు లేకుండా రాయడం.

# 1 అక్షరం

U8R9V2

### వినడం - ఆలోచించి మాట్లాడడం



1. చిత్రంలో ఎవరెవరున్నారు ?
2. తల్లి ఏం చేస్తోంది?
3. పిల్లలు ఏం చేస్తున్నారు?

**ఉద్దేశం:** అక్షరజ్ఞానం అందించిన ఆదిగురువు అమ్మ. ఆమెను గౌరవిస్తూ, అక్షరం యొక్క గొప్పతనాన్ని తెలియజేయడమే ఈ పాఠం ఉద్దేశం

### కవి పరిచయం



## రావినూతల ప్రేమకిషోర్

**(01.08.1965 - 07.10.2019)**

రావినూతల ప్రేమకిషోర్ ప్రకాశం జిల్లాలోని కొండపి గ్రామంలో జన్మించారు. వీరి తల్లిదండ్రులు మరియమ్మ, అంకయ్యలు. శ్రమవర్ధీత, అజమాయిషీ, నిశి, రెక్కల పుడమి, ఇంకుచుక్క, నిశ్శబ్ద గాయం, టామి, కల్లం దిబ్బ మొదలైన రచనలు చేశారు. వీరు రాసి నటించిన అనేక నాటికలకు రాష్ట్ర, రాష్ట్రేతర ప్రదేశాలలో ఉత్తమ అవార్డులు, ప్రశంసలు లభించాయి. ఈ పాఠ్యాంశం 'నలుగురమవుదాం' అనే కవితా సంపుటిలోనిది.

# అక్షరం




నా గుండె గవాక్షాల్లోనే కాదు
మూసిన నా కనురెప్పలపై కూడా
అక్షరాలు కవాతు చేస్తుంటాయ్
నిరంతరం నిద్రాభంగం చేస్తుంటాయ్

కలలు రాలని రాత్రి
అక్షరాలంటని తావు
నా కంటికి, ఒంటికి లేవుగా...
ఎంతైనా
పంతులమ్మగారి బుజ్జోణ్ణి
ఆ మాత్రం అక్షరానుబంధం ఉండదా...!?
నిద్ర పోయేటప్పుడు
అమ్మ అచ్చరాల కంబళి కప్పిందేమో.



చిన్నప్పుడు అన్నప్రాసననాడు
తలాఒకటి నా చుట్టూరేసి
పట్టుకోమన్నప్పుడు
ఎర్రగా బాగుందని పెన్ను పట్టుకుంటే
అమ్మ అక్కున చేర్చుకుని
కలంపట్టిన బిడ్డ ఇలను దున్నుతాడని
ఆనందంతో
ఒళ్ళంతా ముద్దుల్తో నింపిందట

అమ్మ ముద్దులో
అక్షరాల ముద్దర్లున్నట్టుంది
ఒంటినిండా అచ్చరాల సుద్దలే...
ఇప్పుడు
ప్రతి అక్షరంలోనూ అమ్మే కన్పిస్తుంది
నన్నో అక్షరాల పుట్టని చేసిన
అమ్మకు అక్షరాన్నవ్వడం మినహా
మరేమివ్వగలను?

**బాల్యంలో మనకు అమ్మ ఎన్నో సేవలు చేసింది కదా! ఇప్పుడు మీరు అమ్మకు ఎలాంటి సేవలు చేయగలరో చర్చించండి?**

## సారాంశం

(కవి అక్షరాలతో తనకున్న అనుబంధాన్ని గురించి ఇలా చెబుతున్నాడు.)

నేను బాగా చదువుకుని ఈ ప్రపంచాన్ని మరింత మెరుగుపరచాలన్న అమ్మ ఆశ నా గుండె చప్పుడయింది. ఇప్పుడు నాకు కళ్ళు మూసినా తెరచినా అక్షరాలే కనిపిస్తుంటాయి. నేను బాగా చదివి గొప్ప ప్రయోజకుడిని కావాలనే అమ్మ కోరిక నన్ను నిద్రపోనివ్వడం లేదు. అమ్మ ఆశలు నన్ను ఒళ్లంతా కళ్లు చేసుకుని శ్రద్ధగా చదువుకునేలా చేశాయి. అందుకే ఆ అక్షరాలు కలలో కూడా నన్ను వదిలి పెట్టడం లేదు.

మా అమ్మే నా పంతులమ్మ. నేను ఆమెకు బుజ్జోడిని. కాబట్టి పడుకునేటప్పుడు కూడా నాకు అక్షరాలను నూరిపోసింది. అందుకేనేమో చదువుపట్ల నాకు ఆసక్తి పెరిగింది.



అన్నప్రాశన రోజు నా ముందు పెట్టిన అన్ని వస్తువుల్ని వదిలేశాను. ఎర్రని కలాన్ని పట్టుకున్నాను. కలం పట్టిన నేను లోకానికి మేలు చేస్తానని ఆనందంతో అమ్మ మురిసిపోయింది. అమ్మ మాటల్లోనే కాదు ముద్దుల్లోను అక్షరాల గుర్తులు ఉన్నాయి. అందుకే నేను అమ్మను ప్రేమించినంతగా అక్షరాన్ని ప్రేమిస్తాను. అమ్మ కోసం బాగా చదువుకుని అమ్మ కోరిక తీరుస్తాను. అమ్మను గుర్తు చేసుకొంటూ అమ్మ ప్రేమను తెలిపే అక్షరంగా మారుతాను.

## ఇవి చేయండి

**ఉపాధ్యాయుడు చెప్పిన కింది పదాలను (ఉక్తలేఖనం) రాయండి.**

గవాక్షం – కవాతు – నిద్రాభంగం – కంబళి – అన్నప్రాసన – అక్షరాలు – దున్నుతాడు

## అవగాహన – ప్రతిస్పందన

1. ఈ వచనకవితను భావయుక్తంగా చదవండి.
2. మీరు తల్లిదగ్గర ఏమి నేర్చుకున్నారు?
3. మీ చిన్నప్పటి అనుభవాలను తెల్పండి.

**4. కింది దేశభక్తి గేయాన్ని ఆలపించండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**



జయము జయము భరతమాత జయము నీకు జగన్మాత
ఈ జగాన సాటి ఎవ్వరే ఓ యమ్మ నీకు

గంగ యమున గోదారీ సింధు కృష్ణ కావేరీ
బ్రహ్మపుత్ర తుంగభద్ర తపతీ నర్మద పెన్నా
పొంగి పొరలె తరంగాలు నీ మెడలో హారాలు
జీవనదుల కన్నతల్లివే ఓయమ్మ నీవు ॥ జయము జయము ॥

హిమ వింధ్యా పర్వతాలు దేవతలకు నిలయాలు
దట్టమైన అరణ్యాలు మహామునుల స్థావరాలు
పసిడి పంట క్షేత్రాలు పంచలోహ ఖనిజాలు
నిజముగ నువు రత్న గర్భవే ఓయమ్మ నీవు ॥ జయము జయము ॥

లోకమంత చీకటిలో తల్లడిల్లుతున్నప్పుడు
నాగరికత లేక నరులు పామరులై ఉన్నప్పుడు
వేదాలను వెతికితెచ్చి జ్ఞాన భిక్ష పెట్టినావు
నిజముగ నీవు జగద్గురువువే ఓయమ్మ నీవు ॥ జయము జయము ॥

**ప్రశ్నలు**

అ) మన జీవనదులు ఏవి?

ఆ) మహామునుల స్థావరాలు ఏవి?

ఇ) ఎవరికి జయము పలకాలి?

ఈ) పై గేయం ఆధారంగా ప్రశ్నలు తయారుచేయండి?



## వ్యక్తీకరణ - సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. అక్షరాలు ఎక్కడ కవాతు చేస్తాయని కవి అన్నాడు?
2. అన్నప్రాసన నాడు జరిగిన సంఘటన గురించి రాయండి?

**ఆ) కింది ప్రశ్నలకు 8 నుంచి 10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. 'అక్షరం' గేయం సారాంశాన్ని మీ సొంతమాటల్లో రాయండి.
2. జీవితంలో చదువు విలువ ఎంత ముఖ్యమో తెల్పండి.
3. అమ్మప్రేమ గురించి మీ మాటల్లో రాయండి.



## భాషాంశాలు

**అ) కింది పదాలకు అర్థాలను జతపరచండి.**



| | | | |
|---|---|---|---|
| 1. | గవాక్షం | (   ) | అ) నేల |
| 2. | తావు | (   ) | ఆ) హృదయం |
| 3. | గుండె | (   ) | ఇ) కిటికీ |
| 4. | ఇల | (   ) | ఈ) స్థానం |

**ఆ) కింద ఇచ్చిన పదాలకు సమానార్థకపదాలు(పర్యాయపదాలు) వాక్యాలలో గుర్తించి రాయండి.**

1. శరీర శుభ్రతను పాటించాలి. తనువును ఆరోగ్యంగా ఉంచుకోవాలి.

   కాయం: ..................................................

2. నేత్రాలను సురక్షితంగా ఉంచుకోవాలి. నయనాలు లేనిదే లోకాన్ని చూడలేము.

   కన్ను: ..............................................................

3. అమ్మను మించిన దైవం లేదు. మాతను పూజించాలి

   తల్లి: ..............................................................



**ఇ) కింది పదాలలో ప్రకృతి వికృతులను గుర్తించి రాయండి.**

**నిదుర, అమ్మ, రాత్రి, ముద్దర, అంబ, అక్కరము, నిద్ర, రాతిరి, అక్షరము, ముద్ర**

| | ప్రకృతి | వికృతి |
|---|---|---|
| 1 | .............................. | .............................. |
| 2 | .............................. | .............................. |
| 3 | .............................. | .............................. |
| 4 | .............................. | .............................. |
| 5 | .............................. | .............................. |

## ఈ) కింది ఖాళీలను సరైన పదాలతో పూరించండి.



1. నేను తల్లిదండ్రులను ..............................

   ఎల్లప్పుడూ గౌరవిస్తాను, కొంచెం గౌరవిస్తాను

2. నేను కష్టపడి ..............................

   చదువుతాను, చదవను

3. చేతులు శుభ్రంగా ..............................

   కడుగుతాను, కడగను

4. మంచి వాళ్ళతో స్నేహం ..............................

   చేస్తాను, చేయను.

## ఉ) కింది పదాలకు సొంత వాక్యాలు రాయండి.



ఉదా: అక్షరాలు

మన జీవితానికి అక్షరాలు మార్గదర్శకాలు

1. నిరంతరం ....................................
2. అనుబంధం ....................................
3. కంబళి ....................................
4. నిద్రాభంగం ....................................
5. అక్కునచేర్చుకొను ....................................

## ఊ) కింది వాక్యాలు ఆధారంగా మన బంధుత్వాలను గళ్ళలో నింపండి.

**అడ్డం**

1. తల్లికి ఇంకొక పేరు (2)
2. తల్లిగారి చెల్లిని ఏమని పిలుస్తారు. (3)
3. తల్లిగారి అక్కను ఏమని పిలుస్తారు. (3)

**నిలువు**

1. తల్లిగారి తల్లిని ఏమని పిలుస్తారు. (3)
2. తండ్రిగారి తల్లిని ఏమని పిలుస్తారు. (3)
3. తండ్రిగారి అక్క/చెల్లిని ఏమని పిలుస్తారు (తిరగబడింది) (3)

| | | | | |
|---|---|---|---|---|
| 1 | | ● | 2 | ● |
| | ● | 2 | | |
| | ● | ● | | |
| ● | ● | ● | ● | 3 |
| ● | 3 | | | ● |



## వ్యాకరణాంశాలు

### పూర్వ పదం - పర పదం

**అ) కింది వాక్యాలను గమనించండి. గీతగీసిన పదాలను విడదీయండి.**



1. దేశమును ప్రేమించుమన్నా మంచి యన్నది పెంచుమన్నా.
2. భద్రాద్రి రామయ్య కళ్యాణం కన్నుల పండువగా జరుగుతుంది.
3. చదువు నేర్పే గురువులందరికి మా వందనం.
4. శ్రీశైల మల్లన్న కోరిన కోర్కెలు తీర్చే దైవం.
5. సింహాద్రి అప్పన్న నమ్మిన భక్తులకు కొండంత అండ.

ఉదా: రామయ్య = రామ + అయ్య

1. ప్రేమించుమన్న = __________ + __________
2. పెంచుమన్న = __________ + __________
3. గురువులందరికి = __________ + __________
4. అప్పన్న = __________ + __________
5. మల్లన్న = __________ + __________

పై ఉదాహరణలను గమనించండి. వీటిలో స్వతంత్రమైన అర్థం కలిగిన రెండు శబ్దాలు ఉన్నట్లు గుర్తించారు కదా ! ఇలాస్వతంత్రమైన అర్థం కలిగిన మొదటి పదానికి **పూర్వపదం** అని పేరు. రెండవ పదానికి **పరపదం** అని పేరు.

### పూర్వ స్వరం - పర స్వరం

**ఆ) కింది వాక్యాలను గమనించండి. గీత గీసిన పదాలను విడదీయండి.**



1. దేశమంటే మనుషులోయ్ అని గురజాడ అన్నారు.
2. గురువులందరు మనకు ఆదర్శం.
3. ప్రపంచమందు భారతీయులు చాలా దేశాల్లో ఉన్నారు.
4. అల్లూరి, టంగుటూరి వంటి వారంతా స్వాతంత్ర్య సమరయోధులు.
5. అమూల్యమైన పుస్తకాలకు నిలయం గ్రంథాలయం.

ఉదా: దేశమంటే = దేశము + అంటే

పై ఉదాహరణలో పూర్వపదం చివరలోఉన్న 'ము' ను విడదీస్తే 'మ్ +ఉ '= 'ము'. ఇలా పూర్వపదం చివర ఉన్న 'ఉ' అనే అచ్చును **పూర్వస్వరం** అంటారు. పరపదమైన 'అంటే' అనే పదంలోని మొదటి అచ్చు 'అ'. దీనినే **పరస్వరం** అని అంటారు. అచ్చులను **స్వరాలు / ప్రాణాలు / నాదాలు** అని కూడా అంటారు.

కింది పదాలను గమనించండి. పూర్వ పర స్వరాలను గుర్తించి రాయండి.

| సంధిపదం | విడదీయడం | పూర్వస్వరం | పరస్వరం |
|---|---|---|---|
| గురువులందరికి | ____________ | ________ | ________ |
| ప్రపంచమందు | ____________ | ________ | ________ |
| వారంతా | ____________ | ________ | ________ |

## సంధి

### ఇ) కింది వాక్యాలను చదవండి



1. కృష్ణుడతడు మహాభారతానికి సూత్రధారి.
2. దుర్యోధనుడెక్కడ అంటూ భీముడు గర్జించాడు.
3. సీత పుట్టినింటికి మెట్టినింటికి పేరు తెచ్చింది.
4. చిన్నదైన ఉడుత రామునికి సాయం చేసింది.

### ఈ) గీత గీసిన పదాలను విడదీయండి. కలిసినప్పుడు జరుగుతున్న మార్పులను గమనించండి.

ఉదా : కృష్ణుడతడు = కృష్ణుడు + అతడు

1. దుర్యోధనుడెక్కడ = ____________ + ____________
2. పుట్టినింటికి = ____________ + ____________
3. మెట్టినింటికి = ____________ + ____________
4. చిన్నదైన = ____________ + ____________
5. చూసినవన్నీ = ____________ + ____________

పై ఉదాహరణలో పూర్వస్వరం (ఉ), పరస్వరం (అ) కలిశాయి. ఆ రెంటికి బదులుగా పరస్వరం ఒక్కటే వచ్చి ముందు ఉన్న హల్లుతో కలిసింది. దీనికే 'సంధి' అని పేరు.

### ఉ) కింది పదాలను విడదీసి రాయండి

ఉదా: అక్షరాలంటని = అక్షరాలు + అంటని

1. కప్పిందేమో = ______ + ______
2. బాగుందని = ______ + ______
3. మరేమివ్వగలరు = ______ + ______

### ఊ) కింది పదాలను కలిపి రాయండి.

ఉదా : అక్షరాన్ని + అవ్వడం = అక్షరాన్నవ్వడం

1. ముద్దర్లు + ఉన్నట్లు = ______
2. దున్నుతాడు + అని = ______
3. చుట్టూరు + ఏసి = ______

P4G1E6

## ద్వితీయా విభక్తి

### ఋ) కింది పట్టికను గమనించండి. వాక్య రూపంలో రాయండి.

| | | |
|---|---|---|
| లక్ష్మణుడు<br>దేవుడు<br>చెట్లు<br>తల్లిదండ్రులు<br>పర్యావరణం | (ని / ను) | కాపాడాలి<br>గౌరవించాలి<br>భార్య ఊర్మిళ<br>నమ్మేవారు ఆస్తికులు<br>నరకవద్దు |



ఉదా: లక్ష్మణుని భార్య ఊర్మిళ

1. ______
2. ______
3. ______
4. ______

పై ఉదాహరణ వాక్యాల్లో 'ని – ను' అనే విభక్తి ప్రత్యయాలు వాక్యాలను అర్థవంతం చేశాయి. ఇలా వాక్యంలోని పదాల మధ్యన చేరే నిన్, నున్, లన్, కూర్చి, గురించి అనే ప్రత్యయాలను **ద్వితీయావిభక్తి** అంటారు. సాధారణంగా కర్మను గురించి తెలియజేసే సందర్భంలో ద్వితీయావిభక్తి ప్రత్యయాలను ఉపయోగిస్తాం.



## ప్రాజెక్టుపని

అక్షరం / అమ్మకు సంబంధించిన పాటలను సేకరించండి. తరగతి గదిలో పాడండి.

## నీతి పద్యం

ఆ॥వె॥ అమ్మయనెడి రెండు అక్షరములె గాని
అందులోని మహిమకంతు లేదు
అమ్మ మాట మధురమానంద భరితమౌ
అంత లేని ప్రేమ అమ్మ ప్రేమ



## మీకు తెలుసా?

**కవాతు** : సైనికులు బృందంగా క్రమశిక్షణతో లయబద్ధంగా నడిచే పద్ధతి 'కవాత్' అని కూడా అంటారు. ఒక మార్గంలో అందరూ కలిసి ఒకేసారి కదలడం (పాద విన్యాసం). కవాతు నిర్వహించడం ద్వారా సైనికుల నిబద్ధత తెలుస్తుంది.

**అన్న ప్రాశన** : శిశువుకు మొదటిసారి అన్నం తినిపించే తంతు. దీని వలన శిశువుకు ఆయువు, తేజస్సు అభివృద్ధి చెందుతాయి. అన్నప్రాశన రోజు శిశువు ముందు బంగారు నగలు, డబ్బు, పుస్తకాలు, పెన్ను, కత్తి, పూలు మొదలైన వస్తువులను పెడతారు. శిశువు ఏ వస్తువును తాకుతాడో ఆ వస్తువుతో సంబంధమైన జీవనోపాధి లభిస్తుందని ఒక నమ్మకం.



## నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | పాఠం అర్థం చేసుకుని సొంత మాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. | పాఠాన్ని ధారాళంగా చదవగలను. | ఔను / కాదు |
| 3. | పాఠంలోని పదాలను సొంత వాక్యాలలో ఉపయోగించగలను. | ఔను / కాదు |
| 4. | అమ్మప్రేమ గురించి నా మాటలలో రాయగలను. | ఔను / కాదు |

## ఉపాధ్యాయులకు సూచనలు


కన్నబిడ్డలను కంటికి రెప్పలాగా కాపాడుకొనే అమ్మను ఎలా గౌరవించాలో, వృద్ధాప్యంలో ఎలా చూసుకోవాలో విద్యార్థులకు వివిధ రూపాలలో వివరించగలరు.





## చదవండి - ఆనందించండి

# దేశభక్తి



ఒక గ్రామంలో గుణవంతుడు అనే పెద్ద మనిషి ఉండేవాడు. ఆయనకు నలుగురు కుమారులు. వారికి వరుసగా వివేకానందుడు, రవీంద్రనాథ్ ఠాగూర్, సుభాష్ చంద్రబోస్, సుబ్బారావు అని పేర్లు. ఈ పిల్లలకు చదువుకొనేరోజుల్లో ఆ పేర్లు కొంచెం బాగున్నప్పటికీ రాను రాను ఆ పేర్లుకు బదులు రాహుల్, రాజీవ్, శ్రవణ్, కిరణ్ అనే పేర్లంటే బాగుండేదని భావించేవారు.

తండ్రి క్రమశిక్షణ, పెద్దలపట్ల గౌరవం ఇవన్నీ గుర్తుకు వచ్చి తండ్రి మాటకు ఎదురు చెప్పేవారు కాదు. కొన్నాళ్లకు తండ్రి మరణించాడు. కొడుకులు నలుగురు ఆస్తి పంపకానికి సిద్ధమయి ఒకచోట సమావేశం అయ్యారు. స్వేచ్ఛ లభించింది గనుక తమ పేర్లు కూడా మార్చుకోవాలని అనుకున్నారు. అంతలోనే వారి నాన్న స్నేహితుడు చంద్రశేఖర్ రావడం జరిగింది. కుశల ప్రశ్నలయ్యాక వారి ఉద్దేశాలను అతనికి వివరించారు.

చంద్రశేఖర్ వారు చెప్పినదంతా ఓపికగా విని "మీ నాన్న ఏ ఉద్దేశంతో ఆ పేర్లు పెట్టాడో చెబుతాను. అది విని మీకు ఇష్టం వచ్చిన నిర్ణయం తీసుకోండి" అని ఇలా చెప్పసాగాడు. "భారతీయత అంటే ఏమిటో చెప్పిన వివేకానందుడి పేరు, ప్రపంచంలోనే పేరెన్నికగన్న నోబెల్ బహుమతి సాధించిన రవీంద్రనాథ్ ఠాగూర్ పేరు, రవి అస్తమించని దేశంగా పేరు పొంది విర్రవీగుతున్న బ్రిటీష్ వారిని గడగడలాడించిన సుభాష్ చంద్రబోస్ పేరు, శాస్త్రవేత్తగా ఎందరికో ప్రాణదానం చేసి, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ప్రముఖ శాస్త్రవేత్త యల్లా ప్రగడ సుబ్బారావు పేరు మీకు పెట్టి మీ నాన్న దేశభక్తిని చాటుకున్నాడు. వీధుల్లో విగ్రహాలు పెట్టడం కాదు ప్రతి ఇంట్లో ఒక దేశభక్తి గల పౌరుడు ఉండాలని కోరుకున్న చదువురాని మహాజ్ఞాని మీ నాన్న" అని చెప్పి వెళ్ళిపోయాడు. అంతా విన్న నలుగురు కొడుకులు తమ తప్పును తెలిసికొని దేశ సమైక్యత అనేది ముందు ఇంట్లోనే ప్రారంభం కావాలని వారంతా కలసి మెలసి జీవించసాగారు. అన్నదమ్ముల ఐక్యత అందరికీ ఆదర్శమయింది.

**నిరక్షరాస్యుడు మాట్లాడినా వినసొంపుగా ఉండే భాష - తెలుగు భాష**


**- హెన్రీ మోరిస్**



# 2 మాయాకంబళి

S3L8K5

## వినడం - ఆలోచించి మాట్లాడడం



1. చిత్రం ద్వారా మీరేమి గమనించారో చెప్పండి?
2. మీరు చదివిన కథల పుస్తకాల పేర్లు చెప్పండి?
3. కథల పుస్తకాలు చదవడం మీకు ఇష్టమా? ఎందుకు?

**ఉద్దేశం:** అద్భుతం ఆశ్చర్యాన్ని పుట్టిస్తుంది. ఆనందాన్ని కలిగిస్తుంది. ఊహా శక్తిని పెంచుతుంది. తార్కిక ఆలోచనను కలుగజేస్తుంది. ప్రవర్తనలో మార్పు తీసుకువస్తుంది. ఇలాంటి లక్షణాలను విద్యార్థులలో జానపద కథ ద్వారా పెంపొందించడమే పాఠ్యాంశ ఉద్దేశం.

## కవి పరిచయం



### కలువకొలను సదానంద

**(22.02.1939 - 25.08.2020)**

కలువకొలను సదానంద చిత్తూరు జిల్లా పాకాలలో జన్మించారు. 1992లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. పిల్లలకథలు-శివానందలహరి, విందుభోజనం, చల్లని తల్లి, నీతి కథామంజరి, తుస్సన్న మహిమలు, పరాగ భూమి మొదలైన రచనలు చేశారు. చందమామ కథలు, వార్తాపత్రికల్లో కథానికలు రాశారు. 1966 లో 'బంగారు నడచిన బాట' నవలకు కేంద్రప్రభుత్వ విద్యాశాఖ బహుమతి, 1976 లో "నవ్వే పెదవులు - ఏడ్చే కళ్ళు" కథా సంపుటికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి అవార్డు, 2010 లో "అడవితల్లి" పిల్లల నవలకు కేంద్ర సాహిత్య బాలసాహితీ అవార్డు లభించాయి. ఈ పాఠ్యాంశం 'మాయాకంబళి' సంపుటినుండి గ్రహించబడింది.

# మాయాకంబళి

పూర్వం హిమాలయ పర్వతాల్లో ఆత్మానందుడనే వృద్ధయోగి ఉండేవాడు. ఆయన గొప్ప మహిమలు గలవాడని తెలిసి చుట్టుపక్కల వాళ్లు తరచుగా చూడవచ్చి, తమకు గల సమస్యలను ఏకరువుపెట్టి పరిష్కార మార్గాలు చూపమని ఆయన ఏకాగ్రతను, చెడగొట్టుతూ ఉండేవారు. అందుచేత ఆయన తన పాత కంబళి మీద మంత్రజలం చల్లి, దానికొక మహిమను కలుగజేసాడు. ఆయన దాన్ని కప్పుకుంటే ఎవరికీ కనిపించేవాడు కాడు. ఈ రహస్యం మాత్రం ఎవరికీ తెలియదు.

ఒకరోజు ఆత్మానందుడు తన కంబళి భుజాన వేసుకుని, ఒక శిల మీదుగా దాటుతూ కాలుజారి, శిలకు అవతలఉన్న లోయలోకి దొర్లి పడిపోయి, స్పృహ కోల్పోయాడు. అతని కంబళి శిలకు ఇవతలిపక్క పడిపోయింది.

మరికొంత సేపటికి ఆ కనుమ దారిన పాత దుస్తులు అమ్మే ఒక చిల్లరవ్యాపారి సంతకు పోతూ, కంబళిని చూశాడు. అది చాలా పాతది ఎవరైనా ఏదో ధరకు దాన్ని కొనక పోతారా అనుకుని ఆ మనిషి దాన్ని మడిచి మూటలో పెట్టి, సంత జరిగే శోభావతీ నగరానికి వెళ్లాడు. శోభావతిలో ఓ ముసలి బిచ్చగాడు చలితో బాధ పడుతూ, పాత కంబళిని చౌకలో కొనుక్కుని వెంటనే దాన్ని కప్పుకున్నాడు. చూస్తుండగానే, బిచ్చగాడు అదృశ్యం కావటం గమనించి అందరూ ఆశ్చర్యపోయారు.

ఈ వింత వార్త క్షణాల మీద నగరమంతా పాకింది. ఆ కాలంలో శోభావతిలో దొంగతనాలు,అవినీతి, స్పర్థలు పెచ్చుమీరి ఉన్నాయి. శోభావతి రాజయిన చండీదత్తుడు ఎంత ప్రయత్నించినా వాటిని అదుపులో పెట్టలేకపోయాడు. ఈ సమయంలో కంబళి మహత్తు గురించి అందరికీ తెలియటంతో, దురాశాపరులు, బిచ్చగాడి కోసం వెతక సాగారు. అలాంటి అదృశ్యకరణితో దొంగతనాలు చేయవచ్చు. యధేచ్ఛగా అవినీతి కొనసాగించవచ్చు. పట్టుబడకుండా ప్రత్యర్థులను దెబ్బతీయవచ్చని వారి ఆలోచన.

కంబళి సహాయంతో అదృశ్యంగా తిరుగుతున్న బిచ్చగాడు నలుగురు అనుకునేమాటలు విని మరికొంత సేపటికి, తనకు రానున్న ప్రమాదాన్ని గ్రహించి, తన చేతికర్రను ఒక పొదలో పెట్టి, ఎలాంటి చప్పుడూ చేయకుండా మసలసాగాడు.ఆ కంబళి వల్ల వాడికి అడుక్కు తినటానికి కూడా లేక పోయింది. నగరంలో ఇక తనకెక్కడా భద్రతలేదనుకున్న ముష్టివాడు, ఊరి బయట ఉన్న పాడుబడిన దేవాలయం దగ్గరికి చేరుకున్నాడు. కొంతసేపటికి అక్కడికి నలుగురు దొంగలు వచ్చారు. వాళ్ళు కూడా బిచ్చగాని కంబళి గురించే మాట్లాడుకున్నారు.



ఆ రాత్రి అంతా వాడు ఆలోచించి, తన కంబళి కోసం దేశంలో హేమా హేమీలు తహతహ లాడుతున్నారనీ, అది తనకు ఎందుకూ పనికి రాదని రూఢీ చేసుకుని మర్నాడు తెల్లవారగానే తాను వాళ్ల కంటపడకుండా కంబళి కప్పుకుని అదృశ్యంగా రాజసభకు వెళ్లి, తాను కప్పుకున్న కంబళి తీసి, రాజు ఎదుట ప్రత్యక్షమయ్యాడు.

"మహాప్రభూ ఈ కంబళి వల్ల నాకు ప్రాణహాని తప్ప, శాంతిగాని, సుఖంగాని లేదు" దీనిని మీ వద్దనే ఉంచండి, అని బిచ్చగాడు కంబళిని రాజుకు ఇచ్చాడు. రాజు దాన్ని స్వయంగా పరీక్షించి, దాని మహత్తును తెలుసుకుని బిచ్చగాడికి జీవితం సుఖంగా గడిచే ఏర్పాటు చేసి, కంబళి తాను తీసుకున్నాడు. ఈలోపల కొండమీద పడిపోయిన ఆత్మానందుడు కోలుకుని, తన కంబళి చండీదత్తుడి వద్ద ఉన్నదని తెలుసుకుని శోభావతీ నగరానికి వచ్చి రాజును ఏకాంతంగా కలుసుకుని, తన కంబళి తనకియ్యమని అడిగాడు. రాజు అందుకు అభ్యంతరం చెబుతూ, "రాజ్య శ్రేయస్సు దృష్ట్యా, ఇది నా దగ్గర ఉండటమే మంచిది," అన్నాడు.

"రాజా! నేనుకూడా రాజ్యశ్రేయస్సు కోసమే చెబుతున్నాను. అసాధారణ శక్తులవల్ల మంచికంటే చెడు జరగటానికి ఎక్కువ అవకాశాలున్నాయి. ఇలాంటి మహిమాన్వితమైన వస్తువు మనిషిని పాప కార్యాలకు, నీతి బాహ్యమైన పనులకూ పురికొల్పుతుంది. ఉత్తముడివైన నువ్వు భ్రష్టుడివి కావటం నాకిష్టం లేదు," అన్నాడు ఆత్మానందుడు.

శతవిధాల చెప్పినా, రాజు తన వాదంతో ఏకీభవించక పోయేసరికి, "స్వానుభవంలో తప్ప నీకు ఈ విషయం బోధపడదు" అంటూ నిట్టూర్చాడు. తన కంబళిని రాజు వద్ద ఉంచటానికి ఒప్పుకుని, ఎందుకైనా మంచిదని చెప్పి, రాజు చేతికి ఒక రక్షాబంధం కట్టి వెళ్లిపోయాడు.

కంబళి సహాయంతో రాజు దొంగల ముఠాలను, అనేక మంది అవినీతిపరులను కఠినంగా శిక్షించబడటంతో నగరంలో నేరాలు, అక్రమాలు పూర్తిగా తగ్గిపోయాయి. చండీదత్తుడి మనస్సుకు కొంత ప్రశాంతత చేకూరింది.


ఒకనాడు రాజు సభా మందిరంలో రాజనర్తకి అయిన చంచల నాట్యానికి ఆనంద భరితుడై నర్తకిని ఏం కావాలని అడిగాడు. చంచల మాయాకంబళిని రెండు రోజుల పాటు తనవద్ద ఉండనియ్యమని రాజును కోరింది. ఆమె ముచ్చటను రాజు నిరాకరించలేక శయన మందిరంలో ఉన్నదని వచ్చి తీసుకొని వెళ్లు అన్నాడు.

రాజు శయన మందిరానికి చంచల వచ్చి, కంబళి కప్పుకుని తిరుగుముఖం పట్టింది. వెళ్లిపోతున్న ఆమెను చూసి రాజు ఆశ్చర్యచకితుడైనాడు. ఆమె అతనికి స్పష్టంగా కనిపిస్తున్నది దానికి కారణం ఆత్మానందుడు తన చేతికి కట్టిన రక్షాబంధం అయి వుంటుందని రాజుకు తోచింది.

చంచల తిన్నగా తన మందిరానికి వెళ్ళక, మరొక దిక్కుగా, కోశాధికారి విక్రముడి మందిరానికి వెళ్ళటం చండీదత్తుడు చూశాడు. చంచల అతని వద్దకు ఎందుకు వెళ్ళి వుంటుందని ఆలోచిస్తూ, చండీదత్తుడు శయనాగారానికి వెళ్ళి పడుకున్నాడు, కానీ అతనికి నిద్ర పట్టలేదు.

ఆ రాత్రివేళ విక్రముడు కంబళి కప్పుకొని, చేత కత్తిపట్టుకుని తన శయనాగారానికి ప్రవేశించడం రాజు చూసి, తనను చంపడానికి వస్తున్నాడని గ్రహించి లేచి చివాలున కత్తిదూసి, విక్రముడి మీద పడ్డాడు. రాజు నిద్ర పోతుంటాడని, మేలుకుని వున్నా కంబళి మూలాన తనను చూడలేడని నమ్మిన విక్రముడు ఇలాంటి పరిణామానికి సిద్ధంగా లేక, రాజు చేతిలో తేలికగా చచ్చిపోయాడు.

రాజాజ్ఞ ప్రకారం భటులు చంచలను బంధించి తెచ్చారు. రాజును హత్య చేసి వాళ్ళ వారసులను బంధించి తాను రాజు కావాలని విక్రముడు అనుకున్నాడని, చంచల కంబళి ఇచ్చి చేసిన సహాయానికి ఆమెను పట్టపురాణి చేస్తానని ప్రలోభపెట్టాడని ఆమె అందుకు ఒప్పుకున్నదని భటులు తెలియజేశారు. చండీదత్తుడు ఆమెను దేశం నుంచి బహిష్కరించాడు. ఆ మర్నాడే రాజు హిమాలయాలలో ఆత్మానందుడున్న చోటికి వెళ్లి, "స్వామీ, మీ కంబళిని మీరే ఉంచుకోండి, దీనివల్ల మంచి ఆలోచనతో మంచి చేయవచ్చని అనుకున్నాను. కాని దీనివల్ల మనుష్యులలో స్వార్థం, నీచత్వం, చెడు ఆలోచనలు పెరిగి ప్రాణాలకే ముప్పు కలుగుతుందని ఇచ్చేశాడు.



ఆ కంబళి దుష్టుల చేతికి పోతే రాజుకు ఎంత ప్రమాదమో ఆత్మానందుడికి తెలుసు. కాబట్టే ఆయన శోభావతి నగరానికి వెళ్లి రాజును కంబళి ఇమ్మని అడిగాడు, రాజుకు రక్షాబంధనం కట్టాడు. రాజు కూడా దీనివల్ల వచ్చే ప్రమాదం గ్రహించగానే కంబళిని ఆత్మానందుడికి తిరిగి ఇచ్చేశాడు. ఆత్మానందుడు "నీ వద్ద ఈ కంబళి ఉందనే భయం ప్రజల్లో ఉంటే చాలు" అని నవ్వుతూ దానిని తీసుకున్నాడు.

## ఇవి చేయండి

**ఉపాధ్యాయుడు చెప్పిన కింది పదాలను (ఉక్తలేఖనం) రాయండి.**

మహత్తు, రాజ్యశ్రేయస్సు, ఆశ్చర్యచకితుడు, శయనాగారము, ప్రలోభపెట్టడం, అదృశ్యకరణి, రాజాజ్ఞ

## అవగాహన – ప్రతిస్పందన

1) పాఠంలోని మాయాకంబళి వలే మానవ జీవితంలో సెల్‌ఫోన్, సమయం, సంపద, మాటలు వంటివి విలువైనవే. వీటిని గురించి మీ సొంత మాటలలో చెప్పండి.


2) కథలోని మాయాకంబళి మీకు లభిస్తే దానిని ఏ విధంగా ఉపయోగిస్తారో చెప్పండి.

3) మీరు చదివిన ఏదైనా కథను మీ సొంత మాటలలో చెప్పండి.

4) **కింది గద్యాన్ని చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.**

ప్రతి ఇంట్లో ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషను విస్మరించకుండా ఉండాలి. భాష నిత్యం ప్రవహించే స్రవంతి. జీవనదిలా ప్రవహించే గోదావరి. నన్నయ కాలం నాటి గోదావరే ఇప్పుడూ ఉన్నా అందులో నీరు నిత్యం మారుతూనే ఉంటుంది. పాతనీరు పోయి కొత్తనీరు వచ్చి చేరుతూనే ఉంటుంది. భాష కూడా మార్పులకు గురవుతూనే ఉంటుంది. భాష నిలువ నీటి మడుగుగా మారితే అది సజీవ భాష కాదు అనే చెప్పాలి. అటువంటి పరిస్థితి ఏ భాషకు కలుగకూడదని గిడుగు రామ్మూర్తి గారు అన్నారు.

**ప్రశ్నలు:**



1. ప్రతి ఇంట్లో ఏ భాష మాట్లాడుతారు?
2. భాష అనేది నిత్యం ఏమవుతూ వుంటుంది?
3. భాషను ఏ నదితో పోల్చారు?
4. ఈ వచనంలోని మాటలు ఎవరన్నారు?



## వ్యక్తీకరణ - సృజనాత్మకత

అ) **కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. భిక్షగాడు మాయా కంబళిని ఎందుకు వద్దనుకున్నాడు.?
2. ఆత్మానందుడు రాజుకు రక్షాబంధం ఎందుకు కట్టాడు.?
3. కలువకొలను సదానంద గురించి మీరు తెలుసుకున్న అంశాలను రాయండి?

ఆ) **ఈ కింది ప్రశ్నలకు 8 నుంచి 10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. మాయాకంబళిని రాజు మొదట ఎందుకు కావాలనుకున్నాడు? తరువాత ఎందుకు తిరిగి ఇచ్చేశాడు?
2. మాయాకంబళి కథా సారాంశాన్ని మీ సొంతమాటలలో రాయండి.
3. విద్యార్థులూ! మీరు మీ ఊహాశక్తితో ఒక కథను రాయండి.



## భాషాంశాలు

అ) **కింద గీత గీసిన పదాలకు అర్థాలు రాయండి. వాటితో సొంతవాక్యాలు రాయండి.**

1. పక్షులు యథేచ్ఛగా ఆకాశంలో తిరుగుతున్నాయి.

   ఉదా : యథేచ్ఛగా = స్వేచ్ఛగా

   మనం స్వేచ్ఛగా మనలోని భావాలు చెప్పాలి.

2. బియ్యం చౌక ధరకు అమ్ముతున్నారు.

   ..........................................................................



3. చెడ్డ పనులు ఎవరైనా చేస్తే అభ్యంతరం చెప్పాలి.

..........................................................................................

4. చలి వేసినప్పుడు గొంగళి కప్పుకుంటాను.

..........................................................................................

**ఆ) కింది ప్రకృతికి వికృతిని జతపరచండి.**

| | | | | |
|---|---|---|---|---|
| 1. | ఆశ్చర్యము | (   ) | అ) | మొగము |
| 2. | రాత్రి | (   ) | ఆ) | ఱేడు |
| 3. | రాజు | (   ) | ఇ) | అచ్చెరువు |
| 4. | ముఖము | (   ) | ఈ) | సుకం |
| 5. | సుఖం | (   ) | ఉ) | రాతిరి |

**ఇ) కింది వాక్యాలలో సమానార్థక పదాలు గుర్తించి రాయండి.**

1. పర్వతాలు ఎత్తుగా ఉన్నాయి. ఆ శైలములు మీద చెట్లు ఉన్నాయి. ఆ గిరులు మంచుతో కప్పబడి ఉన్నాయి.

..........................................................................................

2. ఆ పట్టణంలో రాజు ఎంతో ఉత్తముడు. అందుకే ఆ భూపాలుడ్ని అందరూ నరేంద్రుడు అని పిలుస్తారు.

..........................................................................................

3. రాజు కరవాలంతో యుద్ధం చేస్తాడు. ఆ ఖడ్గం శత్రువుల తలను ఖండిస్తుంది.

..........................................................................................

**ఈ) కింది పదాలను సొంతవాక్యాలలో ప్రయోగించండి.**

**ఉదా :** ఏకాగ్రత : ఏ విషయం మీదైనా ఏకాగ్రత పెట్టినట్లయితే విజయం సాధిస్తారు.

1) ప్రశాంతత : ..........................................................................

2) తిరుగుముఖం : ..........................................................................

3) ప్రలోభ పెట్టడం : ..........................................................................

4) శ్రేయస్సు : ..........................................................................

5) దురాశాపరులు : ..........................................................................

6) కంటపడకుండా : ..........................................................................

ఉ) ఎటునుంచి చదివినా ఒకే పదం వచ్చే 'కచిక' పదాలకు (పద భ్రమణం) వాక్యాల ఆధారంగా జవాబులు రాయండి.

ఉదాహరణ : నటులు చేసేది - నటన

1. చింతకాయ రుచి ------------
2. శరీరాన్ని కప్పే వస్త్రానికి మరొక పేరు ------------
3. గాలి, వెలుతురు కోసం ఇంటికి పెట్టేది. ------------
4. ఇది తీయడమంటే నిద్రపోతున్నాడని అర్థం ------------
5. సముద్రపు ఆల్చిప్పలో వుండేది -------------



ఇలాంటి మరికొన్ని పదాలను సేకరించి రాయండి.

1. ------------
2. ------------
3. ------------
4. ------------
5. ------------
6. ------------


T7Y4Q6



## వ్యాకరణాంశాలు

అ. కింది వాక్యాలను గమనించండి.

1. పోతన భాగవతం రచించాడు.
2. ఆవు పాలు ఇచ్చింది.
3. రాజు వేటకు వెళ్ళాడు.
4. రాము అన్నం తిన్నాడు.
5. గీత పుస్తకం తెచ్చింది.



క్రియకు ముందు భాగంలో ఎవరు? ఏది? అని ప్రశ్నిస్తే వచ్చే జవాబును గమనించండి.

ఉదా: భాగవతాన్ని ఎవరు రచించారు? - పోతన

1. పాలు ఇచ్చే జంతువు ఏది?
2. వేటకు ఎవరు వెళ్ళారు?
3. అన్నం ఎవరు తిన్నారు?
4. పుస్తకం ఎవరు తెచ్చారు?

క్రియను ఎవరు? ఏది? అని ప్రశ్నించినప్పుడు వస్తున్న సమాధానాన్ని కర్తగా చెప్పవచ్చు.

**కింది వాక్యాలను చదవండి. కర్తను గుర్తించి గీతగీసి, పక్కన రాయండి.**

ఉదా. :- ఆత్మానందుడు కంబళిని భుజాన వేసుకొని వెళ్ళాడు. (ఆత్మానందుడు)

1. భిక్షగాడు మాయాకంబళితో అదృశ్యమైయ్యాడు. (            )
2. విక్రముడు కత్తిపట్టుకొని రాజు మందిరానికి వెళ్ళాడు. (            )
3. చండీదత్తుడు  విక్రముడిని సంహరించాడు. (            )
4. భటులు చంచలను బంధించారు. (            )

**ఉత్వసంధి**

**ఆ) కింది వాక్యాలను చదవండి. గీతగీసిన పదాలను పరిశీలించి విడదీసి రాయండి.**

1. భద్రాచల రాముడతడు.
2. వినాయక చవితికి సెలవిచ్చారు.
3. అయ్యా! మీరెవ్వరు
4. మనిషికి కొంచెమైనా ధర్మగుణం ఉండాలి.
5. గంగిగోవు పాలు పద్య భావమేమి.
6. ప్రజలందరూ కరోనాకు భయపడుతున్నారు.



| | సంధి రూపం | | విడదీసిన రూపం | | |
|---|---|---|---|---|---|
| ఉదా : | రాముడతడు | = | రాముడు | + | అతడు |
| 1. | మీరెవ్వరు | = | | + | |
| 2. | కొంచెమైనా | = | | + | |
| 3. | భావమేమి | = | | + | |
| 4. | ప్రజలందరూ | = | | + | |

పై ఉదాహరణలు గమనించినప్పుడు పూర్వ స్వరంగా 'ఉ' ఉంది. కనుక దీనిని **ఉత్వసంధి** అని చెప్పవచ్చు.

**ఈ పాఠంలో ఉన్న ఉకారసంధి పదాలను గుర్తించి విడదీసి రాయండి.**

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఉదా: | నగరమంతా | = | నగరము | + | అంతా |
| 1) | ............................ | = | | + | |
| 2) | ............................ | = | | + | |
| 3) | ............................ | = | | + | |
| 4) | ............................ | = | | + | |

ఇ) కింది గద్యాన్ని చదివి భాషాభాగాలను గుర్తించండి.



సంతోష్, శ్యామల జంతు ప్రదర్శనశాలకు వెళ్లారు. వారు అక్కడ క్రూర మృగాలైన సింహం, పులి, పొడవైన దంతాలు కలిగిన ఏనుగును చూశారు. శ్యామల సంతోషాన్ని ఆపుకోలేక అబ్బో! ఎంత పెద్ద జంతువులో! అని ఆశ్చర్య పోయింది. పచ్చని రామచిలుకలు, అందమైన నెమళ్ళను చూశారు. తరువాత అక్కడ ఉన్న దుకాణంలోకి వెళ్ళి తినుబండారాలు తిన్నారు. "ఓ.....సంతోష్ ఇటువైపు చూడు అవి ఎంత బాగున్నాయో!" అని కౌజుపిట్టలను శ్యామల, సంతోష్ కి చూపించింది. ప్రదర్శనశాలలో ఉన్న ఒక లేడి కాలికి గాయం కాగా దానిని చూసి సంతోష్ అయ్యయ్యో! లేడి కాలి నుండి రక్తం కారుతోందని సానుభూతిని వ్యక్తం చేశాడు.

1. నామవాచకం : ____________________
2. సర్వనామం : ____________________
3. క్రియ : ____________________
4. విశేషణం : ____________________
5. అవ్యయం : ____________________

మాయాకంబళి పాఠంలోని భాషాభాగాలను ఐదింటిని గుర్తించి రాయండి.

1. ____________ 2. ____________ 3. ____________

4. ____________ 5. ____________

గ్రంథాలయంలో మీరు చదివిన 5 కథలను అందులోని నీతిని కింది పట్టికలో రాయండి.

| క్ర.సం. | పుస్తకం/ కథ పేరు | తెలుసుకున్న నీతి |
|---|---|---|
| 1. | | |
| 2. | | |
| 3. | | |
| 4. | | |
| 5. | | |



## నీతి పద్యం

తే॥గీ సర్వ తీర్థాభిగమనంబు సర్వవేద
సమధిగమము సత్యంబుతో సరియుగావు
ఎఱుగు మెల్ల ధర్మంబుల కెందు పెద్ద
యంద్రు సత్యంబు ధర్మజ్ఞులైన మునులు.

**భావం :** పుణ్య నదులలో స్నానం చేయడం, సమస్త వేదాలు అధ్యయనం చేయడం ఒక్క సత్యానికి సాటిరావు. అన్ని ధర్మాల కంటే నిజం పలకడమే గొప్ప ధర్మం అని మునులు చెపుతారు. నన్నయ ఈ చిన్న పద్యంలో సత్యాన్ని దాని ప్రాధాన్యతను గురించి ఎంతో చక్కగా చెప్పాడు.

అశ్వమేధం వంటి యాగాలు చేయడం రాజులకే సాధ్యం. పుణ్యక్షేత్రాలు దర్శించడానికి ధనం ఉండాలి. నిజం చెప్పడానికి మాత్రం ఏమీ ఖర్చు లేదు. అయితే దాని ఫలితం ఎంతో విలువైనది. ఒక్క సత్యవాక్కు ఎంతటి పుణ్యాన్ని కలిగిస్తుందో, ఒక అబద్ధం అంతకంటే ఎక్కువ పాపాన్ని, నష్టాన్ని కలిగిస్తుందని గ్రహించాలి.



## మీకు తెలుసా?

**శతవిధాల** : శతవిధాలుగా అంటే వంద విధాలుగా చెప్పడం. ఏదైనా ఒక విషయాన్ని అనేక రకాలుగా తెలియజేస్తున్నారని తెలిపే పదబంధం.

**స్వానుభవం** : తనకు తాను ఏదైనా చేయడం ద్వారా అలవడే నేర్పు.



## నేనివి చేయగలనా?

| | |
|---|---|
| 1. పాఠంలోని కథను సొంత మాటల్లో చెప్పగలను. | ఔను/ కాదు |
| 2. పాఠంలోని కథను నేను సొంతంగా చదవగలను. రాయగలను. | ఔను/ కాదు |
| 3. పాఠంలోని పదాలను సొంత వాక్యాలలో ఉపయోగించగలను. | ఔను/ కాదు. |
| 4. కథను ఊహించి రాయగలను. | ఔను/ కాదు |



## ఉపాధ్యాయులకు సూచనలు

1. విద్యార్థుల చేత పాఠాన్ని చక్కగా చదివించాలి.
2. విద్యార్థులకు కథలపట్ల ఆసక్తి కల్గించేలా మరిన్ని కథలు సేకరించి చదివించండి.
3. రచయిత కలువకొలను సదానంద కథలను సేకరించండి. పిల్లలకు పరిచయం చేయండి



## చదవండి - ఆనందించండి

# మనిషి

యూనాను (గ్రీకు) దేశంలో జాంథస్ అనే పేరుగల ఒక ధనవంతుడు ఉండేవాడు.

ఈసప్ అనేవాడు అతనికి బానిసగా ఉండేవాడు. ఈసప్ తెలితేటలు గలవాడు. జాంథస్ ఈసప్ ను ఒకనాడు ఇట్లా ఆదేశించాడు – 'పోయి చూచిరా, నీటి తొట్టి (బాత్ టబ్) వద్ద ఎందరు మనుషులు ఉన్నారు? అక్కడకు వెళ్ళి నేను స్నానం చేసి రావాలి.' తిరిగివచ్చి అతడు యజమానితో చెప్పాడు – 'అయ్యా నీటి తొట్టివద్ద ఒకేఒక మనిషి ఉన్నాడు. జాంథస్ ఈసప్ ను వెంట పెట్టుకొని స్నానాలగది దగ్గరకు వెళ్ళాడు. వెళ్ళి చూస్తే అక్కడ అడుగుతీసి అడుగుపెట్టటానికి కూడ చోటులేదు. ఆయనకు కోపం వచ్చింది. ఏమిరా అబద్ధం చెప్పావు. సిగ్గులేదా?వ్యర్థుడా! నీవు ఏమని చెప్పావు? స్నానాలతొట్టి దగ్గర ఒకేఒక మనిషి ఉన్నాడన్నావు. మరి ఈ గుంపు ఎక్కడనుండి వచ్చింది?



ఈసప్ వినయపూర్వకంగా ఇలా జవాబు చెప్పాడు. అయ్యా! నేను సరిగా ఉన్న విషయమే చెప్పాను. నేను ఇక్కడికి వచ్చేటప్పుడు త్రోవలో ఒక పెద్దరాయి పడివుంది. వచ్చేపోయేవాళ్ళకు అది తగులుతోంది. అది తగిలి వారు క్రిందపడుతున్నారు. దానిని తొలగిద్దామన్న ఆలోచన ఏ ఒక్కరికీ కలుగలేదు. కొంచెం సేపటి తరువాత ఒక వ్యక్తి అక్కడికి వచ్చాడు. అతడు తన శక్తి అంతా ఉపయోగించి త్రోవలోనుండి దానిని తొలగించాడు. స్నానాలగది వద్దకు వెళ్ళాను. అక్కడ ఒక నిరుపేద బిచ్చగత్తె నిలుచునివుండగా చూశాను. ఆమె చాలాసేపటినుండి అక్కడే నిలుచొనివుంది. స్నానం చేస్తున్నవారిని ఆమె నీరు అడిగింది. కాని ఏ ఒక్కరు ఆమెవైపు చూడలేదు. త్రోవలో రాయి తొలగించిన వ్యక్తే బిచ్చగత్తెకు మంచినీళ్ళు ఇచ్చాడు.

అయ్యా! ఇప్పుడు మీరే చెప్పండి. స్వార్థపరులు, తమకోసం తాము జీవించేవాళ్ళు ఇతరుల కష్టాన్ని తొలగించనివారు వీరు మనుషులుగా పిలవబడటానికి యోగ్యులా? నాకు మాత్రం అక్కడ ఆ ఒకేఒక వ్యక్తి కనిపించాడు. అతనిలో మానవత్వం వుంది. అందుకే నేను చెప్పాను అక్కడ ఒకేఒక మనిషి ఉన్నాడు, అని. జాంథస్ కు ఇదంతా వినేసరికి ఎంతో సంతోషం వేసింది.

"నీవు నీకోసం బ్రతికితే అది పశు ప్రకృతి.నీవు ఇతరుల కోసం జీవిస్తే అది మానవ సంస్కృతి"

**"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ"**

**జన్మనిచ్చిన తల్లి, జన్మనిచ్చిన భూమి స్వర్గం కంటే గొప్పవి.**



# 3 చిన్ని శిశువు

V3J3W2



## వినడం - ఆలోచించి మాట్లాడడం



1. పై చిత్రాలు చూడండి. చిత్రాల గురించి మాట్లాడండి.
2. పిల్లలు ఎవరెవరు ఏమి చేస్తున్నారో ఊహించి చెప్పండి.

**ఉద్దేశం:** తల్లిదండ్రులు తమకు పుట్టిన శిశువును చూసి ఆనందిస్తారు. ఆ చిన్నారిని కన్నా! చిన్నా! నాన్నా! బుజ్జీ! అని రకరకాల ముద్దు పేర్లతో పిలుస్తుంటారు. ఆ శిశువు నవ్వులు, చేష్టలు చూసి మురిసిపోతుంటారు. అలా అన్నమయ్య బాల కృష్ణుని బాల్యాన్ని ఊహించాడు. దానిని వర్ణించిన తీరును చెప్పడమే పాఠ్యాంశ ఉద్దేశం.

### కవి పరిచయం



## తాళ్ళపాక అన్నమాచార్యులు

**(09.05.1408–23.02.1503)**

అన్నమాచార్యులు కడపజిల్లా, తాళ్ళపాక గ్రామంలో జన్మించారు. తల్లి లక్కమాంబ, తండ్రి నారాయణసూరి. అన్నమయ్య క్రీ.శ. 1408–1503 మధ్యకాలంలో జీవించాడు. అన్నమయ్య తెలుగులో తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని స్తుతిస్తూ 32 వేల సంకీర్తనలు రచించిన వాగ్గేయకారుడు. అవేగాక 12 శతకాలు, ద్విపదరామాయణం, సంకీర్తనలక్షణం, శృంగారమంజరి, వేంకటాచలమాహాత్మ్యం మొదలైనవి కూడా రచించారు. ఇందులో కొన్ని అలభ్య రచనలున్నాయి. అన్నమయ్య తన రచనలను శ్రీ వేంకటేశ్వర స్వామికి అంకితం చేశాడు. అన్నమయ్యకు 'పదకవితా పితామహుడు' అనే బిరుదు ఉంది.

## చిన్ని శిశువు



ప॥ చిన్ని శిశువూ చిన్ని శిశువూ
ఎన్నడుం జూడమమ్మ యిటువంటి శిశువూ ॥

చ॥ తోయంపు గురులతోడ దూగేటి శిరసు, చింత
కాయల వంటి జడల గముల తోడ
మ్రోయుచున్న కనకపు మువ్వల పాదాలతోడ
పాయక యశోదవెంట పాఱాడు శిశువూ ॥ ॥చిన్ని॥

చ॥ ముద్దుల వ్రేళ్ళతోడ మొరవంక యుంగరాల
నిద్దపుం జేతుల పైడి బొద్దుల తోడ
అద్దపుం జెక్కులతోడ అప్పు లప్పు లని నంత
గద్దించి యశోదమేను కౌగిలించు శిశువూ ॥ ॥చిన్ని॥

చ॥ బలుపైన పొట్టమీది పాలచారలతోడ
నులివేడి వెన్న దిన్న నోరి తోడ
చెలగి నేడిదె వచ్చి శ్రీవేంకటాద్రిపై
నిలిచి లోకములెల్ల నిలిపిన శిశువూ ॥ ॥చిన్ని॥

### సారాంశం

అన్నమయ్య భక్తిభావంతో చిన్నికృష్ణుని బాల్య చేష్టలను కళ్ళకు కట్టినట్లు వర్ణించాడు. అమ్మలారా! ఇలాంటి చిన్ని శిశువును ముందెన్నడూ చూడలేదు. ఈ చిన్ని శిశువు తన శిరస్సును మాటిమాటికి ఊపుతున్నాడు. అతని జడలు చింతకాయల వలె వంకరలు తిరిగి ఊగుతున్నాయి. తన లేలేత పాదాలకు ఉన్న బంగారు గజ్జెలకు ఉన్న మువ్వలు ఘల్లు ఘల్లుమని మ్రోగుతున్నాయి. అలా ముద్దు లొలికే శిశువు తల్లి యశోదను విడవకుండా అంటి పెట్టుకొని తిరుగుతున్నాడు.

చిన్నికృష్ణుని మృదువైన చేతివేళ్ళు ముద్దొస్తున్నాయి. ఆ శిశువు చేతి వేళ్ళకు మెరిసే ఉంగరాలున్నాయి. అతని చెక్కిళ్ళు అద్దం వలె మెరుస్తున్నాయి. చిన్నతండ్రీ ! చిన్నతండ్రీ ! అనగానే చిన్నికృష్ణుడు ఆనందంతో అరుస్తూ కేరింతలు కొడుతున్నాడు. యశోద దగ్గరకు వెళ్ళి ఆమెను గట్టిగా కౌగిలించుకున్నాడు.

చిన్నికృష్ణుడు కడుపునిండా పాలు తాగాడు. తన బొజ్జ మీద కట్టిన పాలచారలు కనిపిస్తున్నాయి. నోటిలో నులివెచ్చని వెన్న ఉంది. అలాంటి చిన్ని శిశువు నేడు వేంకటాచలంపై నిలిచి వేంకటేశ్వరునిగా దర్శనమిస్తున్నాడు. ఈ లోకాలన్నింటినీ కాపాడుతున్నాడని అన్నమయ్య వివరించాడు.

## ఇవి చేయండి

**ఉపాధ్యాయుడు చెప్పిన కింది పదాలను (ఉక్తలేఖనం) రాయండి.**

శిశువు, శిరసు, మువ్వలు, పైడి, మేను, కురులు, గద్దించి, కీర్తన, వెన్న, కౌగిలించు, వాగ్గేయకారుడు, చెక్కులు, తోయం, బలుపు, మొరవంక, బొద్దు

## అవగాహన - ప్రతిస్పందన

1. చిన్ని శిశువు గేయాన్ని భావయుక్తంగా, రాగయుక్తంగా పాడండి.
2. పిల్లల బాల్యాన్ని మీ సొంత మాటల్లో చెప్పండి.
3. తల్లికి బిడ్డలపై ఎలాంటి మమకారం ఉంటుందో చెప్పండి.

**4. కింది కీర్తనను చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**

జో అచ్యుతానంద జోజో ముకుందా
రావె పరమానంద, రామ గోవిందా జోజో జోజో

పాలవారాశిలో పవళించినావు,
బాలుగా మునులకు అభయమిచ్చినావు,
మేలుగా వసుదేవుకుదయించినావు,
బాలుడై ఉండి గోపాలుడైనావూ జోజో జోజో

నందు నింటను జేరి నయముమీరంగా
చంద్రవదనలు నీకు సేవచేయంగా
అందముగ వారిండ్ల ఆడుచుండంగా
మందలకు దొంగ మా ముద్దురంగా జోజో జోజో



### ప్రశ్నలు

1. అన్నమయ్య జోల పాటలో ఎవరిని గురించి వర్ణించాడు?
2. కృష్ణుడు ఎవరి ఇంట పెరిగాడు?
3. కృష్ణుడు ఎవరికి పుత్రుడుగా జన్మించాడు?
4. మునులకు అభయమిచ్చినది ఎవరు?



## వ్యక్తీకరణ - సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి.**



1. చిన్ని శిశువు జడల గురించి రాయండి ?
2. చిన్ని కృష్ణుడు ఎలాంటి ఆభరణాలు ధరించాడు ?
3. అన్నమయ్యను గురించి రాయండి.

**ఆ) కింది ప్రశ్నలకు 8 నుండి 10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. చిన్ని శిశువు పాఠ్యభాగ సారాంశాన్ని సొంత మాటల్లో రాయండి ?
2. అన్నమయ్య చెప్పిన శిశువుకి మీరు చూసిన శిశువుకి గల పోలికలు రాయండి ?
3. చిన్నపిల్లల చేష్టల గురించి మీ మాటల్లో రాయండి.



## భాషాంశాలు

**అ) కింది గీత గీసిన పదాలకు అర్థాలు రాయండి. వాటితో సొంత వాక్యాలు రాయండి.**

ఉదా :- ఈ రోజు పైడి ధర పెరిగింది.

పైడి = బంగారం


స్త్రీలకు బంగారు ఆభరణాలు శోభనిస్తాయి.



1. చిన్ని కృష్ణుడికి నవనీతం అంటే ఇష్టం.
2. చిన్న పిల్లల కురులు నిగనిగలాడుతుంటాయి.
3. తల్లికి శిశువు సంరక్షణ ముఖ్యం
4. గణపతికి ఏనుగు శిరస్సు ఉంటుంది.

**ఆ) కింది వాక్యాలలో సమానార్థక పదాలు (పర్యాయ పదాలు) గుర్తించి రాయండి.**

ఉదా : మేను = దేహం, తనువు, కాయం



1. ఇది పుత్తడి బొమ్మ, అది స్వర్ణ దేవాలయం

   బంగారం ..........................................

2. కిటికి దర్పణం బాగుంది. రేఖ చేతిలో ముకురం ఉంది.

   అద్దం ..........................................

3. మా అయ్య పొలానికి వెళ్ళాడు. మా స్నేహితుని నాన్న ఉపాధ్యాయుడు.

   తండ్రి ..........................................

4. ఆమె శిరోజాలు పొడవుగా ఉన్నాయి, ఈమె కేశాలు పొట్టిగా ఉన్నాయి.

   కురులు ..........................................

**ఇ) కిందివానిలో ప్రకృతి, వికృతులను జతపరచండి.**

| | | | | |
|---|---|---|---|---|
| 1. | ఫలం | (    ) | 1. | నీరు |
| 2. | నీరము | (    ) | 2. | కన్నడు |
| 3. | భృంగారం | (    ) | 3. | పండు |
| 4. | కృష్ణుడు | (    ) | 4. | సిరి |
| 5. | శ్రీ | (    ) | 5. | బంగారు |



**ఈ) కింది పదాలకు వ్యతిరేక పదాలు రాయండి**

1. చిన్న × ------------
2. కోపం × ------------
3. తిని × ------------
4. పైన × ------------
5. వేడి × ------------

**ఉ) కింది పదపట్టికను చదవండి. పట్టిక ఆధారంగా కొన్ని పదాలు రాయండి.**

| | | | | |
|---|---|---|---|---|
| శి | శు | వు | వె | న్న |
| ర | కౌ | గి | లిం | చు |
| సు | ము | వ్వ | లు | పా |
| పై | ముం | గు | రు | లు |
| డి | అ | న్న | మ | య్య |

ఉదా : ముువ్వలు

1. ----------
2. ----------
3. ----------
4. ----------
5. ----------



## వ్యాకరణాంశాలు

**నిత్యం**

**కింది వాక్యాలను చదవండి. గీతగీసిన పదాలను పరిశీలించండి.**

1. టంగుటూరి ప్రకాశమంతుడు తెల్లవారికి సింహస్వప్నం.
2. చుక్కలు మిలమిల మెరుస్తాయి ఎందుకని?
3. కొత్తగా వచ్చిన వ్యక్తిని మీరెవరు? అని నాన్న అడిగాడు.
4. మా రాజు మనసైన రాజు.
5. ప్రజలు అల్లూరి సీతారామరాజెక్కడని అడిగారు.

**కింది పదాలను విడదీసి రాయండి.**

| | | | | |
|---|---|---|---|---|
| ఉదా : | ప్రకాశమతడు | = ప్రకాశము | + | అతడు |
| 1. | ఎందుకని | = ________ | + | ________ |
| 2. | మీరెవరు | = ________ | + | ________ |
| 3. | మనసైన | = ________ | + | ________ |
| 4. | రాజెక్కడ | = ________ | + | ________ |

పై పదాలలో పూర్వ స్వరంగా 'ఉ' ఉంది. దాని పరస్వరంగా 'అ', 'ఇ', 'ఉ', 'ఎ', 'ఒ' వంటి ఏదైనా అచ్చుపరమైన సందర్భంలో సంధి తప్పకుండా జరుగుతుంది. సంధి అంటే పూర్వ పరస్వరాలకు పరస్వరం ఏకాదేశం కావడం అని తెలుసుకున్నాం. ఈవిధంగా తప్పకుండా జరిగే సంధిని **నిత్యం** అంటారు.

## నిషేధం

**కింది వాక్యాలను చదవండి. గీతగీసిన పదాలను పరిశీలించండి.**



1. కొత్త బట్టలు మాయమ్మ ఇచ్చింది.
2. మాయయ్య వ్యవసాయం చేస్తున్నాడు.
3. ఓయమ్మ! నీ కుమారుడు అల్లరి పిల్లవాడు.
4. రాముని దూతయితడు.
5. మాయిల్లు గాంధీనగర్ లో ఉంది.

**కింది పదాలను విడదీయండి. సంధి జరగని విధానాన్ని గమనించండి.**

| | | | | |
|---|---|---|---|---|
| ఉదా: | మాయమ్మ | = మా | + | అమ్మ |
| 1. | మాయయ్య | = ________ | + | ________ |
| 2. | ఓయమ్మ | = ________ | + | ________ |
| 3. | దూతయితడు | = ________ | + | ________ |
| 4. | మాయిల్లు | = ________ | + | ________ |

పూర్వ స్వరంగా 'ఆ' అనే అచ్చు ఉంది. పర స్వరంగా 'అ' ఉన్నప్పటికీ వాటి మధ్య సంధి జరగలేదు. అప్పుడు ఆ రెండు స్వరాల మధ్యన అదనంగా 'య్' వచ్చి చేరింది. ఈవిధంగా సంధి జరగని స్థితిని **'నిషేధం'** అంటారు.

## వైకల్పికం

**కింది వాక్యాలను గమనించండి. గీత గీసిన పదాలను గుర్తించండి.**

1. పాప <u>అదేమిటని</u> అడిగింది.
2. మా <u>మేనత్త</u> చాలా మంచిది.

3. అక్కడెవరున్నారు?

4. హరి! మీరు ఏమంటిరి

**విడదీసిన పదాలను కలిపి రాయండి.**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| ఉదా: | అది | + | ఏమిటి | = | అదేమిటి | అదియేమిటి |
| 1. | మేన | + | అత్త | = | ________ | ________ |
| 2. | అక్కడ | + | ఎవరు | = | ________ | ________ |
| 3. | ఏమి | + | అంటిరి | = | ________ | ________ |

పై ఉదాహరణలో సంధి ఒకసారి నిత్యంగా మరొకసారి నిషేధంగా జరుగుతుంది. అనగా ఒకచోట ఒకసారి వ్యాకరణకార్యం ప్రవర్తించి మరొకసారి ప్రవర్తించక పోవడం ఉంటుంది. ఇలా జరిగే విధానాన్ని **వైకల్పికం** అంటారు.

## బహుళం

**కింది వాక్యాలను గమనించండి. గీతగీసిన పదాలను విడదీయండి.**

1. మా పెద్దన్న మామిడి పండు తిన్నాడు.
2. మాయమ్మ చాలా మంచిది
3. నేను వేసవి సెలవుల్లో మా మేనత్త ఇంటికి వెళ్ళాను. మేనయత్త ప్రేమగా చూసింది.
4. నేను నిద్రలో ఒకానొక సమయంలో ఉలిక్కిపడతాను.

**కింది పదాలను విడదీయండి.**

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఉదా: | చిన్నమ్మ | = | చిన్న | + | అమ్మ |
| 1. | పెద్దన్న | = | ________ | + | ________ |
| 2. | మాయమ్మ | = | ________ | + | ________ |
| 3. | మేనత్త, మేనయత్త | = | ________ | + | ________ |
| 4. | ఒకానొక | = | ________ | + | ________ |

పై ఉదాహరణలను గమనించండి. అన్ని రూపాలలోను పూర్వస్వరంగా 'అ' పరస్వరంగా అచ్చు ఉన్నప్పటికీ సంధికార్యం కొన్నిచోట్ల నిత్యంగా, కొన్నిచోట్ల నిషేధంగా, కొన్నిచోట్ల వైకల్పికంగా, కొన్నిచోట్ల అన్యవిధంగా జరిగింది. ఇలా జరిగితే దానిని బహుళం అంటారు.

**తృతీయా విభక్తి**

కింది పట్టికను గమనించండి.

| | | | |
|---|---|---|---|
| 1. | బోయవాడు బాణం | తో | పక్షిని కొట్టాడు. |
| 2. | దేవుని భక్తి శ్రద్ధల | | పూజించాడు. |
| 3. | వాల్మీకి 24 వేల శ్లోకాల | | రామాయణం రచించాడు. |
| 4. | కుశలవులు సప్తస్వరాల | | పాట పాడారు. |

వాక్య రూపంలో రాయండి.

ఉదా : బోయవాడు బాణంతో పక్షిని కొట్టాడు.

1. ______________________________

2. ______________________________

3. ______________________________

పై వాక్యాలలో 'తో' అనే ప్రత్యయం వాక్యాలను అర్థవంతంగా మార్చింది. వాక్యం లోని పదాల మధ్య చేరే చేతన్, చేన్, తోడన్, తోన్, అనే ప్రత్యయాలను తృతీయా విభక్తి అంటారు. సాధారణంగా కారణాన్ని, ఉపయోగాన్ని, సాధనాన్ని గురించి చెప్పే సందర్భంలో 'తృతీయా విభక్తి'ని ఉపయోగిస్తారు.

ఊ) కింది సమాసపదాలను విగ్రహ వాక్యాలుగా రాయండి.

ఉదా: యశోద మేను = యశోద యొక్క మేను

1 చిన్ని శిశువు = ______________________________

2. వేషభూషణములు = ______________________________

3. పెద్దపొట్ట = ______________________________

4. చింతకాయలు = ______________________________

ఋ) కింది పదాలను విడదీయండి.

ఉదా: వెన్నదిన్న = వెన్న + తిన్న

1. వేంకటాద్రి = ____________ + ____________

2. నేడిదే = ____________ + ____________

3. లోకములెల్ల = ____________ + ____________

## చమత్కార పద్యం

| | |
|---|---|
| యోధెవ్వడు కురుబలమున? | **భావం:** కౌరవసైన్యంలోయోధుడెవరు? |
| మాధవ సఖుదేమి యెక్కి మరి తిరుగాడున్? | శివుడు ఏ వాహనాన్ని ఎక్కి తిరుగుతాడు? |
| సాధించెనెవని రాముడు? | రాముడు ఎవరిపై విజయాన్ని సాధించాడు? |
| రాధేయుడు నందినెక్కి రావణుగెల్చెన్. | కర్ణుడు, నందినెక్కి, రావణాసురుని గెల్చాడు. |

(పై మూడు పాదాలలోని ప్రశ్నలకు సమాధానం చివరి పాదంలోనే ఉంది.)

## ప్రాజెక్టుపని

1. అన్నమయ్య కీర్తనలను మరి కొన్ని సేకరించండి. వాటిని చార్టుమీద రాసి ప్రదర్శించండి.
2. త్యాగయ్య కీర్తనలను సేకరించండి. వాటిని చార్టుమీద రాసి ప్రదర్శించండి.

## మీకు తెలుసా?

| | | |
|---|---|---|
| **చతుర్దశ భువనాలు** | : | 14 లోకాలు (సప్త అధో లోకాలు - 7, సప్త ఊర్ధ్వ లోకాలు - 7) |
| **సప్త అధో లోకాలు** | : | 1. అతలం 2. వితలం 3.సుతలం 4. తలాతలం 5. రసాతలం 6. మహాతలం 7. పాతాళం |
| **సప్త ఊర్ధ్వ లోకాలు** | : | 1. భూలోకం 2. భువర్లోకం 3. సువర్లోకం 4. మహర్లోకం 5. జనోలోకం 6. తపోలోకం 7. సత్యలోకం |

## నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | చిన్ని శిశువు గేయాన్ని భావయుక్తంగా, రాగయుక్తంగా పాడగలను. | ఔను / కాదు |
| 2. | కీర్తనలోని భావాలను, సొంత మాటలలో చెప్పగలను. | ఔను / కాదు |
| 3. | కీర్తనలోని పదాలను సొంతవాక్యాలలో ఉపయోగించగలను. | ఔను / కాదు |
| 4. | చిన్నపిల్లల చేష్టలను గురించి రాయగలను. | ఔను / కాదు |

## ఉపాధ్యాయులకు సూచనలు


1. అన్నమయ్య సంకీర్తనలను సేకరించండి. వాటిని వినండి.
2. అన్నమయ్య జీవితం గురించి తెలుసుకోండి.
3. అన్నమయ్య సంకీర్తనలను పాడే విధానాన్ని విద్యార్థులకు తెలపండి.

R2T3F9

చదవండి - ఆనందించండి

# సత్యవ్రతం

"నారాయణ ! నారాయణ ! అని ఉచ్చరిస్తుంటావు. ఎవరీ నారాయణుడు ? ఎక్కడ ఉంటాడు ? అతని గుణాలు ఏమిటి? ఏమి చేయగలడు వాడు" అని హిరణ్యకశిపుడు తన పుత్రుణ్ణి అడిగాడు. 'తండ్రీ ! నారాయణుడంటే ఈశ్వరుడు, సృష్టికర్త, సర్వశక్తిమంతుడు అన్నాడు ప్రహ్లాదుడు. 'చాలించు నీ ప్రలాపం' తండ్రికి కోపం వచ్చింది. 'లేదు తండ్రీ! ఇది సత్యం. ఆయన సర్వ వ్యాపకుడు, సర్వజ్ఞుడు, సర్వశక్తి మంతుడు'.



'నేనే సర్వశక్తిమంతుణ్ణి మూర్ఖుడా! నేనే ఈశ్వరుణ్ణి. నారాయణ, నారాయణ అనే జపం మాని ఇకనుండి నీవు నా నామాన్ని జపించాలి. తెలిసిందా!' 'లేదు..., మీరు నాకు తండ్రి..., పూజ్యులు' కాని నేను మీ నామాన్ని జపించలేను. మిమ్మల్ని తండ్రిగా గౌరవించగలను' అన్నాడు ప్రహ్లాదుడు.

రాజైన హిరణ్యకశిపుడు ప్రహ్లాదుణ్ణి కష్టాలకు లోనుచేసి చంపవలసినదిగా మంత్రిగారిని ఆదేశించాడు. ప్రహ్లాదుణ్ణి సముద్రంలో ముంచారు. కొండపై నుండి క్రిందకు త్రోశారు. కాని ప్రహ్లాదునికి ఏమీ కాలేదు. హోలికాదేవి ప్రహ్లాదుని తీసుకొని అగ్నిలో దూకింది. ఆమె అగ్నిలో దూకి భస్మం అయింది. కాని ప్రహ్లాదుడు క్షేమంగా ఉన్నాడు. చివరికి మళ్లీ ప్రహ్లాదునికి నచ్చచెప్పాలని ప్రయత్నించారు. కాని అతను అంగీకరించలేదు. అతని నోటినుండి కేవలం 'నారాయణ! నారాయణ ! అనే మాటలు మాత్రమే వస్తున్నాయి. అప్పుడు హిరణ్యకశిపుడు 'ఈ స్థంభంలో నారాయుణ్ణి చూపించగలవా?' అని ప్రహ్లాదుణ్ణి ప్రశ్నించాడు.

'తండ్రీ! నారాయణుడు ఇందు గలడు, అందు లేడు అనే సందేహం వద్దు. అంతటా వ్యాపించి ఉంటాడు' అని చెప్పాడు. వెంటనే హిరణ్యకశిపుడు తన గదతో ఆ స్థంభాన్ని గట్టిగా కొట్టాడు. అందులో నుండి నృసింహస్వామి ప్రత్యక్షమైనాడు. ఆయన ప్రహ్లాదుని తండ్రియైన హిరణ్యకశిపుని వధించాడు. భక్తుడైన ప్రహ్లాదుణ్ణి ఆశీర్వదించి వరం ఇచ్చాడు. 'నీవు తేజశ్శాలివి అవుతావు, మహాత్ముడివి అవుతావు. విద్వాంసుడవు అవుతావు' ఇలా చెప్పి ఆయన అంతర్ధానమైనాడు. ప్రహ్లాదుడు ధన్యుడు. అతని హరిభక్తి ధన్యం.

ఆంధ్రుడై జన్మించుట ఆంధ్రభాష మాట్లాడుట ఎన్నో జన్మల తపఃఫలం - అప్పయ్య దీక్షితులు

# 4 మట్టిచెట్టు

X1W5X5

## వినడం - ఆలోచించి మాట్లాడడం



1. చిత్రాన్ని గమనించండి. మాట్లాడండి.

**ఉద్దేశం:** నిత్యం మన పరిసరాలలో చెట్లు, జంతువులు, పక్షులు వంటి మూగజీవులను చూస్తుంటాం. వాటికి కూడా కొన్ని ఆలోచనలు - అనుభవాలు - అనుభూతులు ఉంటాయి. వాటిని అవి తమ మాటల్లో వివరిస్తే ఎలా ఉంటుందో చెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.

### కవి పరిచయం



## త్రిపురనేని గోపీచంద్

**(08.09.1910 - 02.11.1962)**

త్రిపురనేని గోపీచంద్ కృష్ణాజిల్లా అంగలూరు గ్రామంలో జన్మించారు. తండ్రి త్రిపురనేని రామస్వామి. తల్లి పున్నమాంబ. ధర్మవడ్డీ, మమకారం, తండ్రులు కొడుకులు, మాకు ఉన్నాయి స్వగతాలు, పోస్టు చేయని ఉత్తరాలు వంటి రచనలు చేశారు. వీరి 'పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామా' అనే రచనకు కేంద్ర సాహిత్య అకాడమి బహుమతి లభించింది.

# మఱ్ఱిచెట్టు


నేనిప్పుడే చెరువుగట్టుమీద మొద్దునై పడి ఉన్నాను. నా మొదలు రంపంతో కోసి పైభాగాన్నంతా కట్టెల క్రింద కొట్టారు. పది పన్నెండు కుటుంబాలవాళ్ళు ఆ కట్టెలను లాట్ల క్రింద పంచుకున్నారు. కొన్నిలాట్లు అమ్మి వేశారు. వాళ్ళు నన్ను ముక్కలక్రింద నరకటంలో లభించే లాభాన్నే చూచుకున్నారు కాని, ఒక జీవిని యిట్టే నాశనం చేస్తున్నామే–అని ఆలోచించలేదు.

నేను పుట్టినప్పటి నుంచీ ఈ చెరువు గట్టునే ఉన్నాను. ఈ చెరువుగట్టునే పుట్టాను కూడా. నేను పెరిగి పెద్దదాన్నయిన తరువాత ఊళ్లో రైతులందరూ నా క్రింద కూర్చునే కబుర్లు చెప్పుకుంటూ, ముఖమార్జన చేసేవారు. ఈవూళ్లో యెవరికీ తెలియని సంగతులన్నీ నాకు తెలుసు. ఎవరికివారు తామే ఉన్నామనుకొని చెప్పుకొనే రహస్యాలన్నీ యెంత వొద్దనుకున్నా నా చెవిలో పడుతుండేవి. నేను ఆ రహస్యాలను మనసులో పెట్టుకుని వుండేదాన్నే గాని, ఏ పరిస్థితుల్లోనూ మరొకరి చెవిని పడనిచ్చేదాన్ని కాదు.



పనులులేని రోజుల్లో గ్రామస్థులకు నేనే ఆశ్రయం. కలిసి కబుర్లు చెప్పుకోడానికి, కాలక్షేపానికి, పట్టణాల్లో పెద్ద పెద్దక్లబ్బులు వుంటాయని నేను విన్నాను. ఈ మధ్య మా గ్రామంలోని కుర్రకారు యెక్కువమంది పట్టణానికి వెళ్ళి రావటం మొదలు పెట్టారు. కొంతమంది చదువునెపంతో అక్కడే వుంటున్నారు. బడి ఉన్నంతకాలం అక్కడే వుండి, సెలవులకు ఇండ్లకు వస్తూండేవారు. క్లబ్బు సంగతి వాళ్ళు చెప్పుకుంటూ వుంటే నేను విన్నాను. ఆ క్లబ్బులో మంచి ఆటలుంటాయట. పెద్ద పెద్ద వాళ్ళందరూ ఒస్తూ వుంటారట. ప్రపంచంలో జరిగే సంగతులన్నీ అక్కడకు వెళ్ళేవాళ్ళకు తెలుస్తూంటాయట. అక్కడ గాలికోసం పెద్ద పెద్ద ఫానులుంటాయట. వాళ్ళ మాటలు వింటూవుంటే వాళ్ళ అమాయకత్వానికి

నాకు నవ్వువచ్చేది. క్లబ్బును గురించి యెందుకింత గొప్పగా చెప్పుకుంటారా – అని విస్తుపోయేదాన్ని.



ఆ క్లబ్బులు చేసేపని తరతరాల నుంచీ నేను చేస్తున్నపనే. పిల్లలు, పెద్దలూ అందరూ కాల క్షేపానికి నా దగ్గరకు వచ్చేవాళ్ళు. నా నీడలో కూర్చుని అనేక విషయాలు చెప్పుకుంటూ వుండేవారు. పులిజూదం మొదలయిన ఆటలు యెన్నో ఆడుకుంటూ వుండేవారు. నేను వారికి శ్రమ కలగ కుండా గాలివీస్తూ వుండేదాన్ని. దాహమయితే చెరువులో నీళ్ళు దోసిళ్ళతో త్రాగి మళ్ళీ వచ్చి నా నీడను కూర్చొని విశ్రాంతి తీసుకుంటూ వుండేవారు. నా నీడనూ గాలిని అలవాటు పడినవాళ్ళు యింట్లో ఒక్కక్షణం వుండేవారు కాదంటే మీరు నామాట నిస్సంకోచంగా నమ్మవచ్చు.

ఇక క్రొత్తగా ఈ క్లబ్బులు వచ్చి చేస్తున్నదేమిటో! నేను వాళ్ళ కంటికి అలవాటైపోయినదాన్ని, పైగా ఆశ్రయం యిచ్చినందుకు వాళ్ళను నేనేమి అర్థించను. వాళ్ళతో దమ్మిడీ ఖర్చు పెట్టించను. అందువల్ల నేనంటే వాళ్ళకు విలువలేకుండా పోయింది. దీనికి తగినట్టు యీ కాలం కుర్రకారు, చీటికీ మాటికీ పట్టణంపోయి, ఎక్కువ కాలం అక్కడే గడుపుతున్నారు. అందువల్ల నావంటి వాళ్ళమీద వాళ్ళదృష్టి పడటంలేదు.

నిజానికి, సహజంగా నాకున్న అపేక్షవల్లగాని, ఈ గ్రామస్థులను ఆదరణగా చూడవలసిన అపేక్షలేదు. అంటే నే వారికి ఏ విధంగానూ ఋణపడిలేను – నేను వొకరు నాటగా మొలిచినదాన్ని కాదు. ఎవరో దయదలచి ఇంత ఎరువూ, నీరూ పొయ్యగా పెరిగిన దానినికాదు. ఏ గాలికో, విత్తుగా వుండగా, కొట్టుకువచ్చి ఈ చెరువుగట్టు మీద పడివుంటాను, ఏ కాకిముక్కు నుండో జారిపడివుంటాను. ఎక్కువగా ఊహలేని ఆ చిన్నతనంలో ఏం జరిగిందో ఇదమిద్ధమని చెప్పలేను గాని, నేను నా బ్రతుకు ఎప్పుడూ ఎవ్వరిమీదా ఆధారపడలేదని నాకు స్పష్టంగా జ్ఞాపకం వుంది.

ఒకరిమీద ఆధారపడవలసిన అవుసరం నాకేమి ఉంది! నాకు కావలసింది ఏమంత గనుక! నేను పడిన భూప్రదేశంలో వున్న సత్తువే నాకు చాలు. అప్పుడప్పుడూ పడే వర్షపు జల్లులూ, భూమిలో వున్న నిమ్మేచాలు నాకు. కాస్త పెరిగి పెద్దదాన్నయిన తరువాత నా వేళ్ళే నాకు కావలసిన ఆహారాన్ని సమకూర్చి పెట్టినై. మనుష్యుల్లో జరుగుతున్నట్లు నేను బ్రతకటానికి మరొకరిని కష్టపెట్టవలసిన అవసరం నాకు లేదు. ఎవ్వరికీ కించిత్ నష్టం కలిగించకుండా నేను బ్రతుకగలను.

నా బ్రతుకులో స్వార్థంలేదు. నేను యేదికోరీ బ్రతకటంలేదు. నాకేదైనా కోరికవుంటే వీలైనంతవరకు యితరులకు సహాయపడటమే ఆ కోరిక. ఈ కోరిక కూడా నేను తెచ్చిపెట్టుకుంది కాదు. నా స్వభావంలో వుంది.

నా నీడన మనుష్యులు చల్లదనాన్ని అనుభవిస్తూ విశ్రాంతిని పొందుతూ వుండగా నాపైన కొమ్మల్లో రకరకాల పక్షులు గూళ్ళుకట్టుకొని కాపురం చేస్తూ వుండేవి. అవీ నావంటివే. వాటికి స్వార్థం అనేది లేదు. బ్రతుకులోవున్న ఆనందం కోసం ఒకరిని యిబ్బంది పెట్టకుండా బ్రతుకుతున్న నిస్వార్థజీవులు అవి.

ఒక్కొక్కప్పుడు అటువంటివాటిని కూడా యిబ్బంది పెడుతుండేవారు, మానవులం అనుకునేవారు. అవి తమమీద రెట్టలు వేస్తున్నవనే నెపంతో, రాళ్ళు విసిరి నా ఆశ్రయం నుంచి వాటిని వెళ్ళ గొట్టటానికి ప్రయత్నిస్తూ వుండేవారు. అప్పుడు భయపడిపోయి అవిచేసేగోల వినటానికి నాకు హృదయవిదారకంగా వుండేది. ఒక ప్రక్క వాళ్ళ దెబ్బలను భరించలేక, వేరొకప్రక్క గూళ్ళల్లో వున్న పిల్లలను విడిచిపెట్టి వెళ్ళలేక గుండెలు అవిసిపోయేటట్టు అరుస్తూ రెక్కలు కొట్టుకుంటూ గూళ్ళచుట్టూ ఎగురుతుండేవి. అవి అల్లాడిపోతుంటే రాళ్ళువిసిరే మానవులకు ఆనందంగా వుండేది. ఇతర జీవులబాధ అందులో యితరులకేమాత్రం అపకారం తల పెట్టని జీవులబాధ, గొప్పవాళ్ళు అనుకునే మానవులకు యెట్లా ఆనందం కలిగిస్తూవుందో నాకు అర్థం అయ్యేదికాదు. ముక్కుమీద వేలువేసుకుని చూస్తూ వుండేదానిని.

అటువంటి సమయాల్లో క్రిందవున్న మనుష్యులను, వాళ్ళు చేస్తున్న ఘోరాపచారం తెలియజేసి, మందలించాలని అనిపించేది. కాని మానవులు ఆనాటికే ప్రకృతిలో సహజంగా జీవిస్తున్న ప్రాణి కోటి అభిప్రాయాలను అర్థంచేసుకోలేని స్థితికి దిగజారివున్నారు. ఇక వాళ్ళకు చెప్పుకునేదిఎట్లా?

ఈ మానవులు నా నీడను కూర్చుని అస్తమానం హక్కులసంగతి మాట్లాడుకుంటూ వుండేవారు. అటువంటప్పుడు నా కొమ్మలను ఆశ్రయించుకొని బ్రతుకుతున్న పక్షులను బాధించే హక్కు వీరికి ఎవ్వరిచ్చారో! నా నీడన కూర్చొని కబుర్లు చెప్పుకొనే హక్కు వీరికి వున్నప్పుడు, నా చెట్ల కొమ్మలమీద గూళ్ళు కట్టుకొని నివసించే హక్కు పక్షులకు ఎందుకు లేదు? అసలు ఇంతకీ నా హక్కు మాటేమిటి? నన్నడిగే, వాళ్ళు నా క్రింద కూర్చున్నారంటారా?

అవి రెట్టలు వేస్తున్నవంటారా? నా వొడిలో కూర్చుని వీళ్ళు వూసే ఉమ్ముల మాటేమిటి? వాళ్ళు చేసే అనాకారపు పనులు వాళ్ళకు పట్టవు. వీళ్ళ పగలు పెద్దమనుష్యులుగానీ, రాత్రిళ్ళ చీకటిలో దూరం వెళ్ళ టానికి భయపడి, నా చుట్టు ప్రక్కల ఇండ్లవాళ్ళు నా క్రింద అందరూ కూర్చునేచోట చేసే కశ్మలం సంగ తేమిటి? రెట్టను వేసిన పక్షులమీదకు రాళ్ళు రువ్వేటప్పుడు ఆ సంగతులు వాళ్ళకి జ్ఞాపకంరావు.

నా కొమ్మల్లో మిగిలిన పక్షులతో పాటు వొక కాకికూడా గూడుకట్టుకొని వుంది. సాధారణంగా కాకులు మిగిలిన పక్షులతో కలిసివుండవు. ఎందుకనో ఈ కాకి నా అందన జేరింది. మిగిలిన పక్షులకుమల్లేకాక, కాకులకు మానవ సంపర్కం ఎక్కువగా ఉంటుంది. అవి మానవుల ఇండ్లలోనే ఎంగిళ్ళుతింటూ ఎండబోసినవి దొంగిలిస్తూ తిరుగుతూ వుంటవి. అందువల్ల ఆ కాకికి మనుష్యుల లక్షణాలు కొన్ని పట్టుబడ్డవి. దానికి మనిషికి వుండే కసివుండేది. మనుష్యులు అనవసరంగా నా మీద గూళ్ళు కట్టుకొనివున్న పక్షులను హింసించటం సహించలేక అది వొక పని మొదలు పెట్టింది. ఏ మనిషి నా క్రిందకూర్చుని గొప్పగా ఉత్సాహంగా మాట్లాడుతూ వుంటాడో, గురిచూచి అతని మీద రక్కిన రెట్టవేసి, ఎగిరిపోయేది. గొప్పగా మాట్లాడుతున్న ఆ వ్యక్తిముఖం అప్పుడు చూడవలసిందే. అతని కంగారు చూచి మిగిలిన మానవులంతా గుక్కలువట్టి నవ్వేవారు. ఆ కాకి పనికి నాకూ నవ్వు వచ్చేది.

కాని ఆ కాకిమీద పుట్టిన కసిని మానవులు ఇతర పక్షులమీద తీర్చుకోవటానికి ప్రయత్నించేటప్పటికి నా హృదయం ద్రవించుకుపోయేది. రెట్టవేసిన ఆ కాకికి వీళ్ళకీ భేదం ఏమిటా అని ఆలోచించ బుద్ధి అయ్యేది. నన్నాశ్రయించుకున్న పక్షులు మానవులవల్ల ఈ కష్టాలకే కాదు, ఇంతకంటే భయంకరమైన కష్టాలకు కూడా గురి అవుతూవుండేవి. అయితే ఈ కష్టాలు నిత్యం జరిగేవి అయితే అవి ఏటికి కోటికి జరుగుతుండేవి. ఏనాడూ మరుపుకు రానంత జ్ఞాపకం వొస్తే హృదయం ముక్కలయ్యేంత దారుణమైనవి అవి.

ఒకరోజు పిట్టలు కొట్టేవా డొకడు నా పరిసర ప్రాంతాల్లో తిరగడం మేమంతా చూశాం. గాలిని బట్టే అటువంటి వాళ్ళని మేం పసిగట్టగలం. గాలి మాకు నేస్తం. అపాయాన్ని ముందుగానే తన అలలమీద మోసుకువచ్చి మా చెవుల్లో ఊదిపోతూ ఉండేవాడు.

పిట్టలు కొట్టేవాడు వస్తున్నాడని పక్షులన్నీ తెలుసుకున్నాయి. కొన్ని పక్షులు భయంతో లేచిపోయినై. వాటిల్లో ఎక్కువ మొగపక్షులే! మిగిలిన పిల్లలు లేని ఆడపక్షులు, పిల్లలున్న ఆడపక్షులు, పిల్లలను విడిచి వెళ్ళలేక బయటకు కనబడకుండా గూళ్ళల్లోనే కూర్చున్నాయి. పిల్లలను దగ్గరకు జేర్చుకొని, ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని కూర్చు న్నాయి! పిట్టలుపట్టేవాడికి గూటిని పొడిచే ఆచారం వున్నదని వాటికి తెలుసు.

ఒక పక్షిమాత్రం భయంతో గూటి దాక వెళ్ళలేక నా కొమ్మ అంటిపెట్టుకు కూర్చుంది. ఆ కొమ్మన ఆకులు కూడా వున్నయి. పిట్టలు కొట్టేవాడు క్రిందా, తాను కొమ్మపైనా, ప్రక్కన నా ఆకులూ వున్నాయి. కనుక అతనికి కనపడననుకుంది పాపం ఆ పక్షి. నేనుకూడా దగ్గరలోవున్న ఆకులతో ఆమెను కప్పటానికి ప్రయత్నించాను. కాని పిట్టలు కొట్టేవాడు ఆ పక్షిని చూడనే చూశాడు. ఆ పక్షిని అంటుకొని పడివున్న నాకొమ్మ చిన్నది. ఆ పక్షి కొంచెం పెద్దది, దాని పొట్టలో కొద్దిభాగం కొమ్మను మించి వచ్చింది. పిట్టలు కొట్టేవాని చేతులలో కొనకు పదునైన బాకుకట్టిన వొక పెద్ద వాసాంవున్నది. ఆ వాసాన్ని పైకెత్తి దాని కొననవున్న బాకుతో క్రింద కనబడుతున్న ఆ పక్షి కడుపును పొడిచాడు. ఆ పక్షి కేరుమని అరిచింది. ఆ బాకు దాని కడుపులోకి దిగబడిపోయింది. వాసాన్ని దింపి బాకున నిలచివున్న పిట్టను వొదిలించుకుని సంచిలో వేసుకొని వెళ్ళిపోయాడు, ఆ పిట్టలవాడు.

ఇదంతా చూస్తూ నిలబడిపోయాను నేను. ఏంచెయ్యను? ఇతని గొంతు నులమటానికి భగవంతుడు నాకు చేతులనివ్వలేదు. నన్ను నేను పెళ్ళగించుకొని, అతనిమీద పడదామనుకున్నాను. ఆ ప్రయత్నంలో నేను మరణిస్తే మాత్రం ఏం? కాని నేను స్పృహలోకి వచ్చేటప్పటికే అతను దాటిపోయాడు.

మానవుల్లో మంచివాళ్ళు లేరనికాదు నా ఉద్దేశం. మంచివాళ్ళే లేకపోతే ఈ లోకం యింకా యెందుకు నిలిచి ఉంటుంది? మానవుల్లో ఎక్కువమంది మంచివాళ్ళే. అయితే వాళ్ళకు మాబోటి వాళ్ళ బాధలను గ్రహించే స్పృహ తగ్గిపోయింది. తాము ఏదో ఒక విధంగా బ్రతకడమే ముఖ్యమైంది.

బ్రతకటానికి ఇన్ని ఘోరాలు చెయ్యాలా? యితర జీవులను ఇంత నిర్దాక్షిణ్యంగా తమ పొట్టను పెట్టుకోవాలా? ఏ ఆకూ దుంపలు తింటే సరిపోదు? కాని యిప్పటి కుర్రవాళ్లు అలా అనుకున్నట్లు కనపడదు. వాళ్ళతో పాటు మాకూ ఈ ప్రపంచంలో బ్రతికే హక్కున్నదనీ, అందరం బ్రతికితేనే ఈ ప్రపంచం అందమనీ, వాళ్ళు అనుకొన్నట్లు కనపడదు.

ఇదివరకు ఎవ్వరైనా మా మీదకు రాళ్ళు విసిరితే "ఎందుకురా దాన్నట్లా కొడతావ్" అనేవారు. తెలియని వాళ్ళు మా కొమ్మలను విరిస్తే "పచ్చనిచెట్టుని విరిస్తే పాపంరా" అనేవారు. మొక్కలను పీకితే "కళ్ళుపోతై" అనేవారు. ఇప్పుడు అటువంటి మాటలు ఎక్కడా వినపడటంలేదు. రోజులలా మారినై. మానవుల దృష్టి మారిపోయింది.

ఇటీవల నరసింహులు అనే యువకుడు మా గ్రామం పంచాయితీ ప్రెసిడెంట్ అయ్యాడు. ఆతనిని నేను చిన్నప్పటినుంచీ ఎరుగుదును - నిన్న మొన్నటివరకూ ఆగతాయితనంగా తిరుగుతుండేవాడు. ఈ చెర్లోనే ఈదులాడుతుండేవాడు. నన్నెక్కి నాకొమ్మలను అనవసరంగా విరిచిపారవేస్తూవుండేవాడు. గోలచేసి గూళ్ళలోని పక్షులను

బయటకు తోలుతుండేవాడు. మరీ చిన్నప్పుడు బడికి వెళ్ళకుండా పలకా, పుస్తకాలు పట్టుకొని నా తొర్రలో దాక్కునేవాడు. తనలాంటి వాళ్ళనే ఇంకా నలుగుర్ని పోగుచేసి నా ఊడలు పట్టుకొని ఉయ్యాల లూగుతుండేవాడు.

ఆ నరసింహులు యిప్పుడు పంచాయితీ ప్రెసిడెంట్ అయ్యాడు. అతను ఆ ఉద్యోగంలోకి వచ్చినందుకు నేను చాలా సంతోషించాను. ఎందుకంటే అతను ఎన్ని ఆగతాయిపనులు చేసినా అతనంటే నాకు యిష్టంగానే వుండేది.

ప్రెసిడెంట్ అయినరోజు సాయం కాలమే పదిమంది గ్రామ పెద్దలను వెంట పెట్టుకుని నా దగ్గరకు వచ్చాడు. అప్పుడే గ్రామస్తులు అతనికి సన్మానం చేసినట్టున్నారు – కొత్తబట్టలు ధరించి చూడముచ్చటగా వున్నాడు. తనకు గౌరవ పదవి లభించగానే మాకున్న పరిచయాన్ని పురస్కరించుకొని నన్ను చూడటానికి వచ్చాడనుకొని నేను చాలా సంతోషించాను.


కాని అతను అందుకు రాలేదు. పంచాయితీ ప్రెసిడెంట్ అవటంతో అతనికి యీ చెరువు మీదా, ఈ చెరువు చుట్టూవున్న మామీదా హక్కు ఏర్పడింది, ఆ హక్కు అమలులో పెట్టటానికి వచ్చాడు. ప్రక్కన వున్న వానితో “ఈ చెట్లన్నీ అనవసరం. వీటి వల్ల చెరువుగట్టు పాడవుతూవుంది. చెర్లో నీరు పాడవుతూ వుంది. వీటిని వేలం వేయించి కొట్టించివేస్తే పంచాయితీకి కొంత డబ్బుకూడా వొస్తుంది. అంతగా అవసరం అనుకుంటే చిన్న పార్కు వంటిది వేయించుకోవచ్చు. సర్విచెట్లు వేయిస్తే త్వరగా అక్కరకు వస్తాయి. అమ్ముకుంటే ధరా బాగా పలుకుతుంది” అన్నాడు. అంతా నిజమేనంటే నిజమే అన్నారు. అతని అభ్యుదయ పంథాకు జోహారులు అర్పించారు.

అతని మాటలువింటే నాకు గుండె చెరువయింది; చావటానికి భయపడి కాదు. చావంటే మా జాతికి భయమే లేదు. నా గుండె చెరువయింది, అతని నిర్లక్ష్యానికి. మా ఉద్దేశాలను మేము మానవులకుమల్లే పైకిచెప్పుకోకపోయినా, మాకూ ప్రాణం అనేది వుంటుందని – నాతో యింత పరిచయం వున్న అతనికి తట్టకపోవటం నాకు ఆశ్చర్యం వేసింది. మాకు ప్రారంభం లేకపోతే మేము ఎలా పెరుగుతున్నాం అనుకున్నారు.

మేము నీడనివ్వటంమాట అటుంచి ఈ చెరువుగట్టు యిన్నేళ్ళనుంచీ వర్షానికి కరిగిపోకుండా ఉన్నదంటే దానికి కారణం భూమిలోకి మా వేళ్ళు అల్లు కోవటమే! ఈ సంగతి అతనికి తెలిసినట్లు లేదు. మా పాలూ మా కాయలూ యెన్నో జబ్బులను నయంచేస్తవి. ఈ సంగతి అతనికి తెలిసినట్లులేదు. ఊళ్ళో బీదవాళ్లు ఎంతమందో, నా ఆకులతో విస్తర్లు కుట్టుకొని భోజనాలు చేస్తున్నారు. ఈ సంగతి అతనికి తెలిసినట్లు లేదు. నేనుపోతే నామీద నివసించే ఈ పక్షులన్నీ ఏం కావాలని? నా వేళ్ళను పొయ్యిగా చేసుకొని వంటలు చేసుకునే బీదవాళ్ళంతా యేంకావాలి? అన్నిటికన్నా ముఖ్యంగా మా ప్రాణాలూ అతని ప్రాణాలు వంటివే గదా? మా ప్రాణాలు తియ్యటానికి అతనికేం హక్కుంది. ఎవ్వరు బ్రతకటానికి అర్హులో యెవ్వరు గాదో నిర్ణయించటానికి అర్హుడు తానా?

అయితే అతనిని ఎవ్వరు ఆపగలరు? పంచాయితీ బోర్డు ప్రెసిడెంట్ అవటంతో మా ప్రాణాలు అతని చేతుల్లోకి వెళ్ళినై. జీవకోటిని హింసించే అధికారం అతనికి వచ్చింది. త్వరగా మా ప్రాణాలు తీసి తనేదో ఘనకార్యం సాధించినట్లు గ్రామస్థులకు కనబడాలనుకున్నాడతను.

మరునాడే వడ్రంగులను వెంటబెట్టుకొని వచ్చాడతను. వాళ్ళు ముందు నా ఊడలను కోసి నా ఆధారాన్ని తప్పించారు. తరువాత నా కొమ్మలను నరికి నన్ను బోసిదాన్ని చేశారు. తరువాత నన్నే మొదట్లో కోసి వేశారు. నా



పైభాగం కుప్పమాదిరిగా కూలింది. ప్రస్తుతం నేను వొక మొండెమయి ఉన్నాను. అంటే, నా మొదలు మాత్రమే వుంది, ఈ పని జరిగి నాలుగైదు రోజులైంది. మరునాడే నన్ను సమూలంగా త్రవ్వి వేస్తారు, అనుకున్నా గాని ఎందుకనో ఆ పని జరుగలేదు. సరే, విచారిస్తూ ఊరికేకూర్చోవటం ఎందుకని నేను చిగర్చటానికి ప్రయత్నిస్తున్నాను. కాని మనస్సులో అతను నన్ను మొండెంతో విడిచి పెట్టడని తెలుసు. కట్టెలు కాగలననే ఆశతో నన్ను కుళ్ళగించివేస్తాడని తెలుసు. తెలిసీ నా పని నేను చెయ్యాలనే ఉద్దేశం. చిగర్చటానికి ప్రయత్నిస్తున్నాను. ఒకవేళ అతను నా సంగతి పట్టించుకోకపోయినా పెరిగి పెద్దదాన్నయ్యేదెప్పుడు? ఈ మానవులు యెందుకు యింత క్రూరంగా ప్రవర్తిస్తారో!

ఈ ప్రశ్నలకు పైన భగవంతుడు సమాధానం చెప్పాలి. కొన ఊపిరితో ఉన్నదానికి రంగరించి చిగర్చటానికి ప్రయత్నించటమే నా ధర్మం!

## ఇవి చేయండి



**ఉపాధ్యాయుడు చెప్పిన కింది పదాలను (ఉక్తలేఖనం) రాయండి.**

ఋణం, కశ్మలం, రహస్యం, గ్రామస్థులు, దోసిళ్ళు, అర్థించు, ఘోరము, పక్షులు, లక్షణము, మార్జనం

## అవగాహన - ప్రతిస్పందన

1. చుట్టూ ఉన్న పరిసరాలలో మానవులకు మేలుచేసే చెట్లు /పక్షులు / జంతువులను గురించి వారి మాటల్లో చెప్పండి.
2. మీరు చూసిన / విన్నటువంటి బాధ / సంతోషం గురించి మీ మాటల్లో చెప్పండి.
3. మర్రిచెట్టు నిస్వార్థ బుద్ధితో పక్షులకు, మానవులకు ఎలాంటి సహాయాన్ని అందిస్తోందో మీ మాటల్లో చెప్పండి.

**4. కింది వచనం చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.**

స్వామి వివేకానంద అమెరికా, బ్రిటన్ వంటి సంపన్నదేశాలను దర్శించారు. భారతదేశానికి తిరిగి ప్రయాణమయినప్పుడు అక్కడి పత్రికా విలేఖరులు "మీ మాతృభూమి పట్ల మీ అభిప్రాయం ఏమిటి?" అని ప్రశ్నించారు. దానికి సమాధానంగా "భారతదేశాన్ని లోగడ ప్రేమించాను. కాని ఇప్పుడు భారతభూమిలోని ప్రతి ధూళికణం నాకు అత్యంత పవిత్రం. అది నాకొక తీర్థస్థానం" అని సగర్వంగా చెబుతారు. ఈవిధంగా కనిపెంచిన తల్లి మీద ఎలాంటి మాతృభావన ఉంటుందో మనకు జన్మభూమి అయిన భారతదేశం మీద కూడా అలాంటి మాతృభావన కలిగి ఉండాలనే ఉద్దేశాన్ని ప్రకటించారు.

**ప్రశ్నలు**

అ) వివేకానందుణ్ణి పరాయి దేశంలో పత్రికావిలేఖరులు ఏమని ప్రశ్నించారు?

ఆ) విలేఖరుల ప్రశ్నకు వివేకానందుడు ఏమని సమాధానం చెప్పారు?

ఇ) మాతృభావన ఎవరి యెడల కలిగి ఉండాలని ప్రకటించారు?

ఈ) వచనాన్ని చదివి 'శీర్షిక'ను నిర్ణయించండి.



## వ్యక్తీకరణ - సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి.**



1. మట్టిచెట్టు చెప్పిన నవ్వు తెప్పించే సంఘటన ఏది?
2. పక్షి కథను గురించి మట్టిచెట్టు ఏమి చెప్పింది?
3. నరసింహులు బాల్యాన్ని గురించి మట్టిచెట్టు ఏమని నెమరువేసుకొంది?

**ఆ) కింది ప్రశ్నలకు 8 నుంచి 10 వాక్యాల్లో జవాబులు రాయండి.**

1. మట్టిచెట్టు హక్కులను గురించి మాట్లాడవలసి వచ్చిన సందర్భాన్ని వివరించండి.
2. మట్టిచెట్టు తనకు - గ్రామానికి ఉన్న సంబంధాన్ని చెప్పిన విధానాన్ని మీ మాటల్లో రాయండి.
3. మానవుల వలె చెట్లు / పక్షులు / జంతువులు మాట్లాడగలిగితే ఎలా ఉంటుందో మీ మాటల్లో వివరించండి.



## భాషాంశాలు

**అ) కింది వాక్యాలను చదివి గీత గీసిన పదాలకు అర్థాన్ని రాయండి.**

ఉదా: గాల్వన్ లోయలో కల్నల్ సంతోష్ బాబు ధైర్య సాహసాలకు చైనా సైన్యం విస్తుపోయింది.

విస్తుపోవు - ఆశ్చర్యపడు

1. జంతువులు, పక్షులు వంటి ప్రాణుల యెడల నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించరాదు.

   నిర్దాక్షిణ్యం - -------------------

2. జడివానతో వీచే పెనుగాలి చెట్లను పెళ్ళగిస్తుంది.

   పెళ్ళగించు - -------------------

3. దండకారణ్యంలో రాముని సత్తువ రాక్షసులను వణికించింది.

   సత్తువ - -------------------

4. 2025 నాటికి భారతదేశం ఇదమిద్ధంగా విశ్వగురుస్థానాన్ని చేరుతుంది.

   ఇదమిద్ధం - -------------------

**ఆ) కింది పదాలకు పర్యాయపదాలను పద విజ్ఞానం నుండి గ్రహించండి.**

1. నెపం : ____________, ____________
2. ఆశ్రయం : ____________, ____________
3. అపేక్ష : ____________, ____________

**ఇ) కింది ప్రకృతి - వికృతులను జతపరచండి.**

| | | | |
|---|---|---|---|
| 1. హృదయము | ( ) | అ) | సత్తువ |
| 2. నిభము | ( ) | ఆ) | ఎద |
| 3. సత్త్వము | ( ) | ఇ) | పత్తనము |
| 4. పట్టణము | ( ) | ఈ) | నెపము |

**ఈ) కింది పదాలకు సొంతవాక్య ప్రయోగం చేయండి.**

ఉదా॥ సీత, సావిత్రి కబుర్లు చెప్పుకొంటున్నారు.

మనసులోపెట్టుకొను - తరతరాలు - విశ్రాంతి - చీటికీ మాటికీ - చూడముచ్చట - చెవిలో పడటం జ్ఞాపకం - అపేక్ష - ఆశ్రయం - అల్లాడి పోవు - అస్తమానం - మరుపుకురానంత - గొంతునులమటం ఉయ్యాలలూగు - ఆగతాయి పనులు.

________________________________________

________________________________________

________________________________________

________________________________________

________________________________________

**ఉ) కింది పదాలను ఏ అర్థంలో – సందర్భంలో ఉపయోగిస్తారో తెలుసుకోండి.**

ఉదా॥ కాలక్షేపం : 'సమయాన్ని వృథాగా గడుపుట' అనే అర్థంలో ఉపయోగిస్తారు.

1) హృదయ విదారకం : ..........................................................

2) గుండెలు అలసిపోయేటట్లు : ..........................................................

3) ముక్కు మీద వేలేసుకొను : ..........................................................

4) గుండె చెరువగు : ..........................................................

5) హృదయం ముక్కలవడం : ..........................................................

6) పొట్టన పెట్టుకును : ..........................................................



## వ్యాకరణాంశాలు

P9K2P7

**అ) కింది వాక్యాలు చదవండి.**

1. వాల్మీకి సంస్కృతంలో రామాయణాన్ని రచించాడు.
2. వ్యాసుడు సంస్కృతంలో భారతాన్ని రచించాడు.
3. విశ్వనాథ సత్యనారాయణ తెలుగులో శ్రీమద్రామాయణ కల్పవృక్షాన్ని రచించాడు.
4. ఎర్రన తెలుగులో హరివంశాన్ని రచించాడు.
5. పోతన తెలుగులో భాగవతాన్ని రచించాడు.

**ఆ) గీత గీసిన పదాలను విడదీయండి.**

**ఉదా :** రామాయణాన్ని = రామాయణము + ని

1. భారతాన్ని =
2. కల్పవృక్షాన్ని =
3. హరివంశాన్ని =
4. భాగవతాన్ని =

పై ఉదాహరణల్లోని వాక్యాల్లో క్రియకు ముందు ఎవరిని / దేనిని / వేనిని అని ప్రశ్నిస్తే (వాల్మీకి సంస్కృతంలో దేనిని రచించారు?) వచ్చే సమాధానాన్ని 'కర్మ' అని చెప్పవచ్చు. అలాంటి పదాలకు చివర ద్వితీయా విభక్తి ప్రత్యయమైన ని/ను (రామాయణాన్ని) చేరటాన్ని గమనించవచ్చు.

## సకర్మకం – అకర్మకం

**ఇ) కింది వాక్యాలు చదవండి.**


1. కౌసల్య రాముని చూసి సంతోషించింది.
2. సుమిత్ర లక్ష్మణుని ఆశీర్వదించింది.

3. కైకేయి భరతుని రాజుగా చూడదలచింది.

4. శత్రుఘ్నుడు శత్రువులను జయించగలడు.

పై ఉదాహరణల్లో క్రియకు ముందు ఎవరిని / దేనిని / వేనిని (కౌసల్య ఎవరిని చూసి సంతోషించింది) అనే పదాన్ని ఉంచినపుడు సమాధానం వస్తోంది. కనుక ఈ వాక్యాలను 'సకర్మకాలు' అంటారు.

**ఈ) కింది వాక్యాలు చదవండి.**



1. దశరథుడు మరణించాడు.
2. జటాయువు నేలకూలాడు.
3. సూర్యుడు ఉదయిస్తున్నాడు.
4. సంపాతి ఎగురుతున్నాడు.

పై ఉదాహరణల్లో క్రియకు ముందు దేనిని / వేనిని / ఎవరిని అనే పదాన్ని ఉంచినప్పుడు ఎలాంటి సమాధానం రావడం లేదు. అంటే ఈ వాక్యాలలో కర్మ లేదని అర్థం. కనుక పై వాక్యాలను 'అకర్మకాలు' అంటారు.

## ఇత్వ సంధి



**ఉ) కింది వాక్యాలను గమనించండి**

1. ఇదెక్కడివిచిత్రమో!
2. ఏమంటివి? మంచిని పంచమంటివా?
3. వారికి ఏమైంది?
4. ఇదెంతపని
5. మంచి కొంచెం చేసినా పదింతలు ఫలితాన్ని ఇస్తుంది.
6. వారు ఏమన్నారు?

**ఊ) గీత గీసిన పదాలను విడదీయండి.**

| | | | | | |
|---|---|---|---|---|---|
| **ఉదా :** | ఏమేమి | = | ఏమి | + | ఏమి |
| 1. | ఏమంటివి | = | ______ | + | ______ |
| 2. | ఏమైంది | = | ______ | + | ______ |
| 3. | ఇదెంత | = | ______ | + | ______ |
| 4. | పదింతలు | = | ______ | + | ______ |
| 5. | ఏమన్నారు | = | ______ | + | ______ |

పై ఉదాహరణలలో విడదీసిన పదాలలో పూర్వ స్వరంగా 'ఇ' కారం ఉంది. ఇలా పూర్వస్వరంగా 'ఇ' ఉండి దానికి ఏదైనా అచ్చు పరమైనపుడు జరిగే సంధి కార్యాన్ని "ఇకార సంధి" అంటారు.

ఋ) కింది పదాలను విడదీయండి. పూర్వ స్వరాన్ని గమనించండి.

1. అమ్మగారింట్లో = ______________ + ______________
2. అత్తగారింట్లో = ______________ + ______________
3. ఏముంది = ______________ + ______________
4. చిన్నదైనా = ______________ + ______________
5. లేనిదంటు = ______________ + ______________

ౠ) కింది వాక్యాలను చదవండి. 'కర్మ' ను గుర్తించి గీత గీయండి.

1. నేను చెరువు గట్టునే పుట్టాను.
2. నేను దగ్గరలో ఉన్న ఆకులతో ఆమెను కప్పడానికి ప్రయత్నించాను.
3. పక్షి కేరుమని అరిచింది.
4. పిట్టలు కొట్టేవాడు పక్షి కదుపును పొడిచాడు.
5. మర్రి చెట్టు పాలు, కాయలు ఎన్నో జబ్బులను నయం చేస్తవి.
6. మరునాడే వడ్రంగులను వెంటబెట్టుకొని వచ్చాడు.

ఎ) పై వాక్యాల నుండి సకర్మక - అకర్మక వాక్యాలను విడదీసి రాయండి.

సకర్మక వాక్యాలు

1. ------------------------------------------------
2. ------------------------------------------------
3. ------------------------------------------------
4. ------------------------------------------------

అకర్మక వాక్యాలు

1. ------------------------------------------------
2. ------------------------------------------------
3. ------------------------------------------------
4. ------------------------------------------------

ఏ) పాఠం ఆధారంగా కొన్ని సకర్మక వాక్యాలు గుర్తించండి. రాయండి.

1. ------------------------------------------------
2. ------------------------------------------------

ఐ) పాఠం ఆధారంగా కొన్ని అకర్మక వాక్యాలు గుర్తించండి. రాయండి.

1. ----------------------------------------------

2. ----------------------------------------------

3. ----------------------------------------------

4. ----------------------------------------------



## ప్రాజెక్టుపని

**చుట్టూ వున్న పరిసరాలలో మానవులకు మేలు చేసే(వేప/రావి/తులసి/తుమ్మ)ఏదైనా చెట్టు చిత్రాన్ని గీయండి. దాని గురించి రాయండి.**



## సుభాషితం



మేలైనను గీడైనను
శీలవతీ! మనుజుడెద్ది సేయు బరులకున్
వాలయంబుగ నది ఫల
కాలంబున గుడుచు వేరుగలుగదు చెపుమా!

**భావం:** ఓ సదాచార సంపన్నురాలా! మానవుడు ఇంకొకరికి మేలు చేసినా, కీడు చేసినా దానికి సంబంధించిన ఫలితాన్ని అనుభవించి తీరుతాడు. ఫలితం అనుభవించుటలో ఇంకో విధంగా జరగనే జరగదు.



## నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | పాఠాన్ని అర్థం చేసుకొని సొంత మాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. | పాఠాన్ని ధారాళంగా చదవగలను. | ఔను / కాదు |
| 3. | రచయిత పాఠంలో చేసిన వాక్యప్రయోగాన్ని గ్రహించి అనుసరించగలను. | ఔను / కాదు |
| 4. | పరిసరాలలో ప్రాణులను గమనిస్తూ, వాటి బాధను గురించి రాయగలను. | ఔను / కాదు |




## ఉపాధ్యాయులకు సూచనలు

1. 'మాకూ ఉన్నాయి స్వగతాలు' రచనను సేకరించండి. చదవండి.
2. 'నీతి చంద్రిక' కథలను విద్యార్థులతో చదివించండి.

**చదవండి - ఆనందించండి**

## ఆచరించి చూపాలి



ఒకసారి రామకృష్ణపరమహంస నివసించే ఆశ్రమానికి తన ఆరేళ్ళ కుమారుడిని తీసుకొని ఒక తల్లి వచ్చింది. 'స్వామీ! మా అబ్బాయి ఎంత చెప్పినా వినిపించుకోకుండా పదే పదే తీపి తింటున్నాడు. ఈ అలవాటును వాడితో ఎలాగైనా మానిపించండి' అని కోరింది.

రామకృష్ణ పరమహంస ఆ బాలుడి వైపు చూశారు. ఆమెతో "అమ్మా! ఒక వారం రోజుల తర్వాత మీ అబ్బాయిని తిరిగి నా వద్దకు తీసుకురండి." అని పంపేశారు.

వారం రోజులు గడిచాయి. రామకృష్ణ పరమహంస చెప్పినట్లుగానే ఆమె తన కొడుకుని తీసుకొని ఆశ్రమానికి వచ్చింది. అమ్మా! మరో వారం రోజుల తర్వాత మీ అబ్బాయిని తీసుకొని మళ్ళీ నా వద్దకు రండి". అని చెప్పి పంపారు.

మూడోసారి ఆ మహిళ తన బాలుడిని తీసుకెళ్ళింది. అప్పుడు పరమహంస బాబుతో "బాబూ! తీపితినొద్దు" అని చెప్పారు. దానికి బాలుడు అలాగేనంటూ తల ఊపి తీపి తినడం మానేశాడు. ఆ తల్లి ఎంతగానో సంతోషించి మరోసారి రామకృష్ణ పరమహంసను కలవడానికి ఆశ్రమానికి వెళ్ళింది. "స్వామీ! మా అబ్బాయి మీరు చెప్పగానే తీపి తినడం మానేశాడు. చాలా సంతోషం కానీ ఇలా చేయడానికి రెండు వారాల సమయం ఎందుకు తీసుకున్నారో నాకు అర్థం కాలేదు" అంది.

రామకృష్ణ పరమహంస ఆమెతో "అమ్మా! మీరు నా దగ్గరకు మొదటిసారిగా వచ్చినప్పుడు తీపి అతిగా తినే అలవాటు నాకు ఉంది.నేను తినడం మానేసినప్పుడు మీ అబ్బాయికి తీపి తినకూడదని చెప్పే అర్హత నాకు ఉంటుంది. ఆ అలవాటు మానుకోవడానికి నాకు రెండు వారాల సమయం పట్టింది. అందుకే అలా చెప్పాను. ఇతరులు తమ చెడు అలవాట్లు మానుకోవాలని చెప్పేముందు మనం సక్రమంగా ఉండాలి కదా! మనం ఆచరించకుండా ఇతరులకు చెప్పే అర్హత మనకు లేదు. 'చెప్పి చేయడం కన్నా చేసి చెప్పడం మేలు' అని వివరణ ఇచ్చారు.


**వెన్నెలలో పడవ ప్రయాణం చేస్తూ వికసించిన మల్లెపూలను ఆఘ్రాణిస్తే కలిగే అనుభూతి తెలుగు భాష వింటున్నప్పుడు కలుగుతుంది. - సుబ్రహ్మణ్యభారతి**



# 5 పద్య పరిమళం

S8Q9V6

**వినడం – ఆలోచించి మాట్లాడడం**




1. చిత్రాన్ని గమనించండి. చిత్రంలో ఎవరెవరున్నారు?
2. మీకు తెలిసిన ఇలాంటి నీతి పద్యాలు చెప్పండి.
3. మీకు తెలిసిన శతక కవుల పేర్లు చెప్పండి.

**ఉద్దేశం:** లోకంలో మంచి చెడులను, లోక ధర్మాలను, లోకరీతులను తెలియజేసి, విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించడం. వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం ఈ పాఠం ఉద్దేశం.

| క్ర.సం. | కవి | కాలం | రచన |
|---|---|---|---|
| 1 | పోతన | 15వ శతాబ్దం | భాగవతము |
| 2. | పక్కి అప్పల నరసయ్య | 16వ శతాబ్దం | కుమార శతకం |
| 3. | మారద వెంకయ్య | 16వ శతాబ్దం | భాస్కర శతకం |
| 4. | పోతులూరి వీరబ్రహ్మం | 17వ శతాబ్దం | కాళికాంబ సప్తశతి |
| 5. | గువ్వల చెన్నడు | 17వ శతాబ్దం | గువ్వల చెన్న శతకం |
| 6. | ఏనుగు లక్ష్మణ కవి | 18వ శతాబ్దం | సుభాషిత రత్నావళి |
| 7. | చుక్కా కోటి వీరభద్రమ్మ | 20వ శతాబ్దం | నగజా శతకం |
| 8. | గద్దల శాంయూల్ | 20వ శతాబ్దం | హితోక్తి శతకం |
| 9. | జెండామాన్ ఇస్మాయిల్ | 20వ శతాబ్దం | ఆంధ్రపుత్ర శతకం |

## పద్య పరిమళం



1

క ॥ క్షమ గలిగిన సిరి గలుగును
క్షమ గలిగిన వాణి గలుగు సౌఖ్యము లెల్లన్
క్షమ గలుగఁ దోన కలుగును
క్షమ కలిగిన మెచ్చు శౌరి సదయుఁడు తండ్రీ!

– ఆంధ్ర మహాభాగవతం

2

* క ॥ ధనమే మైత్రినిఁదెచ్చును
ధనమే వైరమును దెచ్చు ధనమే సభలన్
ఘనతను దెచ్చును నెంతటి
గొనముల కుప్పలకునైన గువ్వలచెన్నా !

– గువ్వల చెన్న శతకం





3

* క ॥ వృద్ధ జన సేవఁజేసిన
బుద్ధి విశేషజ్ఞుడనుచుఁబూత చరితుడున్
సద్ధర్మశాలియని బుధు
లిద్ధరఁ బొగడెదరు ప్రేమయెసంగ కుమారా!


– కుమార శతకం

ఆ.వె ॥ పరుల దిట్ట నోరు పాప పంకిల మౌను
పెద్దలను నుతింప శుద్ధియగును
నోటి మంచి తనము పాటించు సుజ్ఞాని
కాళికాంబ! హంస కాళికాంబ !

– కాళికాంబ సప్తశతి

4





5

కం॥ సత్యమె యశముకు మూలము
సత్యమె భవమోహపాశ సంసృతి బాపున్
సత్యమె శీలము నిలుపును
సత్యముతో నెట్టివ్రతము చాలదు నగజా

– నగజా శతకం

✻ కం॥ గురుభక్తియు విద్యలపై
తరగని విశ్వాస సంపద వినయము నిరం
తర సాధన, ధారణ పున
శ్చరణము విద్యార్థికి యవసర లక్షణముల్

– హితోక్తి శతకం

6





7

ఆ.వె ॥ చూడనగ్నిఁ గాలి సుత్తి దెబ్బలకోర్చి
మేలి సొమ్ములగుచు మెరియుఁ బసిడి
బాధలోర్చుకున్న భవిత వర్ధిల్లురా
అఖిల లోకమిత్ర! ఆంధ్రపుత్ర!

– ఆంధ్రపుత్ర శతకం

✻ ఉ ॥ చేసిన దుష్టచేష్ట నదిచెప్పక, నేర్పునఁగప్పిపుచ్చి తా
మూసినయంతటన్, బయలుముట్టక యుండదదెట్లు, రాగిపై
బూసిన బంగరుం జెదరి పోవగడంగిన నాడు నాటికిన్
దాసిన రాగి గానబడదా జనులెల్ల రెఱుంగ భాస్కరా !

– భాస్కర శతకం

8





9

❋ చ ॥ కరమున నిత్యదానము, ముఖంబున సూనృతవాణి, యొౕదలం
గురుచరణాభివాదన, మకుంఠిత వీర్యము దోర్యుగంబునన్
వరహృదయంబునన్ విశదవర్తన, మంచితవిద్య వీనులన్
సురుచిరభూషణంబులివి శూరులకున్ సిరి లేనియప్పుడున్
– సుభాషిత రత్నావళి

## శతకం

నూరు పద్యాల రచనను 'శతకం' అంటారు. మకుట నియమం, సంఖ్యా నియమం, ఛందో నియమం, ముక్తకం శతక పద్యాల లక్షణాలు. వీటిలో ఏ పద్యానికి ఆ పద్యమే స్వతంత్ర భావం కలిగి ఉంటుంది. శతకపద్యాలు మానవ జీవిత మూలాలను తెలియజేస్తాయి.

### సారాంశం

**1వ పద్యభావం :** ఓ తండ్రీ! ఓర్పు కలిగి ఉంటే సంపద కలుగుతుంది. ఓర్పు ఉంటే విద్య అబ్బుతుంది. ఓర్పు ఉంటే సుఖములన్నీ కలుగుతాయి. సహనం కలిగి ఉంటే దయామయుడైన శ్రీహరి కూడా సంతోషిస్తాడు.

**2వ పద్యభావం :** ఓ గువ్వలచెన్నా! ధనము స్నేహాన్ని పెంచుతుంది. శత్రుత్వాన్ని కలుగజేస్తుంది. సభలలో గొప్పతనాన్ని తెచ్చిపెడుతుంది. ఇలా లోకంలో ఎన్నో గుణాలకు ధనమే కారణమవుతుంది.

**3వ పద్యభావం :** ఓ కుమారా! పెద్దలను సేవిస్తే బుద్ధి వికసిస్తుంది. ప్రవర్తన పవిత్ర మౌతుంది. సంస్కారం ధర్మబద్ధమవుతుంది. అలాంటి వారిని లోకంలో పండితులు కూడా కీర్తిస్తారు.

**4వ పద్యభావం :** ఓ కాళికాంబ! ఇతరులను నిందిస్తూ ఉండే నోటికి పాపం అనే బురద అంటుకుంటుంది. పెద్దలను గౌరవిస్తూ మాట్లాడితే పుణ్యం కలుగుతుంది. జ్ఞానవంతుడు ఎక్కడైనా, ఎప్పుడైనా మంచి మాటలనే మాట్లాడతాడు.

**5వ పద్యభావం :** ఓ నగజా! సత్యం కీర్తికి మూలం. సత్యం కోరికలను, భవబంధాలను నశింపజేస్తుంది. సత్యం శీలాన్ని కాపాడుతుంది. సత్యాన్ని మించిన పూజ లేదు.

**6వ పద్యభావం :** గురువులపట్ల భక్తి, చదువులపట్ల అపార నమ్మకం. పెద్దలపట్ల వినయం, నిరంతరం కష్టపడేతత్వం, ఏదైనా అంశాన్ని గ్రహించి నిలుపుకోవడం (ధారణ), నేర్చుకున్న అంశాన్ని వల్లెవేసుకోవడం అనే సుగుణాలు విద్యార్థికి చాలా అవసరం.

**7వ పద్యభావం :** ఓ ఆంధ్ర పుత్రుడా! బంగారం అగ్నిలో కాలి, సుత్తి దెబ్బలకు ఓర్చుకొని విలువైన ఆభరణంగా తయారవుతుంది. అదే విధంగా బాధలను తట్టుకొని మనుగడ సాగిస్తే మంచి భవిష్యత్తు ఉంటుంది.

**8వ పద్యభావం :** ఓ భాస్కరా! ఎంత రహస్యంగా ఉంచినా, చేసిన చెడ్డపని బయటపడక మానదు. రాగి పైన బంగారంతో ఎంతచక్కగా పూతపూసినా, క్రమంగా బంగారం అరిగిపోయినకొలదీ రాగి బయటపడుతుంది కదా!

**9వ పద్యభావం :** చేతులతో నిత్యం దానం చేయడం, ఎప్పుడూ సత్యాన్నే మాట్లాడడం, గురువు పాదాలకు తలవంచి నమస్కరించడం, తిరుగులేని విజయాన్ని కలిగించే భుజబలం కలిగిఉండడం, నిర్మలమైన మనస్సు కలిగి ఉండడం, చెవులతో శాస్త్రాలు వినడం – అనే ఈ గుణాలు మహాత్ములకు ఐశ్వర్యం లేని సమయంలో కూడా మంచి అలంకారాలుగా ప్రకాశిస్తాయి.



## ఇవి చేయండి

**ఉపాధ్యాయుడు చెప్పిన కింది పదాలను (ఉక్తలేఖనం) రాయండి.**

క్షమ – సౌఖ్యము – మోక్షం – మైత్రి – ఘనత – పంకిలం –మేలిమి – కాళికాంబ – సూనృతవాణి – సఖ్యము – ధారణ – వైరం – నిత్యదానము – సత్యము – శీలము – వ్రతము – పసిడి – గురుభక్తి – భాస్కరా – పునశ్చరణము – వర్ధిల్లు – విశేషజ్ఞుడు – సుజ్ఞాని – ఆంధ్రపుత్ర – విద్యార్థి



## అవగాహన - ప్రతిస్పందన

1. పాఠంలోని పద్యాలను రాగంతో, భావానికి తగినట్లుగా పాడండి.
2. మానవ జీవితంలో ధనం యొక్క అవసరాన్ని గురించి మీ మాటల్లో చెప్పండి.
3. వృద్ధులకు సేవ చేయవలసిన అవసరాన్ని గురించి మీ మాటల్లో చెప్పండి.
4. కింది పద్యం చదివి భావం రాయండి.

చందమామ ఇచ్చు చల్లని వెన్నెల
తేనెటీగ ఇచ్చు తీపి మధువు
మనిషివైన నీవు మరిఏమి తక్కువ
మంచిమాట లెపుడు మరువవద్దు !



**భావం :**

.................................................................................................

.................................................................................................

.................................................................................................

.................................................................................................

## వ్యక్తీకరణ - సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. క్షమ వలన ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయి?
2. వీరబ్రహ్మేంద్రస్వామి జ్ఞానవంతుని లక్షణాన్ని గురించి ఏమని చెప్పారు?
3. వృద్ధులను ఎందుకు సేవించాలి?
4. సత్యవాక్కు వలన కలిగే ప్రయోజనాలు ఏవి?

**ఆ) కింది ప్రశ్నలకు 8 నుంచి 10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. "బాధలోర్చుకున్న భవిత వర్ధిల్లురా"? అనే విషయాన్ని కవి ఎలా తెలియజేశారు?
2. "రాగిపై పూసిన బంగారం చెదిరిపోవును" అని కవి అనడంలో ఆంతర్యం ఏమిటి ?
3. మహాత్ములకు ఉండవలసిన సహజ లక్షణాలు ఏవి?
4. ఈ పాఠంలోని పద్యాల ఆధారంగా మీరు నేర్చుకున్న మంచి లక్షణాలను రాయండి?



## భాషాంశాలు

**అ) కింది వాక్యాలను చదవండి. గీతగీసిన పదాలకు అర్థాలు రాయండి.**

ఉదా: మనిషికి ధనంపై మోహం ఉండరాదు.

మోహం = కోరిక

1. క్షమ వలన సిరి లభిస్తుంది.

   క్షమ = ..............................................................

2. స్నేహితులతో వైరం మంచిదికాదు

   వైరం = ..............................................................

3. తామరలు పంకిలం నుండి వికసిస్తాయి.

   పంకిలం = ..............................................................

4. భాస్కరుడు లోకానికి వెలుగునిస్తాడు

   భాస్కరుడు = ..............................................................

**ఆ) కింది వాక్యాలలో సమానార్థక పదాలను (పర్యాయ పదాలు) గుర్తించి రాయండి.**

1. కరముతో అన్నం తింటాము. హస్తములో జాతక రేఖలుంటాయి.

   చేయి = ..............................................................

2. ధనమే అన్నింటికీ మూలం. ద్రవ్యం లేక పేదలు ఆకలితో పస్తులుంటున్నారు.

   సిరి = ..............................................................

3. ఆడపిల్ల చదువు అవనికే వెలుగు. భూకంపం వల్ల పుడమి కుంగుతుంది.

   భూమి = ..............................................................

4. కంసాలి పసిడితో ఆభరణాలు చేస్తాడు. ఆడవారికి పుత్తడిపై మమకారం ఎక్కువ.

   కనకం = ..............................................................

**ఇ) కింది పదాలకు వ్యతిరేక పదాలను రాయండి.**

ఉదా: పాపం × పుణ్యం

1. ధర్మం × ....................
2. సురులు × ....................
3. విద్య × ....................
4. చెడు × ....................

ఈ) కింది ప్రకృతి – వికృతి పదాలను జతపరచండి.

| | | | |
|---|---|---|---|
| 1. | విద్య | (   ) | అ) అంచ |
| 2. | అగ్ని | (   ) | ఇ) విద్దె |
| 3. | ధర్మము | (   ) | ఈ) మొగము |
| 4. | హంస | (   ) | ఉ) అగ్గి |
| 5. | ముఖము | (   ) | ఊ) దమ్మము |

## పదకేళి

ఉ) కింది పదపట్టిక ఆధారంగా శతకాలను, శతక కర్తలను గుర్తించండి. వాటి చుట్టూ గీతగీసి ఖాళీలలో రాయండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| కా | ళి | కాం | బ | | కు |
| శ | తె | హం | ద్దె | న | మా |
| హా | లు | స | భా | స్క | ర |
| స్త్రీ | గు | ధి | ర | శ | దా |
| శ్వ | పూ | క | రు | ణ | శ్రీ |
| ర | లు | ఏ | ను | గు | శ్రీ |



ఉదా : పక్కి అప్పల నరసయ్య రాసిన శతకం? = కుమార

| | | | |
|---|---|---|---|
| 1. | ధూర్జటి రాసిన శతకం? | = | ............................ |
| 2. | వీరబ్రహ్మం గారు రాసిన శతకంలోని మకుటం | = | ............................ |
| 3. | మారద వెంకయ్య రాసిన శతకం? | = | ............................ |
| 4. | తెలుగుబాల శతక కర్త? | = | ............................ |
| 5. | కంచర్ల గోపన్న రాసిన శతకం? | = | ............................ |
| 6. | సుమతీ శతకం రాసిందెవరు? | = | ............................ |
| 7. | నార్ల చిరంజీవి రాసిన శతకం? | = | ............................ |
| 8. | సిరిసిరి మువ్వ శతక కర్త? | = | ............................ |
| 9. | కాళికాంబ సప్తశతి శతక మకుటంలోని పక్షి? | = | ............................ |
| 10. | సుభాషిత రత్నావళి కర్త పేరులోని జంతువు? | = | ............................ |



## వ్యాకరణాంశాలు

**అ) కింద విడదీసిన పదాలను కలిపి రాయండి.**

| | | | | | |
|---|---|---|---|---|---|
| **ఉదా :** | జనులు | + | ఎల్ల | = | జనులెల్లన్ |
| 1. | పంకిలము | + | ఔను | = | ________ |
| 2. | సొమ్ములు | + | అగుచు | = | ________ |
| 3. | సూర్యుడు | + | ఒక | = | ________ |
| 4. | బాధలు | + | ఓర్చుకున్న | = | ________ |



పైన విడదీసిన పదాలలో మొదటి పదం చివర 'ఉ' ఉంది. రెండవ పదం (పర పదం) మొదట 'అ, ఇ, ఎ' వంటి అచ్చులున్నాయి. ఇలా 'ఉ' కారానికి అచ్చులు పరమైతే సంధి తప్పక జరిగి '**ఉకార సంధి**' రూపాలు ఏర్పడుతాయి.

**కింది పదాలను విడదీసి, సంధి పేరు రాయండి.**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| **ఉదా:** | సౌఖ్యములెల్లన్ | = | సౌఖ్యములు | + | ఎల్లన్ | ( ఉకార సంధి ) |
| 1. | పంకిలమౌను | = | ................. | + | ................. | ( ) |
| 2. | కార్యములెల్ల | = | ................. | + | ................. | ( ) |

**ఆ) కింది విడదీసిన పదాలను కలిపి రాయండి.**

| | | | | | |
|---|---|---|---|---|---|
| **ఉదా:** | శుద్ధి | + | అగును | = | శుద్ధియగును |
| 1. | లేని | + | అప్పుడున్ | = | ________ |
| 2. | మూసిన | + | అంతటన్ | = | ________ |
| 3. | ప్రేమ | + | ఒసంగ | = | ________ |
| 4. | ముట్టక | + | ఉండదదెట్లు | = | ________ |

పైన విడదీసిన పదాలలో మొదటి పదం చివర 'అ, ఇ' వంటి అచ్చులున్నాయి. రెండవ పదం (పర పదం) మొదట అ, ఉ, ఒ వంటి అచ్చులు ఉన్నాయి. ఇక్కడ పూర్వ, పర పదాల మధ్య సంధి జరగనప్పుడు '**య్**' ఆగమంగా వచ్చి '**యడాగమ సంధి**' రూపాలు ఏర్పడుతాయి.

**ఇ) కింది పదాలను విడదీసి సంధి పేరు రాయండి.**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| **ఉదా:** | కాళికాంబ | = | కాళికా | + | అంబ | సవర్ణదీర్ఘసంధి |
| 1. | గురూపదేశం | = | ________ | + | ________ | ( ________ ) |
| 2. | చరణాభివాదనం | = | ________ | + | ________ | ( ________ ) |
| 3. | విద్యార్థి | = | ________ | + | ________ | ( ________ ) |
| 4. | ఋషీశ్వరుడు | = | ________ | + | ________ | ( ________ ) |

పైన విడదీసిన సంస్కృత పదాలలో మొదటి పదం చివర 'అ'కారం ఉంది. రెండవ పదం మొదట కూడా 'అ'కారమే ఉంది. ఇలా అకారానికి సవర్ణమైన (అదే అచ్చు) అకారమే వచ్చి **'సవర్ణ దీర్ఘ సంధి'** రూపాలు ఏర్పడ్డాయి.

**ఈ) కింద గీతగీసిన పదాలలోని ప్రత్యయాలను గుర్తించి, ఏ విభక్తులో రాయండి.**

ఉదా: వృద్ధ జనులయొక్క సేవ = షష్ఠీ విభక్తి

1. పరులను తిట్ట నోరు = ______________
2. సుత్తి దెబ్బలకు ఓర్చి = ______________
3. గురువు యందు భక్తి = ______________
4. ఓ ఆంధ్ర పుత్రుడా! మేలుకో = ______________
5. విద్య చేత వర్ధిల్లుము = ______________
6. వృక్షము అవనిని రక్షించును = ______________
7. క్షమ వలన సిరి కలుగును = ______________
8. పరుల కొరకు జీవింపుము = ______________

**ఆగమం**

**ఉ) కింది వాక్యాలను చదవండి. గీతగీసిన పదాలను విడదీసి రాయండి.**

1. మాయమ్మ వంట రుచికరంగా చేస్తుంది.
2. దుక్కిటెద్దు రంకె వేసింది.
3. పిల్లల మనసు చిగురుటాకు వంటిది.
4. సుమతి గుణవంతురాలు
5. గంగవ్వ బీదరాలు.

**ఉదా :** బీదరాలు = బీద + (ర్) ఆలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | మాయమ్మ | = | ............... | + | ................. |
| 2. | దుక్కిటెద్దు | = | ............... | + | ................. |
| 3. | చిగురుటాకు | = | ............... | + | ................. |
| 4. | గుణవంతురాలు | = | ............... | + | ................. |

పై ఉదాహరణల్లో పూర్వ పర స్వరాలకు మధ్యలో య్ – ట్ – ర్ లు అదనంగా వచ్చి చేరుతున్నాయి. ఇలా చేరడాన్ని **'ఆగమం'** అంటారు.

## ఆదేశం

**ఊ) కింది వాక్యాలను చదవండి. గీతగీసిన పదాలను విడదీయండి.**

1. తల్లిదండ్రులకు కష్టం కలిగించరాదు.
2. సుధ సంతలో కూరగాయలు కొన్నది.
3. రాజుకు గుఱ్ఱపుకళ్ళెం దొరికింది.
4. కరోనా సోకకుండా ఉండాలంటే కాలుసేతులు శుభ్రంగా కడుక్కోవాలి.

**ఉదా :** తల్లిదండ్రులు = తల్లి + తండ్రి

1. కూరగాయలు = .............. + ..............
2. గుఱ్ఱపుకళ్ళెం = .............. + ..............
3. కాలుసేతులు = .............. + ..............

పై ఉదాహరణలలో పూర్వ, పర పదాలు కలిసినప్పుడు ఒక అక్షరాన్ని తొలగించి వేరొక అక్షరం వచ్చి చేరింది. ఇలా ఒక అక్షరం స్థానంలో మరో అక్షరం రావడాన్ని **ఆదేశం** అంటారు.

## చతుర్థీ విభక్తి

**ఋ) కింది పట్టికను గమనించండి. పట్టిక ఆధారంగా జతపరచి రాయండి.**

| | | | |
|---|---|---|---|
| 1. | వంట | | పావురాలు నేలపై వాలాయి |
| 2. | గాలి | | పుత్రకామేష్టి యాగం చేశాడు. |
| 3. | తిండి గింజల | కొరకు | కట్టెలు కొట్టబడినవి |
| 4. | వామనుని | | పద్మాలు వేచి ఉన్నాయి |
| 5. | సూర్యోదయం | | బలి మూడడుగుల నేల దానం చేశాడు |
| 6. | దశరథుడు పుత్ర సంతానం | | కిటికీలు తెరిచారు |

**ఉదా :** తిండి గింజల కొరకు పావురాలు నేలపై వాలాయి.

1. వంట కొరకు = ______________________
2. గాలి కొరకు = ______________________
3. వామనుని కొరకు = ______________________
4. సూర్యోదయం కొరకు = ______________________
5. దశరథుడు పుత్రసంతానం కొరకు = ______________________

పై వాక్యాలలో **'కొరకు'** ప్రత్యయం పదాల మధ్య చేరింది. ఈవిధంగా **"కొరకున్, కై"** అనే ప్రత్యయాలు చేరితే దానిని **చతుర్థీ విభక్తి** అంటారు. పనిని ఉద్దేశించి చేసే క్రియలు కలిగిన వాక్యాలలో ఈ **'చతుర్థీ విభక్తి'** వస్తుంది. ఆధునిక కాలంలో **'కొరకు'** ప్రత్యయానికి బదులు **'కోసం'** అనే పదాన్ని వాడుతున్నారు.

## ప్రాజెక్టుపని

1. శతక కవులకు సంబంధించిన విషయాలను సేకరించి కింది పట్టికను తయారుచేయండి.

| క్రమ సంఖ్య | కవి పేరు | కాలం | శతకం పేరు | ఇతర రచనలు |
|---|---|---|---|---|
| | | | | |

## చమత్కార పద్యం

చలన శక్తి గలదు జంతువు గాదది
చేతులెపుడు తిప్పు శిశువు గాదు
కాళ్ళు లేవు సర్వకాలంబు నడచును
దీని భావమేమి తిరుమలేశ !




## మీకు తెలుసా?

**శౌరి**

శ్రీకృష్ణుని తండ్రి వసుదేవుడు. వసుదేవుని తండ్రి శూరుడు. శ్రీకృష్ణుడు శూరుని మనువడు కాబట్టి ఆయనకు **'శౌరి'** అని పేరు వచ్చింది.

**భవమోహపాశములు**

**'భవము'** అనగా పుట్టుక, ఉనికి అని, **'మోహము'** అనగా వలపు, భ్రాంతి అని, **'పాశము'** అనగా త్రాడు, బంధము అని అర్థాలు. ఈ మూడింటిని కలిపి భవమోహపాశములు అంటున్నారు. పుట్టుకతో వచ్చే కోరిక సంబంధ బాంధవ్యాలను **'భవమోహపాశములు'** అంటారు.

## నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | పాఠంలోని పద్యాలను రాగయుక్తంగా, భావయుక్తంగా పాడగలను. | ఔను / కాదు |
| 2. | పద్యభావాలను సొంత మాటలలో చెప్పగలను, రాయగలను. | ఔను / కాదు |
| 3. | పాఠంలోని పదాలను సొంత వాక్యాలలో ఉపయోగించగలను. | ఔను / కాదు |
| 4. | పాఠంలోని ప్రశ్నలకు జవాబులు సొంతమాటలలో రాయగలను. | ఔను / కాదు |

చదవండి - ఆనందించండి

## ఆశాపాత్ర



విశాల రాజ్యానికి రాజు ఇంద్రసేనుడు. ఒకరోజు మహారాజు అంతఃపురం పైనుంచి కిందికి చూశాడు. ఒక బిచ్చగాడు చెట్టు కింద కూర్చుని కనిపించాడు. అతని స్థితిని చూసి రాజు ఎంతో బాధపడ్డాడు. నేను ఎంతో చక్కగా పరిపాలిస్తున్నాను, రాజ్యంలో అందరూ సిరి సంపదలతో వర్థిల్లాలి కదా! మరి నా ఎదురుగానే ఒక బిచ్చగాడు కనబడడమేమిటి? అనుకున్నాడు. గబగబా అంతఃపురం నుంచి బయటికి వచ్చాడు. మంత్రులందరూ అతనిని అనుసరించారు. రాజు బిచ్చగాడిని సమీపించాడు. రాజు ఎదురుగా నిలబడడంతో బిచ్చగాడు భయం భయంగా లేచి నిల్చున్నాడు. ఇంద్రసేనుడు అతనితో " ఏం కావాలో కోరుకో" అని అన్నాడు. అప్పుడు బిచ్చగాడు నేను కోరుకున్నది మీరు ఇవ్వలేరు మహారాజా అన్నాడు. రాజుకు పౌరుషం వచ్చింది. ఏం కావాలన్నా ఎంత కావాలన్నా ఇస్తాను అన్నాడు. జోలె నుంచి భిక్షాపాత్రను తీశాడు. బిచ్చగాడు ఖాళీ పాత్ర రాజుకి చూపించాడు. ఈ పాత్ర నిండుగా దానం చేయండి చాలు మహాప్రభు అన్నాడు.

"వెండి వరహాలు తెచ్చి నిండుగా పోయండి" అని రాజు తన పరివారాన్ని ఆజ్ఞాపించాడు. దోసిళ్ళతో వరహాలు తీసుకు వచ్చారు. రాజుగారి ఆజ్ఞ నెరవేర్చడానికి మంత్రులు పోటీపడ్డారు. ఒక దోసెడు చాలు పాత్ర నిండిపోతుంది అంటూ ఓ మంత్రి వైపు దానం చెయ్యమన్నట్టుగా రాజు చూశాడు. ఆ మంత్రి భిక్షాపాత్రలో వరహాలు పోశాడు. దోసెడు వరహాలకు పాత్ర నిండిపోవాలి. కానీ నిండలేదు. పోసిన వరహాలు పోసినట్టే మాయమైపోయాయి.

పాత్ర ఖాళీగానే ఉంది. పాత్రను నింపడానికి మంత్రులంతా దోసిళ్ళతో వరహాలు పోస్తున్నారు. ఎన్ని వరహాలు పోసినా పాత్ర నిండడం లేదు. అది చూసి అంతా ఆశ్చర్యపోయారు. అప్పటికే అక్కడికి సామంతులు, పుర ప్రముఖులు వచ్చి చేరారు. నేను కోరింది మీరు ఇవ్వలేరు. ఇవ్వలేనని ఒప్పుకోండి. ఎవరి దారిన వారు హాయిగా బతుకుదాం అన్నాడు బిచ్చగాడు. రాజు ఒప్పుకోలేదు. తాను ఓడిపోవడం ఏమిటి? అనుకున్నాడు. కోశాగారం మొత్తం తీసుకొచ్చి భిక్షాపాత్రలో వేయమన్నాడు.



వజ్రాలు, వైఢూర్యాలు, రత్నాలు, మాణిక్యాలు, బంగారం, వెండి ఆభరణాలు అన్నీ తెచ్చి భిక్షాపాత్రలో పోశారు‘ ఎన్ని పోసినా ఎంత పోసినా పాత్ర ఖాళీగానే కనిపిస్తుంది. కోశాగారం ఖాళీ అయిపోయింది. సామంతుల కోశాగారాలు కూడా ఖాళీ అయిపోయాయి. చేతిలో చిల్లిగవ్వ లేకుండా అంతా కట్టుబట్టలతో నిల్చున్నారు. అయినా రాజు పట్టువీడలేదు. ఆ బిచ్చగాడు ముందు ఓడిపోవడాన్ని భరించలేక పోతున్నాడు. భిక్షాపాత్రను నింపేందుకు అందులో ఏనుగులనూ, రథాలనూ, గుర్రాలనూ, సైనికులను ఇలా అన్నింటిని ఉంచాడు. అయినా ఫలితం లేకపోయింది. పాత్ర ఖాళీగానే ఉంది. చివరి ప్రయత్నంగా సామంతరాజులనూ, మంత్రులనూ, అంతఃపురం లోని రాణులను కూడా ఉంచాడు.

అయినా పాత్ర నిండలేదు. ప్రజలంతా స్వచ్ఛందంగా అందులోకి ప్రవేశిస్తామన్నారు. రాజు వారించాడు. అప్పటికే సూర్యాస్తమయం అయింది. రాజు చేతులు జోడించి బిచ్చగాడి కాళ్ళ మీద పడ్డాడు. అయ్యా నేను ఓడిపోయాను. మీరే గెలిచారు. కానీ ఒక్క మాట దయచేసి చెప్పండి. ఈ భిక్షాపాత్ర మర్మమేమిటి? అని అడిగాడు. అప్పుడు ఆ బిచ్చగాడు పెద్దగా నవ్వుతూ మహారాజా ఈ పాత్ర మనిషి ఆశలకు మూలమైన మానవకపాలం (పుర్రె) తో తయారయింది. ఇది ఒక ఆశాపాత్ర. ఒకటి లభిస్తే ఇంకొకటి ఆశించే మనిషి నైజం (స్వభావం) తో తయారైన పాత్ర ఇది. మొత్తం ప్రపంచాన్నే మింగేస్తుంది. ఆశ ఉన్నంత వరకూ అందరూ బిచ్చగాళ్ళే అన్నాడు.

**తేనెకన్న మధురంరా తెలుగు – ఆ తెలుగుదనం మా కంటి వెలుగు**

**– ఆరుద్ర**



# 6 మన విశిష్ట ఉత్సవాలు

(ఉపవాచకము)

H8H2H4

మన తెలుగు రాష్ట్రాలలో వివిధ ఉత్సవాలు, జాతరలు జరుగుతుంటాయి. అవి ఆయా ప్రాంత ప్రజల చరిత్ర, సంస్కృతి వారసత్వ సంపదకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. విభిన్న అలవాట్లు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ప్రజల మధ్య ఐకమత్యాన్ని నెలకొల్పుతున్నాయి. మనదేశ మూలభావం భిన్నత్వంలో ఏకత్వం. ఈ భావాన్ని పెంపొందిస్తూ మన రాష్ట్రంలో జరిగే కొన్ని ఉత్సవాల గురించి తెలుసుకుందాం....

## 1. సిరిమానూత్సవం

సిరిమాను అంటే సంపదలిచ్చే పెద్ద చెట్టు. పైడితల్లి అమ్మవారు ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు. ఆ అమ్మవారి సిరిమానోత్సవం విజయనగరంలో జరుగుతుంది. ఈ ఉత్సవంలో మన రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాలనుండి కూడా లక్షలాది మంది భక్తులు పాల్గొంటారు.



పైడితల్లి అమ్మవారి జాతరలో భాగంగా జరిగే ఈ సిరిమానోత్సవంలో చారిత్రక అంశాలు మిళితమై ఉన్నాయి. ఒకసారి విజయనగరాన్ని పరిపాలించే విజయరామరాజు యుద్ధానికి సిద్ధమవుతాడు. యుద్ధానికి వెళ్ళవద్దని అతని చెల్లెలు పైడిమాంబ బ్రతిమాలింది. అయినప్పటికీ చెల్లెలు మాట పెడచెవిన పెడతాడు. యుద్ధానికి వెళ్తాడు. యుద్ధరంగంలో ఉన్న అన్నని చూడడానికి పైడిమాంబ బయలుదేరుతుంది. అక్కడికి చేరేలోపే తాండ్ర పాపారాయుడి చేతిలో తన అన్న హతమయ్యాడన్న వార్త తెలిసి స్పృహ కోల్పోతుంది. పరిచారికలు పరిచర్యలు చేశాక పైడిమాంబ కోలుకుంటుంది. తన అన్న లేకుండా తాను జీవించలేనంటుంది. అక్కడే ఉన్న పెద్ద చెరువులో ఆత్మార్పణ చేసుకుంటుంది. కొంతకాలానికి స్నేహితురాళ్ళకు కలలో కనిపిస్తుంది. పెద్ద చెరువులో తాను విగ్రహమై వెలుస్తానంటుంది. తనను వెలికితీసి గుడి కట్టాలని చెప్పింది. దానితో బెస్తవారు వలలతో గాలించి అమ్మవారి విగ్రహాన్ని బయటికి తీశారు. చెరువుగట్టుపై పైడిమాంబ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

విజయదశమి తరువాత వచ్చే మొదటి మంగళవారం నాడు విగ్రహ ప్రతిష్ఠ చేస్తారు. అప్పటి నుండి దసరా తర్వాత వచ్చే మొదటి మంగళవారంనాడు పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం జరుగుతోంది. సిరిమానోత్సవం జరగడానికి 15 రోజుల ముందుగానే పైడితల్లి అమ్మవారి సిరిమానును ఎక్కడినుండి తేవాలనే


విషయాన్ని పూజారి ఆలయ ధర్మకర్తలకు తెలియజేస్తాడు. పూజారి సూచన మేరకు వారు సిరిమాను ఉన్న చోటికి వెళ్తారు. స్థల యజమాని అనుమతితో సిరిమానును తీసుకువస్తారు.

సుమారు 60 అడుగుల పొడవు ఉండే సిరిమాను చివర ఆసనం ఏర్పాటు చేస్తారు. దానిపై పూజారిని కూర్చోబెడతారు. గుడిపూజారిని పైడిమాంబ అమ్మవారి ప్రతిరూపంగా భావిస్తారు. ఆయనను ఆ ఆసనంలో కూర్చోబెడతారు. ఆలయం నుండి విజయనగర రాజుల రాజప్రాసాదం వరకు మూడుసార్లు ఊరేగిస్తారు. ఆ సిరిమానుకు ముందుభాగంలో బెస్తవారి వల, అంజలిరథం (దేవతల రథం) నడుస్తాయి. సిరిమానోత్సవం అంగరంగవైభవంగా జరుగుతుంది. అమ్మవారు వెలిసిన తర్వాత ఈ ప్రాంత ప్రజలు ఎలాంటి ప్రకృతి వైపరీత్యాలకు గురికాలేదు. అదంతా అమ్మవారి దయ అని ఈ ప్రాంత ప్రజలు భావిస్తారు. జాతరలో భాగంగా అమ్మవారి ఘటాలు రాజ మహల్‌కి తీసుకువెళ్తారు. తిరిగి చదురు గుడికి చేరుకుంటారు. రాబోయే సంవత్సర కాలంలో జరిగే మంచి చెడులను పైడితల్లి అమ్మవారు పూజారి రూపంలో చెబుతుందని భక్తుల విశ్వాసం. ఆ సమయంలో పూజారి ధాన్యపు గింజలను ఇస్తాడు. వాటిని తమ పొలాల్లో మొదటి విత్తుగా నాటుకుంటే మంచి పంట పండుతుందని రైతుల నమ్మకం.

## 2. గుణదల మేరీమాత ఉత్సవం

దక్షిణ భారతదేశంలో ఉన్న పెద్ద చర్చిలలో గుణదల మేరీమాత చర్చి ఒకటి. ఇక్కడ ఫ్రాన్స్ దేశంలోని లూర్ధు నగరం చర్చిలో ఉన్న మేరీమాత విగ్రహాన్ని పోలిన విగ్రహం ఉంది. ఇది గుహలో ఉంటుంది. విజయవాడ సమీపంలోని గుణదల చర్చిలో కూడా మేరీమాత విగ్రహం కొండ గుహలోనే ఉంటుంది. అందువల్ల ఈ చర్చి ప్రసిద్ధి చెందింది.

ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 9,10,11 తేదీలలో గుణదల మేరీమాత ఉత్సవాలు జరుగుతాయి. ఈ ఉత్సవాల వెనుక ఒక కథ ఉంది. లూర్ధునగర శివారులో ఉన్న కొండ దిగువకు వంట చెరకు ఏరుకోడానికి బెర్నాడెట్ అనే బాలిక వెళ్లింది. ఆమెకు మేరీమాత ఒక స్త్రీ రూపంలో దర్శనమిచ్చి, మాట్లాడింది. ఆ బాలిక ఇదే విషయం తల్లితోనూ ఇతరులతోను చెప్పింది. ఇది విని అందరూ ఆశ్చర్యపోయారు. మేరీమాత కనిపించిన ఫిబ్రవరి 11వ తేదీని గుర్తుచేసుకుంటూ, ప్రతి సంవత్సరం అక్కడ మేరీమాత ఉత్సవాలు జరుగుతాయి. గుణదలలో కూడా 1924 నుండి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 11న మేరీమాత ఉత్సవాలు జరుగుతున్నాయి.



1924 వ సంవత్సరంలో బ్రిటిష్ ప్రభుత్వం గుణదలలో "సెయింట్ జోసెఫ్స్ ఇన్‌స్టిట్యూట్" అనే అనాథ శరణాలయం ఏర్పాటు చేసింది. ఇటలీకి చెందిన ఫాదర్ పి. ఆర్లాటి దానికి రెక్టార్‌గా నియమితుడయ్యాడు. ఆయన అదే సంవత్సరం గుణదల కొండపై ఉన్న గుహలో మేరీమాత విగ్రహాన్ని నెలకొల్పాడు. అప్పటి నుండి మేరీమాత పూజలందుకుంటోంది.

1946 లో అప్పటి చర్చి ఫాదర్ బియాంకి, ఇతరులు కలిసి నూతన మేరీమాత విగ్రహాన్ని, బలిపీఠాన్ని నిర్మించదలిచారు. అత్యవసరంగా ఫాదర్ బియాంకి ఇటలీ వెళ్ళాడు. మిగిలినవారు చర్చి నిర్మాణాన్ని కొనసాగించారు. అకస్మాత్తుగా వచ్చిన వరదలలో అప్పటి వరకు సిద్ధమైన నిర్మాణాలన్నీ కొట్టుకుపోయాయి. తిరిగి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఫాదర్ బియాంకి ఇటలీ నుండి తిరిగి వచ్చేనాటికి (1947)చర్చి నిర్మాణం పూర్తయ్యింది. అప్పటి నుండి ప్రతి శుక్ర, శని, ఆది వారాల్లోనూ, క్రిస్మస్, జనవరి1, గుడ్ ఫ్రైడే వంటి క్రైస్తవ పర్వదినాల్లోనూ ప్రజలు మేరీమాతను దర్శించుకుని దీవెనలు పొందుతున్నారు.

భక్తుల తాకిడి పెరగడంతో గుణదల మేరీమాత ఉత్సవాలు ఒకే రోజు కాకుండా మూడు రోజులపాటు జరుపుకుంటారు. ఈ ఉత్సవాలకు లక్షలాదిగా భక్తులు హాజరవుతారు. కొండవద్ద సహజసిద్ధంగా ఏర్పడ్డ గుహనుండి కొండపై నిర్మించిన శిలువకు ఇప్పుడు మెట్ల మార్గాన్ని అభివృద్ధి చేశారు. ఈ కాలిబాటలో క్రైస్తవులు పవిత్రంగా భావించే వయాడోలరోసా అనే 14 స్థలాల విశిష్టతను తెలిపే క్రీస్తు జీవిత ఘట్టాలను ఏర్పాటు చేశారు. నవంబర్ నుండి డిసెంబర్ వరకు జరిగే ప్రత్యేక ప్రార్థనలకు రాష్ట్రం నలుమూలల నుండి క్రైస్తవ భక్తులు వేలాదిగా వస్తారు.

## 3. కోటప్పకొండ ప్రభల తిరునాళ్ళు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రసిద్ధిచెందిన శైవక్షేత్రాలలో కోటప్పకొండ ఒకటి. ఇది గుంటూరు జిల్లాలోని నరసరావుపేట సమీపంలో ఉంది. ఇది ఎల్లమంద కొండకావూరుకు మధ్య గల పర్వత ప్రాంతం. 1500 ఎకరాల వైశాల్యం ఎనిమిది మైళ్ళ చుట్టుకొలతతో ఈ ప్రాంతం విస్తరించి ఉంటుంది. ఈ కొండ చుట్టూ రాళ్ల మధ్యలో చిన్నచిన్న గుంటలు (దొనలు) ఉంటాయి. వీటితో పాటు కొండ మధ్యలో 'పాపనాశనం' అనే తీర్థం ఉంది. ఇది స్వయంగా శివుడు తన త్రిశూలంతో కొట్టగా ఏర్పడిందంటారు. వీటిలో స్నానం చేస్తే పాపాలు నశిస్తాయని భక్తుల నమ్మకం.



ఈ కొండను ఏ వైపు నుంచి చూసినా మూడు కూటములు (శిఖర ములు) కనిపిస్తాయి. వీటి మీద మూడు శివలింగాలు ఉన్నాయి. అందుకే కోటప్పకొండ త్రికూటాచలంగానూ, మధ్య శిఖరం మీద ఉన్న శివుడు త్రికూటేశ్వరుడిగా పూజలందుకుంటున్నాడు. కొండ కింది భాగంలో గొల్లభామ గుడి ఉంది. ఈమె పరమ భక్తురాలైన ఆనందవల్లి. ఈమెను ముందుగా దర్శించిన తరువాత కోటయ్యను దర్శిస్తారు. స్థలపురాణం ప్రకారం దక్షయజ్ఞం తరువాత పరమశివుడు ఇక్కడ పన్నెండు సంవత్సరాల బాలునిగా అవతరించాడు. శ్రీ మేధా దక్షిణామూర్తి రూపంలో దేవతలతో నివసించాడని చెబుతారు.

కోటప్పకొండ అనగానే మహాశివరాత్రినాడు జరిగే ప్రభల ప్రదర్శన గుర్తుకు వస్తుంది. ప్రభలు అనగా వెదురు కర్రలతో దీర్ఘచతురస్రాకారంగా పొడవైన ఆకారాలు నిర్మిస్తారు. దానికి పై భాగంలో త్రికోణపు ఆకారాన్ని ఏర్పాటు చేస్తారు. రంగు రంగుల గుడ్డలతోను కాగితాలతోను కప్పుతారు. రకరకాల బొమ్మలను అతికిస్తారు. ప్రభల అంచులను చిరుగంటలతో విద్యుద్దీపాలతో అలంకరిస్తారు. ఇవి పది నుండి వంద అడుగుల ఎత్తు వరకు ఉంటాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే ప్రభలలో ఒకదానిని మించిన ప్రభ మరొకటి ఎంతో ఎత్తయినది. వీటిని ఎడ్లబండ్లపైన, ట్రాక్టర్ల పైన ఉంచి మేళతాళాల మధ్య కొండకు ఊరేగింపుగా తీసుకువస్తారు.

మొక్కుబడులు ఉన్నవారు చిన్న ప్రభలను తమ భుజాలపై ఉంచుకొని కొండ చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. ప్రజలు ఆయా గ్రామాల నుండి ఊరేగింపుగా వచ్చేటప్పుడు స్త్రీలు కడవలతో వారు పోస్తారు. ప్రభల ముందు భాగంలో జంగమ దేవరలు కత్తులు చేతపట్టి "శివ శివ మూర్తివి గణనాథా – నీవు శివుని కుమారుడవు గణనాథా" అంటూ భక్తితో దండకాలు చదువుతారు. "చేదుకో కోటయ్య చేదుకో.... చేదుకో మల్లయ్య చేదుకో..." అని స్వామిని భక్తి భావంతో పిలుస్తూ కొండను ఎక్కడం నేటికీ ఇక్కడ చూడవచ్చే విశేషం.

వ్యవసాయంలో ముఖ్య భూమిక పోషించే ఎద్దులను ఈ ప్రాంత రైతులు కన్న బిడ్డలవలె సాకుతారు. కోడెదూడలు, ఎద్దులు, రైతుల ఇళ్ళలోని బిడ్డలు ఏవిధమైన అనారోగ్యం పాలవ్వకుండా క్షేమంగా ఉండాలని మొక్కుకుంటారు. మహా శివరాత్రి పర్వదిన సందర్భంగా అత్యంత జనసందోహంతో జరిగే జాతరగా కోటప్పకొండ ప్రభల తిరునాళ్ళు ప్రసిద్ధి చెందాయి. కోటప్పకొండ ప్రభల ఉత్సవాన్ని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించింది.

## 4. రొట్టెలపండుగ

హిందూ ముస్లింలు ఐకమత్యంతో జరుపుకునే పండుగలలో రొట్టెలపండుగ ఒకటి. ఇది నెల్లూరులో ఉన్న స్వర్ణాలచెరువు వద్ద జరుగుతుంది. దీనిని ప్రతి సంవత్సరం మొహర్రం నెలలో నెలవంక కనిపించిన పదకొండవరోజు నుండి మూడురోజుల పాటు నిర్వహిస్తారు. ఈ రొట్టెలపండుగలో మనరాష్ట్రం నుండే కాక ఇతర రాష్ట్రాల నుండి కూడా కులమతాలకు అతీతంగా లక్షలాదిగా ప్రజలు పాల్గొంటారు.

ఈ పండుగలో మహిళలు అత్యధికంగా పాల్గొంటారు. నెల్లూరు జిల్లా గండవరం వద్ద జరిగిన పవిత్ర యుద్ధంలో 12 మంది ఇస్లాం వీరులు మరణించారు. వీరి మొండాలను వారి గుర్రాలు దర్గామిట్ట చెరువు వద్దకు చేర్చాయి. మొండాలు అక్కడే ఖననం అయ్యాయి. కాలక్రమంలో ఈ పన్నెండు మొండాలకు స్థానికులు సమాధులు నిర్మించారు. ఆ స్థలానికి బారా షహీద్ (బారహ్ అనగా పన్నెండు.. షహీద్ అనగా వీరుడు) అని పేరు పెట్టారు. మరణించిన 12 మంది తలలలో ఏడుగురి తలలు మాత్రమే యుద్ధం జరిగినచోట లభ్యమయ్యాయి. ఈ ఏడు తలలు లభ్యమైన ప్రదేశాన్ని సాతోషహీద్ అంటారు.

నెల్లూరు ప్రాంతాన్ని పరిపాలించిన ఆర్కాటు నవాబు భార్య తీవ్రమైన అనారోగ్యంతో బాధపడేది. ఆ రోగనివారణకు నవాబు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం కనిపించలేదు. దర్గామిట్ట చెరువు వద్ద రజక దంపతులకు ఈ పన్నెండుమంది యుద్ధవీరులు కలలో కనిపించారు. సమాధులపై ఉన్న మట్టిని నవాబు భార్యకు లేపనంగా పూస్తే ఆమె ఆరోగ్యం కుదుట పడుతుందని తెలిపారు. ఆ దంపతులు ఈ విషయాన్ని నవాబు ఆస్థానంలోని రాజగురువుకి చేరవేసారు. రాజగురువు ద్వారా విషయం తెలుసుకున్న నవాబు బారాషహీద్ నుండి మట్టి తీసుకువచ్చి తన భార్యకు లేపనం చేస్తాడు. దానితో నవాబు భార్య ఆరోగ్యాన్ని తిరిగి పొందుతుంది.

దీనికి కృతజ్ఞతగా ఆర్కాటు నవాబు భార్యా సమేతంగా బారాషహీద్‌ను సందర్శిం చాడు. ప్రార్థనలు నిర్వహించి రొట్టెలు నైవేద్యంగా సమర్పించాడు. అక్కడ ఉన్న ప్రజలకు ఆ రొట్టెలు పంచాడు. బారాషహీద్ దర్గాను అభివృద్ధి చేసాడు.



అప్పటి నుండి ప్రజలు తమకు ఎలాంటి కోరికలు ఉన్నా బారహ్ షహీద్ దర్గాను సందర్శించడం ప్రారంభించారు. వారి కోరిక తీరితే తర్వాత సంవత్సరం దర్గాను సందర్శించి రొట్టెలు పంచుతామని మొక్కుకుంటారు.

అలా కోరిక తీరినవారు మరుసటి సంవత్సరం జాతరకు వస్తారు. రొట్టెల పండుగ నాడు వారు తెచ్చిన రొట్టెలను ఇతరులతో పంచుకుంటారు. రొట్టెల పండుగ మొదటిరోజు షహదత్‌తో ప్రారంభమవుతుంది. రెండవరోజు గంధోత్సవం జరుగుతుంది. గంధోత్సవంలో భాగంగా కోటమిట్టలోని అమీనియా మసీదు నుండి గంధాన్ని తీసుకువస్తారు. ఈ 12 సమాధులకు గంధం పూస్తారు. మిగిలిన గంధాన్ని భక్తులకు ప్రసాదంగా ఇస్తారు. మూడవరోజు రొట్టెలపండుగ. ఆ రోజు భక్తులు స్వర్ణాల చెరువులో దిగి రొట్టెలు ఒకరికొకరు ఇచ్చిపుచ్చు కుంటారు.

## 5. అహోబిలం పార్వేట ఉత్సవం

"హరినామమే కడు ఆనందకరము" అని నిత్యం తనని పూజించే భక్తుడు ప్రహ్లాదుణ్ణి రక్షించడానికి శ్రీమహావిష్ణువు నరసింహునిగా అహోబిలంలో అవతరించాడు. అహోబిలం కర్నూలు జిల్లాలో ఉంది. స్వామి వారి రూపాన్ని చూసిన దేవదానవులు అహో బలం ....అహో బలం అని ఆశ్చర్యపోయారు. ఇదే కాలక్రమేణా 'అహోబిలం' అనే పేరుతో స్థిరపడింది. ఇక్కడ కొలువైన నరసింహస్వామివారి దేవేరి చెంచులక్ష్మి.

ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ పౌర్ణమినాడు నరసింహుని కళ్యాణోత్సవం వైభవంగా జరుగుతుంది. ప్రతి దేవాలయంలోను కళ్యాణోత్సవం జరగడం ఆనవాయితీగా వస్తుంది. కాని అహోబిలంలో జరిగే కళ్యాణోత్సవానికి ఒక ప్రత్యేకత ఉంది. సంక్రాంతి వరకు దేవాలయంలో ఉన్న స్వామివారు కనుమనాడు ఉత్సవ మూర్తిగా దేవాలయం వెలుపలకి వస్తారు. ఈ క్రమంలో అహోబిలం చుట్టుప్రక్కల ఉన్న 35 గ్రామాలలో 41 రోజులపాటు ప్రతీ ఇంటిని సందర్శిస్తాడు. ఫాల్గుణ శుద్ధ పౌర్ణమినాడు జరిగే తన కళ్యాణోత్సవానికి రమ్మని ప్రజలను ఆహ్వానిస్తాడు.



ఈ సందర్భనలో కులమతాల ప్రసక్తిగానీ, ధనిక బీద తారతమ్యాలు కాని ఉండవు. ఆయా గ్రామాల పొలిమేరలకు స్వామివారి పల్లకి వస్తుంది. అక్కడి గ్రామాధికారులు, ప్రజాప్రతినిధులు ఎదురేగి స్వామి వారికి స్వాగతం పలుకుతారు. గ్రామంలోకి తోడ్కొనివెళ్తారు. 35 గ్రామాల ప్రజలూ తమ గ్రామానికి స్వామి వారి పల్లకి రాగానే సంబరాలు చేసుకుంటారు. స్వామివారి పల్లకి గ్రామంలో ఉన్నంతసేపు గ్రామం అంతా పండుగ వాతావరణం నెలకొంటుంది. ఈ విధంగా స్వామి వారు గ్రామాలు సందర్శించడాన్నే పార్వేట ఉత్సవం అంటారు. ఆయా గ్రామాలలోని తన ఆస్తులను స్వామి వారు చూసుకుంటారని అక్కడి వారి నమ్మకం.

పారువేట ఒక దేవ ఉత్సవం. 'పరి' అనగా గుర్రం, 'వేట' అనగా దుష్టశిక్షణ, శిష్టరక్షణ గురించి జరిగేది. దీనికై స్వామివారు అహోబిలం చుట్టుప్రక్కల సంచరిస్తారని నమ్మకం. సుమారు 600 సంవత్సరాల నుండి పార్వేట ఉత్సవాలు జరుగుతున్నాయి. స్వయంగా బ్రహ్మదేవుడు స్వామివారి కళ్యాణోత్సవం జరిపిస్తాడు. సకల దేవతలు స్వామి వారి కళ్యాణానికి హాజరవుతారని ప్రతీతి. దేవతలతో పాటు ప్రజలు కూడా హాజరై కళ్యాణోత్సవాన్ని తిలకిస్తారు. ఈ క్షేత్రంలో కొండపై ఉగ్ర నరసింహునిగా కొండ దిగువన శాంతమూర్తిగా, మొత్తం క్షేత్రం అంతా 9 రూపాలతో నవ నారసింహులుగా కొలువై ఉన్నారు. శ్రీమహావిష్ణువు నరసింహుని అవతారంగా ఉద్భవించిన స్తంభం కూడా ఇక్కడ ఉంది. 108 వైష్ణవ క్షేత్రాలలో అహోబిలం ప్రసిద్ధమైన 97వ క్షేత్రం. స్వామివారి కళ్యాణోత్సవానికి ఆంధ్రప్రదేశ్‌తోపాటు కర్ణాటక, తమిళనాడు నుండి కూడా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు.

## 6. లేపాక్షి ఉత్సవాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనంతపురం జిల్లాలోని లేపాక్షి ఒక చారిత్రక ప్రదేశంగా పేరొందింది. "లేపాక్షి ఉత్సవాలు" రాష్ట్ర పర్యాటకరంగ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్నాయి. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి,మార్చి నెలలో అనుకూలమైన ఏవైనా రెండు రోజుల్లో ప్రభుత్వం ఈ ఉత్సవాలు నిర్వహిస్తుంది. లేపాక్షి ఉత్సవాల సందర్భంగా ఈ రెండు రోజులూ అనేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. ప్రతి ప్రదర్శన కన్నులకు కట్టేదిగా ఉంటుంది. లేపాక్షి ఆలయాలకు సంబంధించిన యక్ష, హరికథా గానాలు ప్రదర్శిస్తారు. లేపాక్షి చరిత్రా సంస్కృతులను తెలియజెప్పే నృత్య, గాన, సంగీత ప్రదర్శనలు ప్రేక్షకులను ఆనందింపజేస్తాయి. లేపాక్షి ఆలయాలను, చారిత్రక కట్టడాలను ఉత్సవాల సందర్భంగా ప్రత్యేకంగా అలంకరిస్తారు.

విజయనగర రాజులు తమ పరిపాలనా కాలంలో ఇక్కడ ఎన్నో ఆలయాలు, కట్టడాలు నిర్మించారు. లేపాక్షి పట్టణంలోకి ప్రవేశించేటప్పుడు దేశంలోనే అతిపెద్ద ఏకశిలా నంది విగ్రహం చూడవచ్చు. ఇది ఠీవీగా పర్యాటకులకు ఆహ్వానం పలుకుతున్నట్లు ఉంటుంది. దీనినే లేపాక్షి బసవయ్య అంటారు. ఇది 8.1 మీటర్ల పొడవు, 4.5 మీటర్ల ఎత్తు కలిగిఉంటుంది. ఈ బసవయ్య మెడలో పూసలహారాలు, గంటలు ఉంటాయి. బసవయ్య విగ్రహం



రిక్కించిన చెవులతో, లేచి ఉరకబోడానికి కాళ్ళను సరిచేసుకుంటున్న భంగిమతో ఉంటుంది. మెడలో గల హారంలో వేలాడే రెండు గరుడ పక్షులు, వాటి ముక్కున వ్రేలాడే ఏనుగులు ఉంటాయి. ఇది ఆనాటి శిల్పుల అద్భుత శిల్పకళాసౌందర్యానికి ప్రతీక అని చెప్పవచ్చు. ప్రముఖకవి అడవి బాపిరాజు లేపాక్షి బసవన్నను ఉద్దేశించి రాసిన గేయం...




'లేపాక్షి బసవయ్య – లేచి రావయ్య
కైలాస శిఖరిలా – కదిలి రావయ్య....'

చాలా ప్రసిద్ధి చెందింది. ఈ విగ్రహానికి సమీపం లోనే మధ్యయుగం నాటి నిర్మాణకళతో కూడిన వీరభద్రస్వామి ఆలయం ఉంది. దీనినే 'లేపాక్షి' ఆలయం అంటారు. ఈ ఆలయం ఆధ్యాత్మికంగా ఎంతో ప్రత్యేకత సంతరించుకుంది. శివకేశవులకు భేదం లేదని చెబుతూ శివకేశవులను ఎదురెదురుగా ప్రతిష్ఠించారు. ఇక్కడ వెలసిన మూలవిరాట్టు వీరభద్రుడు. ఇదే ఆలయంలో స్తంభం పై దుర్గాదేవి విగ్రహం ఉంటుంది. గణపతి, నాగేంద్రుని పెద్ద రాతి విగ్రహాలు పర్యాటకులను ఆకర్షిస్తుంటాయి. లేపాక్షి ఆలయంలో రాతి పలకలు, స్తంభాలు, రాతి దూలాలు ఒకటేమిటి ప్రతి అణువూ అత్యద్భుతంగా నాటి శిల్పులు తీర్చిదిద్దారు. గోడలు, పై కప్పులపై చిత్రించిన వర్ణ చిత్రాలు అప్పటి చిత్రకారుల కళానైపుణ్యానికి దర్పణం పడతాయి.

ఆలయంలో చిత్రించిన రామాయణం, మహాభారతం, శివపురాణం, శివపార్వతుల కళ్యాణం, దశావతారాలు మొదలైన చిత్రాలు చూసి తీరవలసిందే. ఇక్కడ ప్రతి నిర్మాణం రాతితో నిర్మించినదే. వ్రేలాడే రాతి స్తంభం ఇక్కడ మరొక ప్రత్యేకత. లేపాక్షి చూడదగిన చారిత్రక ప్రదేశం అనడంలో ఎలాంటి సందేహం లేదు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిఏటా లేపాక్షి ఉత్సవాలు నిర్వహిస్తోంది.

## ప్రశ్నలు–జవాబులు

K7M9N3

**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి?**

1. గుణదల మేరిమాత ఉత్సవానికి మాతృక ఏమిటో తెలపండి?
2. కోటప్పకొండ తిరునాళ్ళలో గల మానవీయకోణం ఏమిటి?
3. అహోబిలం పార్వేట ఉత్సవం ప్రత్యేకత ఏమిటి?
4. లేపాక్షి ఉత్సవాల గురించి మీ సొంత మాటల్లో రాయండి.

**అ) కింది ప్రశ్నలకు 8 నుండి 10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. సిరిమానోత్సవం జాతర గురించి రాయండి?
2. 'మత సామరస్యానికి ప్రతీక రొట్టెల పండుగ' ఎందుకో రాయండి?
3. సంస్కృతి సంప్రదాయాలను మన వారసత్వ సంపదగా తరువాతి తరానికి ఎలా అందించాలో తెలియ చేయండి?

# పద విజ్ఞానం

**అ**

అంచిత - గౌరవింపదగిన
అకస్మాత్తు - ఉన్నట్టుండి
అక్కు - రొమ్ము , గుండె
అణువు - స్వల్పం
అదృశ్యం - కనిపించనిది
అప్ప - తండ్రి
అపేక్ష - కోరిక
అభివాదం - నమస్కారం
అభ్యంతరం - ఆటంకం
అవని - భూమి
అక్షరం - నశింపు లేనిది

**ఆ**

ఆచారం - నడవడి, ఆచరణ
ఆనవాయితీ - ఆచారం, సంప్రదాయం
ఆశ్రయం - ఆధారం

**ఇ**

ఇల - నేల
ఇలవేల్పు - కులదైవం

**ఋ**

ఋణం - అప్పు

**ఔ**

ఔదల - తల, శిరస్సు

**క**

కంబళి - గొంగళి
కనకం - బంగారం
కనుమ - కొండల సందు
కరము - చెయ్యి
కల - స్వప్నం
కవాతు - కసరత్తు
కశ్మలం - మలినం, మురికి
కుదుటపడు - స్థిమితపడు, తేరుకొను
కురులు - వెంట్రుకలు, జుట్టు, ముంగురులు
క్షమా - ఓర్పు, సహనం

**ఖ**

ఖననం - పాతి పెట్టడం, తవ్వడం

**గ**

గద్దించు - అరచు, మందలించు
గవాక్షం - కిటికి

**ఘ**

ఘటము - కుండ

**చ**

చరణం - పాదం
చారలు - గీతలు
చెలగి - ప్రకాశించి
చేష్ట - పని, ప్రవర్తన

**జ**

జడలగము - వెంట్రుకల అల్లిక

**త**

తహతహ - ఆసక్తి, పోరాటం
తావు - స్థానం, చోటు
తూగు - ఊగు

**ద**

దర్పణం - అద్దం
దుష్టుడు - చెడ్డవాడు
దోహదం - తోడ్పాటు, సహకారం
ధారణ - జ్ఞాపకశక్తి

### న

నిట్టూరుపు - దీర్ఘశ్వాస

నిద్దము - నునుపు, చక్కదనం

నెపము - కారణం

### ప

పంకిలం - బురద గలది

పరిచర్య - పూజ, ఆరాధన, సేవ

పాయక - విడువక

పారాడు - పిల్లలు ప్రాకు

పాశం - బంధం

పృథివి - భూమి

పైడి - బంగారం

ప్రదక్షిణం - ఎడమ నుంచి కుడి వైపుకు గుండ్రంగా తిరుగుట

ప్రలోభం - లోబరుచుకోవడానికి వేసే వల

### బ

బలుపు - బలము, పుష్టి

బాకు - కత్తి

బాహ్యము - బయట, వెలుపల

బుధులు - పండితులు

బొద్దు - లావైన, హస్తాభరణవిశేషం

### భ

భంగం - ఆటంకం

భంగిమ - తీరు, అంగ విన్యాసం

భవము - పుట్టుక

భ్రష్టుడు - చెడినవాడు

### మ

మలినం - మురికైనది

మహత్తు - గొప్పతనం

మార్జనం - తుడుచుట, తోమడం

మిళితం - కూడుకొనిన, కలసిన

ముచ్చట - కోరిక, సంభాషణం

ముప్పు - ఆపద

మైత్రి - స్నేహం

మొక్కు - నమస్కరించు

మొరవంక - వంకరైన

మోహం - కోరిక, ఆశ

### య

యశము - కీర్తి

### ర

రూఢి - ప్రసిద్ధి, నిశ్చయం

రిక్కించు - నిక్కపొడుచు

### ల

లేపనం - పూత, అలకడం

### వ

వాణి - మాట, పలుకు, సరస్వతి

విశ్వాసం - నమ్మకం, శ్రద్ధ

విస్తరించు - వ్యాపింప చేయు, వివరించు

వైరము - శత్రుత్వం

వృద్ధులు - పెద్దవారు

### శ

శయనం - నిద్ర

శరము - బాణం

శ్రేయస్సు - శుభం

### స

సంకోచము - సంశయం

సంసృతి - సంసారం

సాక్ష్యం - ఋజువు, ప్రత్యక్షంగా చూసింది

సుతులు - కొడుకులు

### హ

హాని - కీడు

హీనం - చెడు

## పర్యాయపదాలు

| | | |
|---|---|---|
| అద్దం | – | దర్పణం, ముకురం |
| అమ్మ | – | తల్లి, జనని |
| అపేక్ష | – | కోరిక, కాంక్ష |
| అవని | – | భూమి, పుడమి |
| ఇల | – | భూమి, వసుధ |
| ఆశ్రయం | – | ఊత, ఆధారం |
| కత్తి | – | కరవాలం, ఖడ్గం |
| కనకం. | – | బంగారం, పైడి |
| కన్ను | – | నేత్రం, దృష్టి |
| చేయి | – | కరం, హస్తం |
| నిద్ర | – | శయనం, సుప్తి |
| నెపము | – | మిష, వంక |
| పర్వతం | – | శైలము, గిరి |
| పాదం | – | అడుగు, కాలు |
| భూషణం | – | నగ, అలంకారం |
| మైత్రి | – | స్నేహం, చెలిమి |
| మేను | – | శరీరము, కాయం |
| రాజు | – | భూపాలుడు, నరేంద్రుడు |
| రాత్రి | – | నిశ, యామిని |
| వైరం | – | పగ, విరోధం |
| శరము | – | బాణం, అమ్ము |
| శిశువు | – | బిడ్డ, చంటిపాప |
| శౌరి | – | శ్రీహరి, విష్ణువు |
| సిరి | – | కలిమి, శ్రీ |
| సుతుడు | – | కుమారుడు, కొడుకు |

## లేపాక్షి బసవయ్య లేచి రావయ్య....

– అడవి బాపిరాజు

లేపాక్షి బసవయ్య లేచి రావయ్య
కైలాస శిఖరిలా కదలిరావయ్య!
హుంకరించిన దెసలు ఊగిపోయేను
ఖురముతో దువ్వితే కులగిరులె వణికేను ॥లేపాక్షి॥

ఆకాశగంగకై అర్రెత్తి చూస్తేను
పొంగేటి పాల్కడలి గంగడోలాడేను ॥లేపాక్షి॥

నంది పర్వతజాత నవపినాకిని జలము
నీ స్నాన సంస్పర్శ నిలువునా పులకించె ॥లేపాక్షి॥

వంగోలు భూమిలో పెనుగొండ సీమలో
నీ వంశ మీనాడు నిలిచింది గర్వాన ॥లేపాక్షి॥

'మన విశిష్ట ఉత్సవాలు' ఉపవాచకంలో 'లేపాక్షి ఉత్సవాలు' పాఠం ఉంది. అందులో 'లేపాక్షి బసవయ్య లేచిరావయ్య...' గేయం ప్రస్తావన వచ్చింది. ఇప్పుడు విద్యార్థుల కోసం పూర్తి గేయం.

# తెలుగు బాట - 7

తెలుగు వాచకం

## ఏడవ తరగతి (ప్రథమ భాష)

సెమిస్టర్ - 2

# సెమిస్టర్ - 2

# విషయసూచిక


| క్ర.సం. | పాఠం | ప్రక్రియ | ఇతివృత్తం | కవి / రచయిత | మాసం | పుట |
|---|---|---|---|---|---|---|
| 7. | కప్పతల్లి పెళ్ళి | గేయం | ఆచారం-సంప్రదాయం | చావలి బంగారమ్మ | నవంబర్ | 73 |
| 8. | ఎద | కథానిక | ఆశావహ దృక్పథం | బోనం నాగభూషణం సదానంద | డిశంబర్ | 85 |
| 9. | హితోక్తులు | అనువాదం | నైతిక విలువలు | రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ | జనవరి | 96 |
| 10. | ప్రియ మిత్రునికి... | లేఖ | మానవీయ విలువలు | డా॥ సూర్యదేవర సంజీవదేవ్ | ఫిబ్రవరి | 104 |
| 11. | బాలచంద్రుని ప్రతిజ్ఞ | ద్విపద | శౌర్యపరాక్రమాలు | శ్రీనాథుడు | మార్చి | 114 |
| 12. | స్ఫూర్తిప్రదాతలు (ఉపవాచకం)<br>1. అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ<br>2. ఆంధ్రతిలక్ గాడిచర్ల<br>3. కలియుగభీముడు కోడిరామమూర్తి<br>4. బహుముఖ ప్రజ్ఞాశాలి ఉమర్ అలీషా<br>5. అభినవ గాన గంధర్వుడు-బాలు<br>6. భారత స్కౌట్స్-గైడ్స్ | వ్యాసం | స్ఫూర్తి-సామాజిక సేవ | రచయితల బృందం | <br><br>నవంబర్<br>డిశంబర్<br>జనవరి<br>ఫిబ్రవరి<br>మార్చి<br>మార్చి | 124 |


సంస్కృతం కాంపోజిట్‌కోర్సుగా చదివేవారు ఉపవాచకం మినహా అన్ని పాఠ్యాంశాలను చదవాలి.

★ నక్షత్రం గుర్తుఉన్న పద్యాలను విద్యార్థులు కంఠస్థం చేయాలి.


# 7 కప్పతల్లి పెళ్లి

Z2L6E2



**వినడం - ఆలోచించి మాట్లాడడం**

1. చిత్రంలో ఎవరున్నారు?
2. రైతులు దేనికోసం ఎదురుచూస్తున్నారు?
3. వర్షాలు కురవకపోతే ఏమౌతుంది?



**ఉద్దేశం:** ప్రాచీనకాలం నుండి భారతదేశం సంస్కృతీ సంప్రదాయాలకు, ఆచారవ్యవహారాలకు నిలయం. వాటిలో భాగంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పుడు కప్పలకు పెళ్ళిళ్ళు చేసేవారు. అలా చేయడం వలన వరుణదేవుడు కరుణించి వర్షాలు కురిపిస్తాడనే నమ్మకాన్ని కలిగి ఉండేవారని చెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.

## చావలి బంగారమ్మ

**(1897-1970)**

చావలి బంగారమ్మ తూర్పుగోదావరిజిల్లా కొత్తపేట మండలం మోడేకుర్రు గ్రామంలో జన్మించారు. 1930లో ముద్దుకృష్ణ 'వైతాళికులు' ద్వారా వీరి కవితలు వెలుగులోకి వచ్చాయి. బంగారమ్మ కవితలు తెలుగుకవిత్వంలో కొత్తఒరవడిని, సరికొత్త భావవ్యక్తీకరణను తీసుకొచ్చాయి. వీటిని 1958లో 42 కవితలతో 'కాంచన విపంచి' పేరుతో సంకలనం చేశారు.

# కప్పతల్లి పెళ్లి

కప్పతల్లి పెళ్లి నేడూ –చూడారే
కావిళ్ళనీళ్ళోంపినాడు!
వరుణదేవుడు వంపినాడూ – ఓ చెలీ
వాడలన్నీ నింపినాడు!
గగనతలము నుంచి నేడు – వీవెనలు
చెట్లచే వేయించినాడు!
స్వర్గాధినాథుడు నేడూ – రథమెక్కి
పయనమై పోవుచున్నాడు!



భత్యాలు లేకనేవాడు – పెళ్లికి
బాజాలు వేయించినాడు!
బండరాళ్ళ పైని వాడు – చక్రములు
బడబడాదొర్లించినాడు!
బాణసంచా వెలితి లేదే – పెళ్లికీ
బహుబాగుగా జేసినారే
కళ్ళుచెదిరే మెరుపులమ్మా – చూడగా
వాళ్ళు పరవశమౌనుసుమ్మా!
కప్పమ్మ పెళ్లికోయంచూ – మేళములు
గొప్పగా తెప్పించినారే!
చెప్ప శక్యము కాదు వేరే – బోదురూ
కప్పలా మేళములురారె!
కప్పమ్మ గడప తొక్కినది – శుభమన్న
సూచనలు చూరు చెప్పినది!
కప్పలెగిరేవానలమ్మా – పొలములో
కనకాలెపండుతాయమ్మా!



## సారాంశం





నేడు కప్పలకు పెళ్లి జరుగుతోంది. (పూర్వం కప్పలకు పెళ్లి చేస్తే వర్షం పడుతుంది అని పెద్దల మాట) వరుణ దేవుడు కడవలతో నీళ్ళను ఒంపినట్లుగా ఉంది. ఊరు, వాడలు వర్షపు నీటితో నిండిపోయాయి.

స్వర్గాధిపతి ఇంద్రుడు రథమెక్కి ముందుకు సాగిపోతున్నాడు. ఆ రథం యొక్క వేగానికి రథచక్రాల నుండి పుట్టిన గాలి చెట్లను అటు ఇటు కదుపుతోంది. పెళ్లికి వచ్చిన బంధువులకు విసనకర్రలతో విసురుట పూర్వకాలపు ఆచారం. ఆ పనిని ఇంద్రుడు చెట్లతో చేయిస్తున్నట్లుంది.

ఇంద్రుని రథచక్రాలు బండరాళ్ళపై నుండి వేగంగా ముందుకు వెళుతున్నాయి. వాటినుండి పుట్టే శబ్దం పెళ్లికి మంగళవాయిద్యాలు (మేఘ గర్జనలు, ఉరుములు) వాయించినట్లుగా ఉంది. ఈ మంగళ వాద్యాలకు ఇంద్రుడు ఎలాంటి ధనం తీసుకోలేదు.

ఇంద్రుని రథచక్రాల వేగానికి, ఒత్తిడికి మెరుపులు పుట్టాయి. అవి చూడడానికి పెళ్లి సందర్భంలో కాల్చే బాణసంచావలే ఉన్నాయి. మనసును పరవశింప చేస్తున్నాయి.

మేఘాలు వర్షించాయి. అప్పటిదాకా ఎక్కడో ఉన్న బోదురు కప్పలు బెకబెక శబ్దాలు చేస్తున్నాయి. ఆ శబ్దాలు కప్పల పెళ్లికి వాయించే మంగళ వాద్యాల ధ్వని వలే ఉన్నాయి.

కప్పతల్లి మాయింటి ముంగిటకు వచ్చింది. ఇంటిచూరు నుండి వాన బొట్లుబొట్లుగా పడుతుంది. కురిసిన వర్షపు నీటిలో కప్పలు ఆనందంగా ఎగురుతూ నాట్యం చేస్తున్నాయి. ఇక పొలంలో బంగారం పండుతుందన్న నమ్మకం కలిగింది.

## ఇవి చేయండి

**ఉపాధ్యాయులు చెప్పిన కింది పదాలను (ఉక్తలేఖనం) రాయండి.**

కప్పతల్లి పెళ్లి – నీళ్ళు – వరుణదేవుడు – స్వర్గాధినాథుడు – బండరాళ్ళు – పరవశము – రథము – బాణసంచా – మేళములు – శక్యము

## అవగాహన - ప్రతిస్పందన

1. గేయాన్ని రాగయుక్తంగా పాడుతూ అభినయించండి.
2. వర్షం వచ్చే ముందు ఆకాశం ఎలా ఉంటుందో చెప్పండి?
3. మీరు చూసిన పెళ్లిలోని ఆచారాలను గురించి మీ సొంతమాటల్లో చెప్పండి.

**4. కింది గేయాన్ని చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.**

చేయి చేయి కలిపేద్దాం - ఇంకుడు గుంతలు తవ్వేద్దాం
వర్షపు నీటిని పట్టేద్దాం - భూగర్భ జలాలను పెంచేద్దాం
చెరువులన్నీ నింపేద్దాం - బంగరు పంటలు పండిద్దాం
మొక్కలెన్నో నాటేద్దాం - కరువు కాటకాలను తరిమేద్దాం
ప్రకృతిమాతను రక్షిద్దాం - హాయిగ మనము జీవిద్దాం.



**ప్రశ్నలు:**

1. భూగర్భ జలాలను ఎలా పెంచాలి?

   ........................................................................................................

2. కరువుకాటకాలు రాకుండా ఉండాలంటే ఏం చేయాలి?

   ........................................................................................................

3. మనం దేనిని రక్షించాలి?

   ........................................................................................................

4. ఈ కవిత ఆధారంగా ఒక ప్రశ్న తయారుచేయండి.

   ........................................................................................................



## వ్యక్తీకరణ - సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాల్లో జవాబులు రాయండి.**

1. ఇంద్రుని ప్రయాణంతో ప్రకృతిలో వచ్చిన మార్పులను కవయిత్రి ఎలా వర్ణించింది?
2. కప్పలపెళ్లికి, వానకు గల సంబంధమేమిటో మీ సొంత మాటల్లో రాయండి.
3. కప్పలపెళ్లి వెనక దాగిఉన్న గ్రామీణుల ఆలోచనను తెలియజేయండి.

**ఆ) కింది ప్రశ్నలకు ఎనిమిది నుండి పది వాక్యాల్లో జవాబులు రాయండి.**

1. కప్పతల్లి పెళ్లి గేయ సారాంశాన్ని సొంత మాటల్లో రాయండి.
2. ప్రజల నమ్మకాలపై ఆధారపడ్డ ఏదేని మీ ప్రాంత ఉత్సవం గురించి రాయండి.
3. కప్పతల్లి పెళ్లిలో ప్రకృతి పాత్రను కవయిత్రి ఎలా భావించిందో వివరించండి.



## భాషాంశాలు

**అ) కింది వాక్యాలను చదవండి. గీత గీసిన పదాలకు అర్థాలు రాసి వాటితో సొంత వాక్యాలు రాయండి.**



**ఉదా:** గగనతలము నుంచి నేడు గాలులు వీచాయి.

గగనతలం = ఆకాశ మార్గం

**వాక్యం:–** పక్షులు ఆకాశ మార్గంలో స్వేచ్ఛగా ఎగురుతాయి.

1. రాజు రథంపై పయనం అయ్యాడు.

   పయనం = ____________________

   ......................................................................................

2. మీకు శుభం కలుగుగాక.

   శుభం = ____________________

   ......................................................................................

3. మా పొలంలో కనక వర్షం కురిసింది

   కనకం = ____________________

   ......................................................................................

4. పల్లె ప్రజలు గాలికోసం వీవెనలతో విసురుకుంటారు.

   వీవెన = ____________________

   ......................................................................................

5. పండగకి వాడ వాడలా దేవుణ్ణి ఊరేగిస్తారు.

   వాడ = ____________________

   ......................................................................................

   ......................................................................................

**ఆ) కిందివాక్యాలలో సమానార్థక పదాలను(పర్యాయ పదాలు) గుర్తించి రాయండి.**

1. మంచివారి మాటలు వినాలి. వారి పలుకులు బంగారు తునకలు.

   ..........................................................................................

2. పొలంలో బంగారం పండింది. ఇల్లు కనకంతో నిండింది.

   ..........................................................................................

3. కప్పతల్లి పెళ్లి జరుగుతోంది. పెద్దలందరూ వివాహానికి వచ్చారు.

   ..........................................................................................

**ఇ) కింద ఇచ్చిన ప్రకృతి వికృతులను జతపరచండి.**

| | | | |
|---|---|---|---|
| 1. | ప్రయాణం | (    ) | అ) తలము |
| 2. | రథము | (    ) | ఆ) బత్తెము |
| 3. | స్థలము | (    ) | ఇ) పయనం |
| 4. | భత్యము | (    ) | ఈ) అరదము |



**ఈ) కింది పదాలను వ్యతిరేక పదాలతో జతపరచండి.**

| | | | |
|---|---|---|---|
| 1. | శక్యం | (    ) | అ) నేడు |
| 2. | శుభం | (    ) | ఆ) అశక్యం |
| 3. | నాడు | (    ) | ఇ) అశుభం |

**ఉ) కింది గళ్లలో పాఠంలోని పదాలను గుర్తించండి. వాటిని ఉపయోగించి సొంత వాక్యాలు రాయండి.**

| | | | | |
|---|---|---|---|---|
| బా | జా | లు | బ | బ |
| శ | శు | భం | హు | డ |
| క్య | క | పె | బా | బ |
| ము | ప్ప | ళ్ళి | గు | డా |

ఉదా: బాజాలు

ఉదా: మా అక్క పెళ్ళికి బాజాలు వాయించారు.

1. ______________________

2. ______________________

3. ______________________

4. ______________________

5. ______________________

6. ______________________



## వ్యాకరణాంశాలు

### ద్రుతము

**అ) కింది వాక్యాలను పరిశీలించండి.**

1. బాలచంద్రుడు అభిమన్యునివలెన్ పోరుసలిపెను.
2. ఆర్యా! మాయందున్ దయచూపుడు.
3. మీరు వచ్చినన్ సంతోషించెదను.
4. బాలుని కొట్టినన్ ఏడ్చును.
5. భూమి రాజు చేతన్ పాలించబడెను.

**పై వాక్యాలలోని గీతగీసిన పొల్లు హల్లు (న్) తొలగించి వాక్యాలను మళ్ళీ రాయండి.**

ఉదా: బాలచంద్రుడు అభిమన్యునివలె పోరుసలిపెను.

1. ......................................................

2. ......................................................

3. ......................................................

4. ......................................................

పై ఉదాహరణల్లో **'న్'** తొలగించినా అర్థంలో మార్పు రావడం లేదు. ఇటువంటి 'న'కారాన్ని **ద్రుతము** అంటారు. ఇది ప్రస్తుత వ్యవహారంలో లేదు. ప్రాచీన సాహిత్యంలోని పద్యాలలో ఎక్కువగా కనిపిస్తుంది.

## త్రికము

ఆ) కింది వాక్యాలను గమనించండి.



1. అతడు ఎచ్చోటనైనా జీవించగలడు.
2. ఇక్కడ వర్షం పడుతోంది.
3. ఎక్కడ ఉన్నా మన మాతృభూమిని మరవవద్దు.
4. అచ్చోటు నివాసయోగ్యము కాదు.
5. అక్కడ చలి ఎక్కువగా ఉంది.

గీతగీసిన పదాన్ని విడదీసి రాయండి.

ఉదా: ఎచ్చోటు - ఏ + చోటు

1. ఇక్కడ - ...................... + ......................
2. ఎక్కడ - ...................... + ......................
3. అక్కడ - ...................... + ......................
4. అచ్చోటు - ...................... + ......................

పై ఉదాహరణల్లో పదాలను విడదీసినప్పుడు పూర్వపదంగా ఆ, ఈ, ఏ అనే సర్వనామాలు వచ్చాయి. వీటినే 'త్రికములు' అంటారు.

## ఆమ్రేడితం

ఇ) కింది వాక్యాలను గమనించండి. గీతగీసిన పదాలను విడదీసి రాయండి.

1. రాష్ట్రంలో అక్కడక్కడ వర్షాలు పడుతున్నాయి.
2. మేము అప్పుడప్పుడు విహారయాత్రకు వెళ్తుంటాం.
3. విందు భోజనంలో ఏమేమి పదార్థాలు వడ్డించారు.
4. మా ఊరికి చిట్టచివర బడి ఉంది.
5. ఆ పట్టణం నట్టనడుమ కోనేరు ఉంది.

| | | | | |
|---|---|---|---|---|
| ఉదా : అప్పుడప్పుడు | = | అప్పుడు | + | అప్పుడు |
| అక్కడక్కడ | = | ________ | + | ________ |
| ఏమేమి | = | ________ | + | ________ |
| చిట్టచివర | = | ________ | + | ________ |
| నట్టనడుమ | = | ________ | + | ________ |
| పట్టపగలు | = | ________ | + | ________ |

పై పదాలను విడదీసినప్పుడు పూర్వపదం, పరపదం రెండింటిలోను ఒకేపదం కనిపిస్తుంది. ఇలా రెండూ ఒకేవిధమైన పదాలువస్తే అందులో రెండవపదాన్ని **ఆమ్రేడితం** అంటారు.

## పంచమీ విభక్తి

**ఈ) క్రింది వాక్యాలను పరిశీలించండి.**

1. వర్షాల వలన కాలువల్లో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది.
2. కృష్ణుడి వలన పాండవులు యుద్ధంలో విజయం సాధించారు.
3. కరువుకాటకాల వలన ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.
4. పల్లెటూరి కంటె పట్నంలో కాలుష్యం ఎక్కువ.
5. శ్రీనాథుని కంటె నన్నయ ముందువాడు.



పై వాక్యాల్లో 'వలన కంటె – పట్టి' అనే ప్రత్యయాలు వాక్యాన్ని అర్థవంతంగా మార్చాయి. ఇలాంటి ప్రత్యయాలు వస్తే దాన్ని **పంచమీ విభక్తి** అంటారు. అపాయం, భయం, పరాజయం, విరామం వంటి సందర్భాలను చెప్పేటప్పుడు పదాల చివర 'వలన' అనే ప్రత్యయం వస్తుంది. ఇతరము, పూర్వము, పరము, అన్యము మొదలైన అర్థాలు వచ్చినప్పుడు 'కంటె' అనే ప్రత్యయం వస్తుంది.

**ఉ) గేయంలోని ద్విత్వాక్షర, సంయుక్తాక్షర పదాలను గుర్తించి రాయండి.**

| ద్విత్వాక్షర పదాలు | సంయుక్తాక్షర పదాలు |
|---|---|
| 1. ________ | 1. ________ |
| 2. ________ | 2. ________ |
| 3. ________ | 3. ________ |
| 4. ________ | 4. ________ |
| 5. ________ | 5. ________ |

ఈ) కింది పదాలను విడదీయండి. సంధి పేర్లు రాయండి.

ఉదా: స్వర్గాధినాథుడు: స్వర్గ + అధినాథుడు = సవర్ణ దీర్ఘ సంధి

1. పరవశమౌను : ______ + ______ = ______

2. శుభమన్న : ______ + ______ = ______

3. మెరుపులమ్మ : ______ + ______ = ______

4. రథమెక్కి : ______ + ______ = ______

ఋ) కింది పదాలను కలిపి రాయండి.


ఉదా: కప్ప + అమ్మ = కప్పమ్మ

1. కప్పలు + ఎగిరే = ______

2. పండుతాయి + అమ్మ = ______

3. వాడలు + అన్నీ = ______

4. వానలు + అమ్మ = ______



ఎ) కింది వాక్యాలలో ప్రత్యయాల కింద గీత గీయండి. విభక్తులను రాయండి.

ఉదా: విద్యను అర్థించు వానిని విద్యార్థి అంటారు. ద్వితీయ విభక్తి

1. విద్యావంతుడు అందరిచే పూజించ బడతాడు. ______

2. విద్యార్థులు జ్ఞానం కొరకు యాత్ర చేశారు. ______

3. తల్లిదండ్రులు పిల్లలను ప్రాణము కంటే అధికంగా ప్రేమిస్తారు. ______

4. అమరావతిలోని శిల్పాలు చూడముచ్చటగా ఉన్నాయి. ______

5. మా పురము నందు జనులు సేవాగుణం కలిగినవారు. ______

6. ఓయీ! మునీశ్వరా! ఇటురమ్ము. ______



## ప్రాజెక్టుపని

అ) మీ ప్రాంతంలో జరిగే జాతరలకు సంబంధించిన వివరాలను సేకరించి ప్రదర్శించండి.



ఆ) కింది నినాదాలు చదవండి. ఇలాంటివి మీరూ తయారు చేయండి.

★ మనిషికొక మొక్క పెంచుదాం – జీవకోటికి ప్రాణదాతలవుదాం.

★ చెట్లు నరికితే దుర్భిక్షం – చెట్లు పెంచితే సుభిక్షం.



## చమత్కార పద్యం

మామిడేలపూచు మండు వేసంగిని!
బాలుడేల పోవు పసుల వెంట
రాజు సేన నేల రహిజేర్చు చుండును!
మూటనొక్క మాట ముద్దు కృష్ణ!

భావం: మామిడి చెట్టు వేసవిలోనే ఎందుకు పూతపూస్తుంది?
బాలుడు పశువులవెంట ఎందుకు పోతాడు?
రాజు సేనను ఎందుకు పెంచుతాడు?

(పైమూడు ప్రశ్నలకు ఒకే సమాధానం 'కాయ'.) మామిడి పూసేది కాయడానికే. బాలుడు పశువులవెంట పోవడం వాటిని కాయడానికే. సేన కూడా ప్రజలను కాయడానికి. అంటే కాపాడడానికే అని అర్థం.



## నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | గేయాన్ని రాగయుక్తంగా పాడగలను. | ఔను / కాదు |
| 2. | గేయాన్ని ధారాళంగా చదవగలను, అర్థం చేసుకుని సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 3. | పాఠంలోని పదజాలాన్ని వాక్యాలలో ఉపయోగించగలను. | ఔను / కాదు |
| 4. | వానను వర్ణించే పాటలను సేకరించగలను. | ఔను / కాదు |



## ఉపాధ్యాయులకు సూచనలు

చావలి బంగారమ్మ గారి రచనలను సేకరించి చదవండి.

## చదవండి - ఆనందించండి

# పాలిథిన్ భూతం - (పర్యావరణ స్పృహ)
# ఏకపాత్రాభినయం



గడగడలాడి పోవాలి! మొత్తం ఈ మానవజాతి నా పేరు వింటేనే హడలెత్తిపోవాలి. ఈ భూగోళాన్ని మొత్తం నేను ఆక్రమించాలి. ఇంతకీ నేను ఎవరో తెలుసా? మీకు తెలియదు కదా! నా పేరే పాలిథిన్. నేను మీతో స్నేహం చేస్తూనే వెనుక నుంచి మీ మీద విషాన్ని కక్కుతూ చాపకింద నీరులా విస్తరించి మొత్తం ఈ భూమిని నాసంచిలో వేసుకుపోతా.

మీ ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా దానికి సంబం ధించిన సామగ్రిని మోసుకొచ్చే సాధనంలా మీ ఇంటికివస్తా. కూరలు, పండ్లు, స్వీటు, పూలు, పాలు .... ఏది మీ ఇంటికి రావాలన్నా నేనే మీకు ఆధారం. చివరికి నేను లేనిదే మార్కెట్ లేదు. చూశారా! నా ప్రతాపం, చూశారా! నా ప్రభావం.

మీ సామానులను మోసుకుని మీ ఇంటికి వచ్చిన నన్ను చెత్తకుప్పలోకి విసురుతారు. కాలువలు, చెత్తకుప్పలే నా స్థావరాలు. అక్కడి నుంచి మానవ జాతిపై నా సమరభేరి మోగించి భూగోళాన్ని దడ దడ లాడిస్తాను. మీ జీవిత కాలం వందేళ్లు. కానీ నా జీవితకాలం కొన్ని వందల యేళ్లు.

చెత్తలో ఉన్నా, కాలువలో ఉన్నా, నేలపై ఉన్నా, నీటిలో ఉన్నా ఎక్కడున్నా 'నేను క్షేమం - మీకు క్షామం'. నేను ఎప్పటికీ భూమిలో కలవను. నాతోటి నేస్తాలైన దోమలు, ఈగలు పెరిగేందుకు చక్కని భవనంగా మారి దుర్గంధాన్ని వ్యాప్తిచేసే శిబిరంగా మారతాను. మలేరియా, ఫైలేరియా లాంటి రోగాలను మీపై దాడికి సిద్ధం చేస్తాను. భూమిపై నీటిని కిందకు ఇంకకుండా అడ్డుకుంటూ పచ్చని మొక్కలు బతికే వీలులేకుండా పచ్చదనాన్ని కబళిస్తాను. పర్యావరణాన్ని పాడుచేసే మానవజాతి మనుగడను ప్రశ్నార్థకం చేస్తాను.

మానవజాతిలో అజ్ఞానం, అవిద్య ఉన్నంత వరకు నా మనుగడకు ఆటంకం లేదు. ఈ మధ్య మీరు గుడ్డసంచులు, కాగితపుసంచులు, గోనెసంచులు ఇలాంటి అస్త్రాలను నాపై ఎక్కుపెడుతున్నారు. అయినప్పటికీ ప్రజల్లో అవగాహన లేనంతవరకూ నన్ను ఎవరూ ఏమీ చేయలేరు. నన్ను ప్రోత్సహించే కొందరు వ్యాపారులు ఉన్నారు, ఇది చాలు నేను భూమిని వశం చేసుకోవడానికి. ఈ భూగోళాన్ని, పర్యావరణాన్ని నాశనం చేయడమే నాకోరిక. విద్యార్థులూ! నన్ను ఆపగలరా? .....ప్రయత్నించండి...చూద్దాం..






# 8 ఎద

I2H8D6

## వినడం - ఆలోచించి మాట్లాడడం



1. చిత్రంలో ఏమేమి గమనించావు?
2. చిత్రంలోని వారు ఏం చేస్తున్నారు?
3. ప్రకృతితో సంబంధం కలిగి జీవనం సాగిస్తున్నవారి గురించి చెప్పండి?

**ఉద్దేశం:** గిరిజన ప్రాంతాలు ప్రశాంతతకూ, మంచితనానికీ, అమాయకత్వానికీ నిలయాలు. అలాంటి చోట నాగరికత పేరుతో పెనుమార్పులు జరుగుతున్నాయి. పర్యావరణం దెబ్బతింటోంది. గిరిజనుల జీవితాలు అతలాకుతలం అవుతున్నాయి. అయినప్పటికీ ఆశావాదంతో ముందుకు సాగుతున్న గిరిజనుల శ్రమ జీవనాన్ని చెప్పడం ఈ పాఠం ఉద్దేశం.

## కవి పరిచయం



### బోనం నాగభూషణం

**(01.07.1938 - 21.05.1999)**

బోనం నాగభూషణం విజయనగరం జిల్లా, మేరంగి గ్రామంలో జన్మించారు. ఉపాధ్యాయవృత్తిని స్వీకరించారు. రచనలను ప్రవృత్తిగా ఎంచుకున్నారు. వీరి తొలికథ చిత్రగుప్త పత్రికలో ముద్రితమైంది. శూలపాణి, భూషణం వీరి కలంపేర్లు. భూషణంకథలు, ఏదిసత్యం - ఏదసత్యం, కొండగాలి, అడవంటుకుంది వంటి రచనలు చేశారు. ప్రస్తుతపాఠం 'కొత్తగాలి' కథా సంకలనంలోనిది.

# ఎద

పోలమ్మకి నిద్ర రావడంలేదు. ఎంత రాత్రయిందో తెలియదు. కుదురు మీద దీపం వెలుగుతూనే ఉంది. ఆ వెలుతుర్లో తలదగ్గర పుస్తకాలు పడేసి తనపిల్లలిద్దరూ నిశ్చింతగా నిద్రపోవడం చూసింది.

పశువులు కాయడానికి తన ఈడు పిల్లల్తో వెళ్ళడమో–అమ్మతోనో అయ్య వెనకో కొండమీదకి వెళ్ళడంలోను పోలమ్మ బాల్యం అంతా అయిపోయింది.

బడికి వెళ్ళడం, పుస్తకాల్ని చదవడం తన మొత్తం బతుకులోనే తెలియదు.

అలాంటి పోలమ్మకి తన ఇద్దరిపిల్లలు బడిలోనే గాకుండా ఇంటిదగ్గర దీపం వెలిగించిన తరువాత చదవడం, నిద్రపోతున్నపుడు కూడా పుస్తకాల్ని వదలకుండా దగ్గరే ఉంచుకొని నిద్రపోవడం చూసి ఎంతో ఆనందం కలిగింది.


అయినా కంటికి కునుకు మాత్రం రావడంలేదు.

ఇంట్లోని ధాన్యం తీసుకొని వెళ్ళి మంటిలో కలిపేసింది. మళ్ళలో పచ్చని మొలక కనిపించడం లేదు.

మరేపని చేయడానికి వెళ్ళకుండా పొద్దున్నే లేవడం పొలం దగ్గరకు వెళ్ళడం మట్టిపెళ్ళల మధ్య జల్లిన ధాన్యం పక్షులు తినేయకుండా కాపలా కాయడం – వాన పడుతుందేమోనని కొండలకేసి చూడడం – ఇదే పనైపోయింది.

రోజూ కొండలమీద నుండి మేఘాలు రావడం అయితే వస్తున్నాయిగానీ – వర్షం పడ్డం లేదు.

పోలమ్మ రోజూ ఆశతో వాటిని చూస్తూనే ఉంది. గుంపుగా కమ్ముతున్న మేఘాల్ని చూసి ఆనందంగా – "ఇయాల వానోస్తాది. కుండలతో గుమ్మరించేస్తాది." అనుకోవడం–కమ్మిన మేఘాలు చుక్క నీటిని కూడా విదల్చక పోవడం–పోలమ్మ నిరాశతో ఇంటికి వెళ్ళడం మామూలైపోయింది.



ఇవాళ సాయంత్రం మళ్ళీ మేఘాలు కొండలమీదకు రోజూ లాగే వచ్చేయి. వచ్చిన మేఘాలు మెరవడం అయినా లేదు.

రోజు లాగే ఆశతో వాటిని చూసి పొలం నుండి తిరిగి వస్తున్న పోలమ్మకి దారిలో గోగుమొక్కలు తలలువంచి వాడిపోతూ కనిపించేయి !

వాటిని చూస్తుంటే కడుపు దేవేసినట్టనిపించింది.

"గంగతల్లి! ఇయాలైనా కరిగి నేలతల్లిని కలుస్తాదో - కలదో -?! ఎన్నాలిలా కలకుండా కదిలెలిపోతాది? ఎల్లలేదు" అనుకుంది.

అలా అనుకోవడం అయితే అనుకుంది, గానీ మనసుమాత్రం మనసులో లేదు. కొన్నాళ్లుగా వింటున్న మాటలు పదేపదే జ్ఞాపకం వస్తున్నాయి.

"అడవిలేదు. ఎవరిష్టం వచ్చినట్లు వాళ్ళు చేసేరు. వర్షాలు పడమంటే ఎలా పడతాయి? ఈ కాలం వస్తే వారం పది రోజులు వదలని ముసురు ఇంట్లోనుండి వీథిలోనికి అడుగు పెట్టడం కష్టం. అలాంటిది ఇలాగ మారిపోయింది. ఎవడిష్టం వచ్చినట్టు వాడుచేస్తే - వర్షం దాని ఇష్టానికి అది పడ్డం మానేసింది."

కొందరిలా మాటాడితే- ఇంకొందరు మరోలా మాటాడుతున్నారు - "కలికాలం దేవుడూ - దేవతా - అన్నమాటేలేదు. పాపం, భీతి అసలికి లేదు. మనుషులిలాగ మారిపోతే, కాలం అలాగమారిపోయింది!."

పోలమ్మ మనసులో పదేపదే పైమాటలు మెదిలి కలవర పెడుతుండగా వాడిపోయిన గోగుమొక్కలు కళ్ళముందు కదుల్తున్నాయి.

విత్తనాలుజల్లి ఇన్ని రోజులైపోయినా మొలకన్నది లేని మడిసెక్కల్లోని మట్టిపెళ్ళలే కనిపిస్తున్నాయి.

నీటికోసం కటకట !

సమస్త జీవరాశీ నీటికోసం తహతహ !!

పోలమ్మ చెదరిపోతున్న మనసును దిటవు చేసుకుంటూ "గంగతల్లి! తల్లి గంగమ్మ...!!

గోరంసేస్తాదా? సెయ్యదుగాక సెయ్యదు, అనుకొని కళ్ళు గట్టిగా మూసుకుంది.



ఎంతసేపైనా నిద్రరావడం లేదు. జ్ఞాపకాలు- అదేపనిగా వస్తున్నాయి. పోలమ్మకి తెలిసీతెలియని వయసులో కొండలంతటా పెద్దతగువే అయింది. ఇప్పుడు కొండల్లో రాళ్ళు కొట్టడానికి వినిపించిన శబ్దాల్లాంటివి అప్పుడు విన్నాది.

పశువులు మేతలకెళ్ళడం లేదు!

పంటల్లేవు!!

పెంచుకున్న కోడీ మేకా ఏమైపోయాయో తెలియదు!!

ఎక్కడి పనులక్కడే ఉండిపోయేయి. ఎక్కడ ఏది ఏమౌతుందో ఎవరికీ తెలియని స్థితి,

అంతటా భయం!

తగువు చల్లారిన తరువాత తల్లి తండ్రి చెబితే పోలమ్మకి అందు గురించిన విషయం కొంత తెలిసింది.

భూములు కొలిచేరు, భూమిలేని వాళ్ళకి పట్టాలిస్తున్నామని పిలిచేరు, వెళితే

ఇప్పుడు విత్తనాలు జల్లిన నేలనిచ్చేరు!

**ఎద**

**నారుమడి కట్టకుండా ధాన్యపు విత్తనాలను మట్టితో కలిపి పొలం మొత్తం ఒక కొలత ప్రకారం వెదజల్లి పండించే ఒక విధానం (ఉత్తరాంధ్ర ప్రాంతంలో)**

ఇలా భూమి వచ్చింది. అలా జబ్బులొచ్చేయి. వచ్చినజబ్బులు చాలామందిని తీసుకొనిపోయేయి. వాళ్ళతో పాటే పోలమ్మ తల్లీ తండ్రి వెళ్ళిపోయేరు.

దోమలవల్ల అలాంటి జబ్బు లొస్తున్నాయని చెప్పి మందులు జల్ల డానికి మనుషులొచ్చేరు. రోడ్లు వేయగా ఆఫీసులోచ్చేయి!! రకరకాల వాహనాలు తిరిగేయి, ఆఫీసులికి రాతలొచ్చేయి!! అలా రాయడానికి వచ్చినవాళ్ళలో ఒకడ్ని అప్పుడు పోలమ్మ ఇష్టపడింది.

ఇష్టపడి ఇద్దరుపిల్లలకి తల్లి అయింది. ఇప్పుడు అతడి పనుల్లో అతడు తిరుగుతూ రావాలనుకున్నప్పుడు వచ్చి వెళ్ళాలనుకున్నప్పుడు వెళ్ళిపోతూ ఉంటాడు.

పోలమ్మకి అమ్మా అయ్యా ఇచ్చిన రెక్కల కష్టం! కష్టపడి పనిచెయ్యడం తెలియడం చేతను ఆ వచ్చిన వాడి రాకపోకల్తో గానీ ఇచ్చిన దానికోసం చెయ్యిచాచడం గానీ లేకుండా బతుకు గడిచిపోతుంది.

వ్యవసాయం పనులపుడు కూలికి లోటుండదు. ఆ తరవాత కాలంలో రాళ్ళుకొట్టడం– రోడ్లువెయ్యడం– ఇళ్ళు కట్టుపని – మట్టిపని – ఏది జరిగినా కూలి దొరుకుతుంది. ఏ పనీ లేనిరోజుల్లో కొండకి వెళ్ళి కర్రలుతెస్తే రోజులు గడచిపోతున్నాయి.

బడులు పెట్టి పిల్లలకి తిండి, బట్టా ఇవ్వడంతో ఇద్దరుపిల్లలూ చదవగలుగుతున్నారు. తల్లి తండ్రి బాగుచేసి ఇచ్చిన మడిసెక్కలు – ఆ రెండు మడిసెక్కలే పోలమ్మకు ఏకైక ఆధారం. అందులో పండగా వచ్చిన గింజలతో అర్ధాంతరంగా వచ్చిన ఖర్చులు గట్టెక్కి పోతున్నాయి. ఆ మడిసెక్కలు అమ్మడంగానీ – అప్పుచెయ్యడం గానీ లేకుండా ఇంతవరకూ కాలం గడిచింది.

మరి ఈ ఏడాది?!

పోలమ్మ గతంలో నుండి వర్తమానంలోకి వచ్చి ఆలోచిస్తోంది. కూలిపనులకు వెళ్ళినపుడు కొండలన్నీ తిరిగి చూసింది. కొండల మీదనా – కొండ భూముల్లోనూ పంటలతో పాటు – మామిడి , జీడిమామిడి, జామ, కొబ్బరి, నిమ్మ, నారింజ తోటలు ఉన్నాయి. అవన్నీ కళ్ళముందు మెదలగా –

"ఇన్నిటిని ఇప్పుడుదాకా నేలతల్లి పెంచుకొస్తన్నాది. ఇప్పుడు పెంచలేనంటాదా ?! నా ఎదమళ్ళలో పంట పండనివ్వననేస్తాదా? అనదు! నేలతల్లి అలాగ అనదుగాక అనదు!" అన్న భరోసాతో కూడిన ఆలోచన రావడంతో కొంతసేపటికి ఆమెకి నిద్ర పట్టింది.



పోలమ్మ నిద్రలేచేసరికి పిల్లలిద్దరూ ఇంటిముందున్న నీళ్ళలో ఆటలాడుతున్నారు. వీధిలోనికి వచ్చి చూస్తే కళకళగా ఎవరిపనుల్లో వాళ్ళు ఉత్సాహంగా ఉన్నారు. తల్లిలేచి రావడం చూసిన పిల్లలిద్దరూ ఆట ఆపి

"వాన. అమ్మా.. రాత్రి వానపడిందమ్మా.. ఎంత నీరో?!" అని చెప్పి మళ్ళీ నీళ్ళలో ఆడుకుంటున్నారు.

నీటిని చూసిన పోలమ్మ పొలంవేపుగా పరుగులు తీసింది. ఎటుచూసినా నీరు! ఇంకిపోయిన నూతుల్లో నీరు, ఎండిపోయిన చెరువుల్లో నీరు, ఊరుచుట్టూ ఉన్న పల్లపుమళ్ళలో నీరు!!

నిన్న తలలు వాల్చిన గోగు మొక్కలు ఈనాటి ఉదయపు నీరెండలో తలెత్తి చిన్నగా ఊగుతున్నాయి. కొండల్ని చూస్తే ఉదయకాంతుల్లో పచ్చలు పరిచినట్టుగా కనిపిస్తున్నాయి. ఊటగెడ్డలో గలగలమంటున్న నీటిశబ్దం చెవులకి ఇంపుగా వినిపిస్తోంది. దాహంతో దహించిపోయిన పక్షుల ఆనందపు కేరింతల మధ్య పోలమ్మ తనపొలం చేరుకుంది.

పొలంలో పోసిన వరిధాన్యం పచ్చగా మొలకలెత్తిన మొనలు కనిపిస్తున్నాయి! అది చూసిన పోలమ్మ మనసు పట్టరాని ఆనందంతో పులకరించగా "గంగతల్లి గోరం సెయ్యలేదు. మట్టి తల్లికి మోసం తెలదు.

దరణి బూదేవత దగా సెయ్యదు. నా ఎదమళ్ళు ఎప్పుడు పండినట్టిగే పండుతాయి. నా ఎదపంట పండుతాది!

తప్పక పండుతాది!!" అనుకుంటూ సంతోషంతో పొలం చుట్టూ తిరిగింది.





## ఇవి చేయండి

**ఉపాధ్యాయులు చెప్పిన కింది పదాలను (ఉక్తలేఖనం) రాయండి.**

నిశ్చింత, మేఘాలు, సాయంత్రం, ప్రస్తుతం, అర్ధాంతరం, వర్తమానం



## అవగాహన - ప్రతిస్పందన

1. సకాలంలో వర్షాలు పడనపుడు రైతులు చూసే ఎదురుచూపులకు గల కారణాలను మీ మాటల్లో చెప్పండి.
2. పోలమ్మ వర్షం కోసం ఎందుకు ఎదురు చూస్తున్నదో మీ మాటల్లో చెప్పండి.
3. పోలమ్మకు నిద్ర పట్టకపోవడానికి గల కారణాన్ని సొంత మాటల్లో చెప్పండి.
4. కింది కరపత్రాన్ని చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.

**ప్రజలారా!**

ప్రకృతి దేవుడు మనకిచ్చిన వరం. ప్రకృతిలోని సమస్త జీవకోటిని కాపాడటం మన బాధ్యత. చెట్లు, నదులు, సమస్త జీవరాశి ప్రకృతిలో అంతర్భాగం. మనం నిర్లక్ష్యంగా చెట్లను నరుకుతూ పోవడం వలన పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. ప్లాస్టిక్‌ను విచక్షణారహితంగా వాడటం వలన భూమి కలుషితం అవుతుంది. చెత్తా,చెదారాలతో నదులను కలుషితం చెయ్యడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. అంతేకాకుండా జంతువులు, పక్షులు తమ ఉనికిని కోల్పోతాయి. కాబట్టి పర్యావరణ పరిరక్షణకు మనం నడుంబిగిద్దాం. ఇది మనందరి బాధ్యత.

**ఇట్లు**
**పర్యావరణ పరిరక్షణ సమితి, అమరావతి.**

అ) పర్యావరణ పరిరక్షణకు మనం ఏం చేయాలి?

..........................................................................................

ఆ) పర్యావరణ సమతుల్యత ఎందుకు దెబ్బతింటోంది?

..........................................................................................

ఇ) ఈ కరపత్రాన్ని ఎవరు ప్రచురించారు?

..........................................................................................

ఉ) కరపత్రం ఆధారంగా ఒక ప్రశ్న తయారు చేయండి.

..........................................................................................

## వ్యక్తీకరణ - సృజనాత్మకత




**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాల్లో జవాబులు రాయండి.**

1. కొండ భూముల్లో వరి పంటతో పాటు ఇంకేం పండుతున్నాయి?
2. పోలమ్మ నిద్రపోతున్న తన పిల్లలను చూసి ఎందుకు ఆనందపడింది?
3. వర్షం పడిన తరువాత పోలమ్మ పొలం వెళ్లే దారిలో ప్రకృతి ఎలా ఉంది?

**ఆ) కింది ప్రశ్నలకు ఎనిమిది నుంచి పది వాక్యాల్లో జవాబులు రాయండి.**

1. పోలమ్మ గతాన్ని తలచుకొన్నప్పుడు ఆమెకు గుర్తొచ్చిన అంశాలేవి?
2. మనకు అన్నం పెట్టే రైతు గొప్పతనాన్ని తెలుపుతూ మీ అభిప్రాయాన్ని రాయండి.

## భాషాంశాలు



**అ) కింది వాక్యాలను చదివి గీతగీసిన పదాలకు అర్థాన్ని రాయండి.**

ఉదా॥ అమ్మానాన్నలు తమ బిడ్డల్ని ఏ లోటు లేకుండా పెంచుతారు.
లోటు - లోపం

1. చిటపట చినుకులు నేలను తాకగానే మొలకలు పుట్టుకొస్తాయి.
   మొలక -
2. వర్షానికి తిరుమల ఘాటు రోడ్డులో మట్టిపెళ్ళలు జారి అడ్డుగాపడ్డాయి.
   మట్టిపెళ్ళలు -
3. పారిజాత పుష్పాలు కోసిన వెంటనే వాడిపోతాయి.
   వాడిపోవు -
4. కరోనా వ్యాప్తితో ప్రతి ఒక్కరు కలవరం చెందుతున్నారు.
   కలవరం -
5. కష్టసమయంలో గుండె దిటవు చేసుకొని జీవించాలి.
   దిటవు -

**ఆ) కింది వాక్యాలలో సమానార్థక పదాల కింద గీత గీయండి.**

ఉదా: చెట్లను నరకకూడదు. వృక్షాలు మనకు మేలు చేస్తాయి.

1. వర్షాలు పడి పంటలు పండాయి. వానలు కురిసి చెరువులు నిండాయి.
2. భూమాతను నమ్మినవారికి తల్లి ఆశీర్వాదం కూడా ఉంటుంది.

**ఇ) కింది ప్రకృతి - వికృతులను జతపరచండి.**



| | | | |
|---|---|---|---|
| 1. | నిద్ర | (     ) | అ) ఆస |
| 2. | దీపము | (     ) | ఆ) నిదుర |
| 3. | పుస్తకము | (     ) | ఇ) దివ్వె |
| 4. | పక్షి | (     ) | ఈ) పొత్తము |
| 5. | ఆశ | (     ) | ఉ) పక్కి |
| 6. | మూలిక | (     ) | ఊ) దిటవు |
| 7. | దృఢ | (     ) | ఋ) మొలక |

**ఈ) కింది పదాలతో సొంతవాక్య ప్రయోగం చేయండి.**

ఉదా:- గోదావరినది గలగల ప్రవహిస్తోంది.

తహతహ - కటకట - పదేపదే - కాపలాకాయు - తలలువంచు - కళ్ళముందు మెదలడం - చెదిరిపోవు - పరుగులుతీయు - కేరింతలు - మనసు దిటవుచేసుకొను

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

**ఉ) కింది వాటిలో నిత్య ఏకవచనాలను, నిత్యబహువచనాలను గుర్తించండి.**

వడ్లు, కందులు, అందరు, తెలుపు, మినుములు, పెసలు, ఇత్తడి, ఇనుము, కంచు

నిత్య ఏకవచనాలు : ఇనుము __________ __________ __________

నిత్య బహువచనాలు : కందులు __________ __________ __________

**ఊ) కింది వాక్యాలలో గీతగీసిన పదాలను గమనించండి. అలాంటివి మీరూ రాయండి.**

తల్లి గంగమ్మ ఇలాంటి గోరం సెయ్యదుగాక సెయ్యదు.

నేలతల్లి అలాగ అనదుగాక అనదు.

______________________________

______________________________

______________________________



## వ్యాకరణాంశాలు

### క్రియ

**అ) కింది వాక్యాలు చదవండి. గీతగీసిన పదాలను గమనించండి.**

1. నవ్య పాట పాడింది.
2. రాజు అన్నం తిన్నాడు.

గీతగీసిన పదాలను గమనిస్తే ఎవరెవరు ఏ ఏ పనులు చేశారో తెలుస్తున్నది. ఇలా ఒక వాక్యంలో పనిని తెలిపే పదానికి 'క్రియ' అని పేరు.



### సమాపక క్రియ - అసమాపక క్రియ

**ఆ) కింది వాక్యాలు చదవండి. గీతగీసిన పదాలను గమనించండి.**

1. ధర్మరాజు అన్నదానం చేశాడు.
2. భీముడు కీచకుని చంపాడు.

పై వాక్యాలను గమనించారు కదా! వాక్యం చివర ఉన్న క్రియ చెప్పదలచిన భావాన్ని పూర్తిచేస్తున్నది. కావున ఇది సమాపక క్రియ.



**ఇ) కింది వాక్యాలు చదవండి. గీతగీసిన పదాలను గమనించండి.**

1. శిబి చక్రవర్తి తన శరీరాన్ని కోసి,
2. కర్ణుడు కవచకుండలాలను దానమిచ్చి,

పై వాక్యాలను గమనించారు కదా! వాక్యం చివర ఉన్నక్రియ చెప్పదలచిన భావాన్ని పూర్తిచేయడం లేదు. కావున ఇది అసమాపక క్రియ.

### అత్వసంధి

L2F3P3

**ఈ) కింది వాక్యాలను గమనించండి.**

1. సీతక్క భరతమాతకు వందనం చేసింది.
2. రామయ్యకు చెట్లు అంటే ఇష్టం.
3. పాఠశాల సమయపాలనను వెంకప్ప పాటిస్తాడు.
4. రామ దూతయితడు.
5. అచ్యుతరావు మేనల్లుడు బాగా చదివి గొప్పవాడయ్యాడు.

పై ఉదాహరణలను గమనిస్తే పూర్వస్వరంగా 'అ' ఉంది. కావున ఇది అకార సంధి.

**ఉ) గీతగీసిన పదాలను విడదీయండి.**

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | సీతక్క | = | ______ | + | ______ |
| 2. | రామయ్య | = | ______ | + | ______ |
| 3. | వెంకప్ప | = | ______ | + | ______ |
| 4. | దూతయితడు | = | ______ | + | ______ |
| 5. | మేనల్లుడు | = | ______ | + | ______ |



## ప్రాజెక్టుపని

గ్రామీణ వాతావరణాన్ని సూచించే చిత్రపటాన్ని గీచి తరగతిగదిలో ప్రదర్శించి వివరించండి.



## చమత్కార పద్యం

శివుడద్రిని శయనించుట
రవిచంద్రులు మింటనుంట రాజీవాక్షుం
డవిరళముగ శేషునిపై
బవళించుట నల్లిబాధ పడలేక సుమీ!

**భావం:** నల్లి బాధ పడలేక శివుడు కొండపై, సూర్యచంద్రులు ఆకాశంలో, విష్ణువు ఆదిశేషునిపై నిద్రించారని చమత్కారం.



## నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | పాఠాన్ని ధారాళంగా చదవగలను, అర్థంచేసుకొని సొంతమాటల్లో చెప్పగలను. | ఔను/కాదు |
| 2. | పాఠంలోని పదబంధాలను వాక్యాలలో ఉపయోగించగలను. | ఔను/కాదు |
| 3. | పాఠంలోని ప్రశ్నలకు జవాబులు సొంతమాటల్లో రాయగలను. | ఔను/కాదు |
| 4. | రైతు గొప్పతనాన్ని గురించి నా అభిప్రాయాన్ని రాయగలను. | ఔను/కాదు |



## ఉపాధ్యాయులకు సూచనలు

1. భూషణం గారి కొత్తగాలి కథలను, ఇతర రచనలను పరిశీలించండి.
2. గిరిజనుల జీవన శైలి, పోడు వ్యవసాయ పద్ధతుల గురించి చదివి విద్యార్థులకు తెలియజేయండి.

చదవండి – ఆనందించండి


## నిరంతరం నేర్చుకో....

సోక్రటీస్ గ్రీకు దేశానికి చెందిన తత్వవేత్త. తన ఉపన్యాసాలతో యువకుల్ని నాశనం చేస్తున్నాడనే నెపంతో రాజు మరణశిక్ష విధించాడు. శిక్షలో భాగంగా తనకుతాను విషం తాగి మరణించవలసి ఉంది. ఆయన్ని జైల్లో పెట్టారు. పేరుకు జైల్లో పెట్టారే కానీ అందరూ వచ్చి చూసి వెళుతున్నారు. శిష్యులు మాత్రం అక్కడే ఉండి బాధ పడుతున్నారు. సోక్రటీస్ ఇవేమీ పట్టనట్లు నవ్వుతూ అందరినీ పలకరిస్తూ కబుర్లు చెబుతూ ఉండేవాడు. మరణించబోతున్నాననే భయంలేకుండా ఉన్న అతన్ని చూసి అందరూ ఆశ్చర్యపోతూ ఉండేవారు.

సోక్రటీస్ జీవితంలో చివరి రోజు రానే వచ్చింది. మరణశిక్ష అమలు కావడానికి ఇంకా రెండు గంటల సమయం ఉంది. అక్కడ శిష్యులతో పాటు అందరి ముఖాల్లో ఆందోళన దిగులు ఎక్కువయింది. సోక్రటీస్ ముఖంలో మాత్రం ప్రశాంతత, ఆనందం, వెలుగు కనిపిస్తున్నాయి.

సోక్రటీస్ కిటికీలో నుంచి బయటికి చూస్తూ కూర్చున్నాడు. బయట ఒక చెట్టు కింద బిచ్చగాడు కూర్చుని ఒక వాద్యం వాయిస్తూ పాటలు పాడుతున్నాడు. అది సోక్రటీస్ మనసును ఆకట్టుకుంది. ఆనందంతో కళ్ళు మూసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత మెల్లగా కళ్ళుతెరిచి జైలర్‌ని పిలిచాడు. జైలర్ గౌరవభావంతో దగ్గరికి వచ్చి ఏమి కావాలన్నాడు. సోక్రటీస్ కిటికీలో నుంచి చూపిస్తూ " మీకు అభ్యంతరం లేకుంటే ఆ బిచ్చగాడిని తీసుకువస్తారా" అని అడిగాడు. అలానే అంటూ జైలర్ వెళ్లి ఆ బిచ్చగాడిని తీసుకొచ్చాడు. సోక్రటీస్ బిచ్చగాడితో తనకు ఆ పాట నేర్పమన్నాడు. అతని దగ్గర నుంచి వాద్యం తీసుకున్నాడు. ఆ బిచ్చగాడు పాట పాడాడు. సోక్రటీస్ పాటపాడుతూ వాద్యం వాయించాడు. ఇలా అరగంట సాధన తర్వాత బిచ్చగాడి సాయం లేకుండానే సోక్రటీస్ ఆ పాట పాడాడు. అతనికి కృతజ్ఞతలు చెప్పి పంపించాడు.

ఇదంతా చూస్తున్న శిష్యులు, జైలర్ మరింతగా ఆశ్చర్యపోయారు. అప్పుడు శిష్యులు " గురువుగారు ఇక గంటలో విషపాత్ర మీ చేతికి వస్తుంది. మీరు ఈ లోకాన్ని వదిలిపెట్టి వెళ్ళిపోతున్నారు. కానీ ఆఖరిక్షణాల్లో మీరు ఆ వాద్యం మీద అభ్యాసంచేసి పాడటం నేర్చుకున్నారు. ఎందుకు? అని అడిగారు. సోక్రటీస్ నవ్వి "జీవితం అంటే నేర్చుకోవడం. మరణం గురించి ఆలోచించడం కాదు. నేను, నువ్వు ఇక్కడున్న అందరూ ఎప్పుడో ఒకప్పుడు చనిపోతాం. కానీ జీవించినంత కాలం ప్రతిక్షణం విలువైనదే. ఎప్పటికప్పుడు తెలియంది తెలుసుకోవడంలోనే ఆనందం ఉంది. గంట క్రితం నాకు ఆ పాట తెలీదు. ఇప్పుడు నేర్చుకున్నాను ఇంకా నా జీవితంలో గంట సమయం ఉంది. అంటే ఇప్పటికీ నేర్చుకోటానికి నాకు అవకాశం ఉంది" అన్నాడు. అక్కడున్న వారి నోట మాట రాలేదు.



# 9 హితోక్తులు

W9Z2F9


## వినడం - ఆలోచించి మాట్లాడడం



1. చిత్రాన్ని గమనిస్తే మీకు ఏమి అర్థమయ్యింది?
2. మీకు తెలిసిన మహనీయుల హితోక్తులు కొన్నింటిని చెప్పండి.

**ఉద్దేశం:** నైతిక విలువలతో కూడిన ప్రవర్తన విద్యార్థులకు మార్గదర్శకం. నేటి సమాజంలో బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దబడాలనే సంకల్పం. ఉన్నతమైన భావాలతో, ఆశయాలతో పాటూ నీతిని, న్యాయాన్ని, ధర్మాన్ని, సత్ప్రవర్తనతో ఆచరించడం కూడా తప్పనిసరి అని తెలియజేయడమే ఈ పాఠం ఉద్దేశం.

## కవి పరిచయం



### రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

(23.01.1893 - 11. 03.1979)

అనంతపురం జిల్లా కంబదూరు మండలంలోని రాళ్ళపల్లి గ్రామంలో అలివేలుమంగమ్మ కృష్ణమాచార్యులకు జన్మించారు. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ సంగీత సాహిత్యాలలో ప్రసిద్ధులు. 'సారస్వతాలోకము', అన్నమాచార్యుల కృతులస్వరకల్పన, వేమనపై విమర్శనా గ్రంథం వంటి రచనలు చేశారు. 'గానకళా సింధు' 'సంగీత కళారత్న' వీరి బిరుదులు. కేంద్ర సంగీత నాటక అకాడమీ 1970లో ఫెలోషిప్ ఇచ్చి గౌరవించింది. తెలుగు,కన్నడ,సంస్కృత భాషల్లో వీరు పండితులు. రాయలసీమ సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయే 'పెనుగొండకొండ' పాటను రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ రాశారు. ప్రస్తుత పాఠ్యభాగం 'శ్రీ శాలివాహన గాథా సప్తశతి సారం' నుంచి గ్రహించబడినది.

**నేపథ్యం :** 'కవివత్సలుడు' అనే బిరుదు పొందిన శాలివాహన చక్రవర్తి హాలుడు, ప్రాకృత భాషలోని ఏడువందల సుందర గాథలను ఏర్చి కూర్చి 'గాథా సప్తశతి' పేరిట సంకలనం చేశారు. రెండు వేల సంవత్సరాల నాటి తెలుగు గ్రామీణ జీవనదర్పణం 'గాథాసప్తశతి. మనిషి నైతికప్రవర్తనకు, మానవీయ విలువలకు ప్రాధాన్యత ఇవ్వవలసిన అవసరాన్ని ఈ పద్యాలు స్పష్టం చేస్తున్నాయి.

# హితోక్తులు

**మూలం : హాలుని గాథా సప్తశతి**

**అనువాదం : రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ**

1

❋ ఆ.వె. నీటిమీది వ్రాత నిజము దుర్జనమైత్రి,
చేయుచుండఁగనె నశించుచుండు
అదియె సజ్జనాళియందుఁజల్పితి మేని
రాతగీచినట్టి గీత గాదె?

2

ఆ.వె. లోభివాని చేతిలో సిరి యెంతగా
వెలయుచున్న సుంత ఫలములేదు
తెరువు నడుచు వేళఁగఱకు వేసవి యెండ
మాడు వానికిఁ దననీడవోలె

3

ఆ.వె. ఎంత యలుకగొన్న నేమి సత్పురుషుల
నోటనెట్లు చెడ్డమాట వెడలు
రాహువదన గహ్వరమున నున్నను జంద్రు
కరములమృతరసమె కురియుఁగాదె!

4

❋ ఆ.వె. మానవంతుఁడైన వాని మనం బంత్య
దశలఁగూడ నున్నతంబె యగును
మునిగిపోవు వేళలను సూర్యకిరణముల్
మీఁది ప్రక్కఁగాదె మెఱయుచుండు!

## సారాంశం

1. చెడ్డవారితో చేసే స్నేహం నీటిమీద రాత లాంటిది. అది అప్పుడే నశిస్తుంది. కానీ మంచివారితో చేసే స్నేహం రాతి మీద చెక్కిన రాత లాగే చిరకాలం వుంటుంది.
2. లోభి వానికి ఎంత సంపద వున్న కొంత కూడా ప్రయోజనం లేదు. ఎలాగంటే మండుటెండలో నడిచే వానికి తన నీడ వలన తనకు ప్రయోజనం ఉండదు కదా!
3. మంచివారికి ఎంత కోపం వచ్చినప్పటికీ వారి నోటి నుండి మంచి మాటలే వస్తాయి. కానీ వారి నోట నుండి చెడు మాటలు రావు. విషంతో నిండిన రాహువు నోటిలో చిక్కిన చంద్రుడు అమృతాన్నే కురిపిస్తాడు కానీ విషాన్ని చిందించడు కదా!
4. ఆత్మాభిమానం కలవారు చివరిదశలో కూడా ఉన్నతంగానే జీవిస్తారు. సూర్యుడు అస్తమించే సమయంలో కూడా వెలుగును ప్రసాదిస్తాడు కదా!

## ఇవి చేయండి

**ఉపాధ్యాయుడు చెప్పిన కింది పదాలను(ఉక్తలేఖనం) రాయండి.**

సత్పురుషులు, గహ్వరము, అమృతరసం, సజ్జనాళి, దుర్జనమైత్రి

## అవగాహన – ప్రతిస్పందన

1. దివ్యాంగుల పట్ల ఎలాంటి మానవత్వం చూపాలి?
2. 'పంచతంత్రకథలు' ఎలాంటి నీతిని బోధించాయి?
3. మీకు తెలిసిన గొప్ప శతకకవుల పేర్లు కొన్ని చెప్పండి.
4. కింది అపరిచిత పద్యాన్ని చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.

తే ॥

ఒక్క రోజీవు వీథుల నూడ్వకున్న
తెలిపోవును మా పట్టణాల సొగసు!
బయటపడునమ్మ! బాబుల బ్రతుకులెల్ల
ఒక క్షణమీ్మవు గంప క్రిందకును దింప.



అ. ఈ పద్యం ఎవరి గురించి చెబుతోంది?

ఆ. పట్టణాల అందానికి కారణం ఏంటి?

ఇ. పట్టణపు అందాన్ని చూసి గర్వపడేది ఎవరు?

ఈ. 'నిముషం' అనే అర్థాన్ని కలిగిన పదం ఏది?



## వ్యక్తీకరణ - సృజనాత్మకత

**అ) కింద ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గారి గురించి రాయండి?
2. మంచి వారితో స్నేహం ఎలాంటిది?
3. లోభితనం పనికిరాదని కవి ఎందుకు అన్నాడు?

**ఆ) కింది ప్రశ్నలకు 8 నుంచి 10 వాక్యాలలో జవాబులు రాయండి**

1. రాహువు నోటిలో చిక్కిన చంద్రుడు అమృతాన్ని కురిపిస్తాడని కవి ఎందుకు అభిప్రాయపడ్డాడు?
2. మనిషికి 'ఆత్మాభిమానం' ఎందుకు ఉండాలి?



## భాషాంశాలు

**అ) పాఠం ఆధారంగా అడిగిన పదాలకు ఎదురుగా అర్థాలను ఊహించి రాయండి.**

గహ్వరము, కిరణములు, సజ్జనుడు, స్నేహము, సంపద, చివరి, కొంచెం, దారి

| | | | |
|---|---|---|---|
| 1. | మైత్రి | = | స్నేహము |
| 2. | సిరి | = | ______________ |
| 3. | కరములు | = | ______________ |
| 4. | మంచివాడు | = | ______________ |
| 5. | సుంత | = | ______________ |
| 6. | తెరువు | = | ______________ |
| 7. | గుహ | = | ______________ |
| 8. | అంత్య | = | ______________ |

**ఆ) కింది పదాలకు పర్యాయపదాలు పదవిజ్ఞానంలో వెతికి రాయండి**

| | | | | |
|---|---|---|---|---|
| 1. | స్నేహము | = | నేస్తం | మైత్రి |
| 2. | మనిషి | = | ______________ | ______________ |
| 3. | పుడమి | = | ______________ | ______________ |
| 4. | సంపద | = | ______________ | ______________ |
| 5. | మూర్ఖుడు | = | ______________ | ______________ |
| 6. | ధనం | = | ______________ | ______________ |
| 7. | యధార్థం | = | ______________ | ______________ |

## వ్యాకరణాంశాలు

C5R4B4

**అ) కింది వాక్యాలను గమనించండి.**

1. రామలక్ష్మణులు రాక్షసులఁజూసిరి.
2. రాజు రోజూ బడికి రాఁగలడని అనుకుంటున్నాను.
3. అర్జునుడు కర్ణుని ప్రాణముఁదీసెను.
4. ప్రవరుడు పాదాలకు పసరుఁబూసుకొని హిమాలయాలకు వెళ్ళాడు.

**గీతగీసిన పదాలను విడదీయండి.**

**ఉదా:** రాక్షసులఁజూసిరి = రాక్షసులన్ + చూసిరి

1. రాఁగలడని = __________ + __________
2. ప్రాణముఁదీసెను = __________ + __________
3. పసరుఁబూసుకొని = __________ + __________

పై ఉదాహరణల్లో పూర్వపదం చివర **'న్'** అనే ద్రుతము ఉన్నది. పరపదంలో క-చ-ట-త-ప అనే పరుషాలు ఉన్నాయి. సంధి జరిగిన తరువాత క-గ, చ-జ,ట-డ,త-ద,ప-బ గా మారడాన్ని గమనించవచ్చు. ఇలా పరుషముల స్థానంలో సరళములు ఆదేశంగా వచ్చాయి. కావున ఇది సరళాదేశ సంధి అవుతుంది.

**ఆ) కింది పదాలను విడదీసి సంధి పేరు రాయండి.**

ఉదా : మనంబంత్య = మనంబు + అంత్య (ఉకార సంధి)

1. గీసినట్టె = .................. + ....................
2. గీతగాదె = .................. + ....................
3. సజ్జనాళి = .................. + ....................
4. సిరియెంతగా = .................. + ....................
5. వేసవియెండ = .................. + ....................

## షష్ఠీ విభక్తి

ఈ) కింది పట్టికను గమనించండి. జతపరచండి.

| | | | |
|---|---|---|---|
| 1. | సూర్యుని | | పుస్తకములు ఎక్కడ ఉన్నాయని అంబేద్కర్ అన్నాడు. |
| 2. | భీముని | | ఆజ్ఞను శిరసావహించాలి. |
| 3. | నా | యొక్క | కిరణాల వల్ల పద్మాలు విచ్చుకున్నాయి. |
| 4. | దశరథుని | | కాంతికి కలువలు వికసించాయి. |
| 5. | రాజు | | భుజ బలము గొప్పది. |
| 6. | చంద్రుని | | కుమారులు నలుగురు. |

పై పట్టికలోని పదాలను ఉపయోగించి వాక్యాలు తయారు చేయండి.

ఉదా – సూర్యుని యొక్క కాంతికి పద్మాలు విచ్చుకున్నాయి.

1. ______________________
2. ______________________
3. ______________________
4. ______________________
5. ______________________



పై వాక్యాల్లో పదాల మధ్యన చేరిన ' యొక్క' అనే ప్రత్యయం వాక్యాలను అర్థవంతంగా మార్చింది. ఇలా వాక్యంలో పదాల మధ్య చేరే కిన్– కున్– యొక్క– లోన్– లోపలన్ అనే ప్రత్యయాలను షష్ఠీ విభక్తి అంటారు. వాక్యంలోని పదాల మధ్య సంబంధాన్ని తెలిపేటప్పుడు ' యొక్క ', జాతి, గుణాల గురించి తెలిపేటప్పుడు 'లో'–లోపల', క్రియతో సంబంధాన్ని కలుగ చేసేటప్పుడు ' కి' ప్రత్యయాలను ఉపయోగించాలి.

ఉ) కింది సమాస పదాలకు విగ్రహ వాక్యాలు రాయండి.

ఉదా – మానవ మానసము = మానవునియొక్క మానసము

1. సజ్జనాళి = --------
2. రాహు వదనము = --------
3. సూర్య కిరణాలు = --------



## ప్రాజెక్టుపని

1. రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారి రచనలు సేకరించండి.పరిశీలించండి.
2. తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధి చెందిన కవుల చిత్రాలు సేకరించండి. వాటిని తరగతిలో ప్రదర్శించండి.



## సుభాషితం

తే. గీ వెలది మాతా పితృ పరాయణులకు స్వర్గ
లోక గోలోకములు బ్రహ్మలోక మైన
గృ(ప్చ)ములు గావు సూవె తర్పితుల వెంట
దల్లిదండ్రుల వెంట సాధ్యము త్రిలోకి.

తాత్పర్యం : సీతా ! తల్లిదండ్రుల్ని సేవించే బిడ్డలకు స్వర్గలోకం, గోలోకం, బ్రహ్మలోకం కూడా అందలేదనే బాధ ఉండదు. తల్లిదండ్రులను సేవించడం తోటే త్రిలోకాలు సాధ్యమవుతాయి.



## నేనివి చేయగలనా?

1. పద్యాలను విని సొంపుగా పాడగలను. ఔను / కాదు
2. పద్యాలను స్పష్టమైన ఉచ్చారణతో చదవగలను. ఔను / కాదు
3. నేర్చుకున్న భాషాంశాలను సొంతమాటల్లో రాయగలను. ఔను / కాదు
4. నేను విన్న హితోక్తులను ఆచరించగలను. ఔను / కాదు



## ఉపాధ్యాయులకు సూచనలు

1. రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ స్వర పరచిన అన్నమయ్య సంకీర్తనలను సేకరించండి.
2. రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ రాసిన వ్యాసాలు సేకరించండి.

చదవండి - ఆనందించండి

# సంకల్ప బలం

టిట్టిభము అనేది ఒక చిన్న పక్షి. దానిని లకుముకి పిట్ట అని కూడా అంటారు. ఈ ఆడపక్షి ఒకసారి సముద్రం ఒడ్డున గుడ్లు పెట్టి మేత కోసం వెళ్ళింది. అది తిరిగి వచ్చి చూసే సరికి దాని గుడ్లు అక్కడ కనిపించలేదు. సముద్రపు కెరటాలు ఆ గుడ్లను సముద్రంలోకి ఈడ్చుకుని పోయాయి.

గుడ్లు కనిపించకపోవడంతో ఆ పక్షి చాలా బాధపడింది. 'అయ్యో! నా బిడ్డలను ఈ పాడు సముద్రం అపహరించుకుని పోయిందే' అని తలుచుకుంటూ ఆ చిన్న పక్షి రోదించింది. ఏడుపు ఆపి ఆలోచించింది. పక్షి మనసులో ఒక ఆలోచన మెరుపులాగా మెరిసింది. వెంటనే కార్యాచరణకు దిగింది. సముద్రపు ఒడ్డుకు పోయి తన ముక్కుతో ఒక సముద్రపు నీటి బొట్టును పీల్చి దూరంగా ఎగిరిపోయి ఒకచోట ఉమ్మివేసేది. మళ్లీ సముద్రం వద్దకు వచ్చి ఇంకొక బొట్టును పీల్చి దూరంగా పోయి ఉమ్మివేయసాగింది.



ఈ విధంగా అది విశ్రాంతి లేకుండా ఆ నీటిని ఊమ్మివేసే పనిలో నిమగ్నమయ్యింది. ఆ సముద్ర జలాన్నంతా పీల్చివేస్తే తన గుడ్లు బయటపడతాయనుకుంటుంది. టిట్టిభపక్షి చేస్తున్న పనిని తోటి పక్షులు హేళన చేసాయి. సముద్రాన్ని తోడివేయడం నీ వల్ల అవుతుందా? అని ఎగతాళిగా మాట్లాడాయి. మరికొన్ని దాని కష్టం చూడలేక దానికి సాయం చేసాయి. మొత్తానికి టిట్టిభపక్షులన్నీ కలిసి సముద్రంలోని నీటిని పీల్చడం.. బయట వదలి వేయడం. ఆ పక్షులన్నీ కలిసి రోజుల తరబడి చేస్తున్న ఈ పనిని చూసి చలించిపోయిన సముద్రుడు విషయం ఏమిటని వాటిని అడిగాడు.

తన గుడ్లని సముద్రంలోకి కెరటాలు ఈడ్చుకునిపోయిన విషయాన్ని టిట్టిభపక్షి సముద్రుడితో మొర పెట్టుకుంది. ఆ పక్షుల పట్టుదల, సంకల్పాన్ని, సంతానం పట్ల ప్రేమను చూసి సముద్రుని మనస్సు కరిగిపోయింది. తన గర్భంలోకి జారిపోయిన గుడ్లను వెతికి తెచ్చి టిట్టిభపక్షికి అప్పగించాడు. పని చిన్నదా? పెద్దదా? అవుతుందా? కాదా? అనేది కాదు.. ముందు ఆ పని పట్ల మనం చూపే చిత్తశుద్ధి, పట్టుదల ఎలా ఉండాలనే సంకల్పాన్నీ, తల్లికి బిడ్డల పట్ల ఉండే వాత్సల్యాన్నీ ఈ చిన్నికథ మనకు అందిస్తోంది.

# 10 ప్రియమిత్రునికి...

B6I9G4

## వినడం - ఆలోచించి మాట్లాడడం







1. చిత్రం ఏ విషయాన్ని తెలియజేస్తుంది?
2. లేఖల బదులుగా ప్రస్తుతం ఉపయోగిస్తున్న సాధనాలు ఏవి?
3. మీ మిత్రులకు, బంధువులకు ఏ ఏ సందర్భాల్లో లేఖలు రాస్తారు?

**ఉద్దేశం:** వ్యక్తులు, సంస్థలమధ్య సమాచారాన్ని పరస్పరం పంచుకోవడానికి ఉపయోగించే సాధనాలు లేఖలు. వీటి ద్వారా వ్యక్తులపరిచయాలు, సంబంధాలు, అభిప్రాయాలు, సమకాలీన సమాజజీవనం వంటివి తెలుస్తాయి. ప్రముఖులురాసిన లేఖలలో సాహిత్యవిలువలు ఉంటాయి. అలాంటి లక్షణాలు కలిగిన ఒక లేఖను ఉదాహరణగా పరిచయం చేయడమే ఈ పాఠం ఉద్దేశం.

### కవి పరిచయం



## డాక్టర్ సూర్యదేవర సంజీవదేవ్

**(03.07.1914 - 25.08.1999)**

సూర్యదేవర సంజీవదేవ్ గుంటూరుజిల్లా మంగళగిరి-తెనాలి మధ్యలో ఉన్న తుమ్మపూడిలో జన్మించారు. వీరు కవి, రచయిత, తత్త్వవేత్త, చిత్రకారుడు. 'తెగిన జ్ఞాపకాలు', 'రసరేఖ', 'దీప్తిధార', 'కాంతిమయి', 'రూపారూపాలు' వంటి రచనలు చేశారు. పద్నాలుగు భాషలు చదవగలరు, రాయగలరు. ప్రస్తుత పాఠ్యభాగం 'లేఖల్లో సంజీవదేవ్' రచనలోనిది.

## ప్రియమిత్రునికి...

తుమ్మపూడి,

25-11-64.

ప్రియమిత్రులు శ్రీ నారాయణరాజు గారికి,



నమస్సులు, మీరు అత్యంత అనురాగంతో రాసిన ఉత్తరం చదువుకొని మీ సోదరి సులోచనా నేనూ కూడా అమితంగా సంతోషించితిమి. ఆమె మీకు మాఅక్క గారికీ తన నమస్కారములు తెలపమంటూన్నది. నేను కూడ. మీరు మీ సోదరిని చూచితిరి కాని నేను మా సోదరినింకనూ చూడలేదు.

అవునండీ ఆ రాత్రి మీ రాక మీకెంత ఆనందం కలిగించినదో, నాకంతకంటే మించిన ఆనందం కలిగించింది. మనమంతా ఏనాడో, ఎంతో సుదూరపు దిగంతాలలో, ఏదో అస్పష్టమైన స్వప్నలోకంలో ఇదివరకే కలుసుకున్నట్లు అనుభూతిచెందాను నేను.



మైత్రి, ప్రేమ, నిస్వార్థతవున్న మానవులంతా ఎంత దూరానవున్నా కూడా చాలా దగ్గరిలోనివారే. వారు ఏ వయసు వారైనప్పటికీ ఒకే వయసువారు. వారు ఏ వర్ణానికి చెందినా ఒకే వర్ణమువారు. వారు ఏ దేశానికి చెందినా ఒకే దేశానికి చెందినవారు. కులతత్వాలూ, జాతిభేదాలకు మనమంతా దూరం.



ఆ రాత్రి మనింటివద్ద మిమ్ము ఆపాలనిచూచి మీ కార్యక్రమంవిని మిమ్ము వెళ్ళనిచ్చితిమి.

మానవుని ఆత్మకు మానవుని మనసు ప్రతిబింబం. మానవుని మనసుకు మానవుని ముఖాకృతి ప్రతిబింబం. అందుకనే సామాన్యంగా ముఖం చూడగానే అంతరాత్మ తేజం తెలిసిపోతుంది.


ఎక్కువ మంది మానవులలో సుఖాలకంటే బాధలే ఎక్కువ. మానవుని బాధలనుండి, శోకాలనుండి, దిగుళ్ళూ, చింతలనుండి తప్పించి ఆనందం వైపు మరలించటానికే అనేకమైన లలితకళలు, సాహిత్యం, సంగీతం, నృత్యం, శిల్పం, చిత్రలేఖనం మొదలైనవి. ఏ కళ మానవుని బాధను తాత్కాలికంగానైనా తొలగించి ఆనందాన్ని ప్రసాదించజాలదో ఆ కళ కల మాత్రమే అవుతుంది.


మానవుడు ఆనందజీవి. ఆనందం లేకపోయిన తరువాత ఎంత సంపదవున్నా, విద్యవున్నా, కీర్తివున్నా అవన్నీ ఎండమావులే.

నాజీవితంలో సంకల్పించుకొన్న కార్యాలలో ఇంతవరకు నెరవేర్చిన వాటికంటే నెరవేర్చవలసినవే భవిష్యత్తులో ఎక్కువగా ఉన్నవి. సకాలంలో అవి అన్నీ కాకపోయినా కొన్ని అయినా సఫలం కాగలవని ఆశిస్తాను. సఫలం కాకపోయినా కూడా నిరుత్సాహపడను, నిరాశచెందను, విచారించను. కార్యాచరణ మాత్రమే ప్రధానం కాని సఫలతలూ, విఫలతలూ సమానమే.


మీ

**సంజీవదేవ్.**





## పరిశీలించండి



DR SANJIVA DEV D LITT

TUMMAPUDI
GUNTUR DT
522 330

21.11.89

సూచన: పై లేఖను పరిశీలించండి. లేఖల ఆవశ్యకతను గురించి చర్చించండి.

## ఇవి చేయండి

**ఉపాధ్యాయులు చెప్పిన కింది పదాలను (ఉక్తలేఖనం) రాయండి.**

దిగంతాలు, స్వప్నలోకం, మైత్రి, కులతత్వాలు, నిస్వార్థత, ముఖాకృతి, చిత్రలేఖనం, నృత్యం.

## అవగాహన - ప్రతిస్పందన



1. డబ్బు ముఖ్యమా? ఆనందం ముఖ్యమా? మీ అభిప్రాయం చెప్పండి.
2. స్నేహం యొక్క గొప్పతనం గురించి మీ మాటల్లో చెప్పండి.
3. నిరాశ వలన కలిగే నష్టాలను గురించి తెలపండి.

**4. కింది గద్యం చదివి ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

గార్గి మహాపండితురాలే కాక బ్రహ్మజ్ఞానం గల మహావిజ్ఞాని. ఆనాటి మహర్షులలో అగ్రేసరుడు, బ్రహ్మజ్ఞాని అయిన యజ్ఞవల్క్యునితో పలుమార్లు వాద ప్రతివాదాలు చేసిన మహాపండితురాలు. పురుషులతో పాటు ఉపనయనం చేసుకుని యజ్ఞోపవీతాన్ని (జంధ్యం) ధరించి శాస్త్రచర్చలు చేసిన విదుషీమణి. ఈమె జనకమహారాజు ఆస్థాన పండితురాలు. పురుషులతో పాటు స్త్రీలకు సమాన ప్రతిపత్తే కాకుండా ఏ విషయంలోనూ స్త్రీలు పురుషులకు తీసిపోరని చాటిన మహిళ గార్గి.

అ) మహర్షులలో అగ్రేసరులు ఎవరు?

.......................................................................................................

ఆ) బ్రహ్మ జ్ఞానం గల మహావిజ్ఞాని ఎవరు?

.......................................................................................................

ఇ) యజ్ఞోపవీతం అనే పదానికి అర్థం ఏమిటి ?

.......................................................................................................

ఈ) గార్గి ఎవరి ఆస్థాన పండితురాలు ?

.......................................................................................................

## వ్యక్తీకరణ - సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. లలిత కళలు ఎన్ని ? అవి ఏవి ?
2. ముఖం చూడగానే మానవుని అంతరాత్మ ఎలా తెలుస్తుంది ?
3. మానవులంతా ఒక్కటే అనే భావాన్ని సంజీవదేవ్ ఎలా వివరించారు?

**ఆ) కింది ప్రశ్నలకు 8 నుంచి 10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. రచయిత లేఖలో పేర్కొన్న అంశాలను మీ సొంతమాటల్లో రాయండి ?
2. లలితకళల్లో నీకు నచ్చిన అంశం గురించి రాయండి ?
3. ఏదైనా ఒక పండుగ / దర్శనీయ స్థలం గురించి మిత్రునికి లేఖ రాయండి.



## భాషాంశాలు

**అ) కింద గీతగీసిన పదానికి అర్థాలు రాయండి. వాటితో సొంతవాక్యాలు రాయండి.**

ఉదా : మైత్రి ఉన్న వ్యక్తి ఎంతదూరంలో ఉన్నా దగ్గర ఉన్నట్లే లెక్క.

మైత్రి = స్నేహం

ప్రతి విద్యార్థి తోటి విద్యార్థులతో స్నేహంగా ఉండాలి.



1. కళ మానవుని బాధను తాత్కాలికంగా తొలగిస్తుంది.

   ..........................................................................................

2. సులోచనా నేను కూడా అమితంగా సంతోషించాము.

   ..........................................................................................

3. ముఖం చూడగానే అంతరాత్మ తేజం తెలిసిపోతుంది.

   ..........................................................................................

4. నేను జీవితంలో సంకల్పించుకున్న కార్యాలు ఎక్కువగా ఉన్నాయి.

   ..........................................................................................

5. సఫలం కాకపోయినా కూడా నిరుత్సాహపడను.

   ..........................................................................................

**ఆ) కింది వాక్యాలలో సమానార్థక పదాలను (పర్యాయపదాలు) గుర్తించి రాయండి.**

1. పూర్వకాలంలో ఉత్తరాలు రాసేవారు. లేఖలు సమాచారం చేరవేయడానికి ఉపయోగిస్తారు. జాబురాసే అలవాటును అందరూ నేర్చుకోవాలి.

   ..........................................................................................

2. శోకంతో మనసు వికలమవుతుంది. బాధ కలిగినపుడు ఏడుపు వస్తుంది.

   ..........................................................................................

3. సమాజంలో మంచి సేవచేసిన వారికి కీర్తి కలుగుతుంది. అలాంటి వారికి పేరు ప్రఖ్యాతులు వస్తాయి.

   ..........................................................................................

ఇ) కింది ప్రకృతి – వికృతులను జతపరచండి.

| | | |
|---|---|---|
| 1. కథ | (    ) | అ. కర్జము |
| 2. ముఖము | (    ) | ఆ. విద్దె |
| 3. కీర్తి | (    ) | ఇ. కత |
| 4. విద్య | (    ) | ఈ. మొగము |
| 5. కార్యము | (    ) | ఉ. సిరి |
| 6. శ్రీ | (    ) | ఊ. కీరితి |





ఈ) కింద ఇచ్చిన పదాలకు వ్యతిరేక పదాలను జతపరచండి.

| | | |
|---|---|---|
| 1. సుఖం | (    ) | అ. అస్పష్టమైన |
| 2. సఫలం | (    ) | ఆ. శాశ్వతం |
| 3. నిస్వార్థం | (    ) | ఇ. దుఃఖం |
| 4. స్పష్టమైన | (    ) | ఈ. విఫలం |
| 5. తాత్కాలికం | (    ) | ఉ. స్వార్థం |



ఉ) కింది పదాలకు సొంతవాక్య ప్రయోగం చేయండి.

ఉదా: మా ఊరి గుడిలోని ఉత్సవాలు తాత్కాలికంగా వాయిదా వేశారు.

అమితంగా, అనురాగం, సఫలం, విఫలం, ప్రతిబింబం, ఎండమావులు, ఆనందం, నిస్వార్థం, చింత, కల

ఊ) కింది వరుసలో సంబంధంలేని పదాన్ని గుర్తించి సున్నా "◯" చుట్టండి. వృత్తంలోని పదాన్ని ఉపయోగించుకొని వాక్యాలు రాయండి.

1. వీణ, మద్దెల, ఫిడేలు, తంబూర

.....................................................................................................

2. దుఃఖం, బాధ, ఉత్సాహం, ఏడుపు

.....................................................................................................

3. నాట్యం, చిత్రలేఖనం, సంగీతం, కబడ్డీ

.....................................................................................................

4. కవిత, చరిత్ర, పాట, పద్యం

.....................................................................................................

ఋ) కింద ఇచ్చిన పదపట్టికను గమనించండి. వాటిలో పొడుపుకథలకు సంబంధించిన పదాలు ఉన్నాయి. వాటి ఆధారంగా కింద ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

| | | | |
|---|---|---|---|
| దం | తా | లు | స్త్రీ |
| లి | గ | ర | తి |
| న | త్త | య | లి |
| ళ్ళు | ల | కా | మ |
| క | వ | టెం | నె |



1. అక్కాచెల్లెళ్లు ఏడుస్తారు. అయితే దగ్గర చేరలేరు. ____________
2. అరవైకన్నుల పులి వచ్చి ఏటిలో నీళ్ళు తాగు. ____________
3. మూత తెరిస్తే ముత్యాల పేరు. ____________
4. ఉరుములు మెరుపులు లేకుండా ఉత్తరాది చెఱువునిండే. ____________
5. మా తాత రెండుబొమ్మలు తెస్తే ఒక బొమ్మ ఆడుతుంది. ఒకటి ఆడదు. ____________
6. ఇల్లు, వాకిలితో కదులుతూ ఉంటుంది. వెళ్ళి చూడబోతే తలుపు మూసుకుంటుంది.____________
7. ఎన్ని కళ్ళు ఉన్నా రెండుకళ్ళతో చూసేది. ____________
8. ఒకటే అక్షరం, అదే లేకపోతే ఈ ప్రపంచంలో మనుష్యులే ఉండరు. ____________



## వ్యాకరణాంశాలు

### వాక్యం

అ) కింది వాక్యాలను చదవండి.



1. సుమేధ పాఠాన్ని చదువుతున్నది.
2. సాహిత్య పూలు కోస్తున్నది.
3. అరుణ వంటచేసింది.

4. సృజన నాట్యంచేసింది.

5. బాలకృష్ణ దినపత్రిక చదువుతున్నాడు.



**పై వాక్యాలలోని కర్త – కర్మ – క్రియలను గుర్తించండి.**

| | కర్త | కర్మ | క్రియ |
|---|---|---|---|
| | సుమేధ | పాఠం | చదువుతున్నది. |
| 1. | | | |
| 2. | | | |
| 3. | | | |
| 4. | | | |

పై ఉదాహరణల్లో కర్త – కర్మ– క్రియ ఉన్నాయి. అవి సంపూర్ణమైన అర్థాన్ని ఇస్తున్నాయి. అలా ఇస్తే దానిని వాక్యం అంటారు.

## యడాగమసంధి

**ఆ) కింది వాక్యాలు చదవండి.**



1. వేసవియెండ తాపాన్ని కలిగిస్తుంది.
2. రవి స్నేహితుడు పుస్తకాలు ఇంటికి వచ్చియిచ్చాడు.
3. మాయమ్మ నాకు అన్నం పెట్టింది.
4. మాయయ్య నిన్న విజయవాడకు వెళ్లాడు.
5. మాయిల్లు మమతల పొదరిల్లు.

E6G4S1

**ఇ) గీత గీసిన పదాలను విడదీయండి.**

ఉదా : వేసవియెండ = వేసవి + ఎండ

1. వచ్చియిచ్చాడు = ____________ + ____________
2. మాయమ్మ = ____________ + ____________
3. మాయయ్య = ____________ + ____________
4. మాయిల్లు = ____________ + ____________

పై ఉదాహరణలో పూర్వ స్వరంగా 'అ' వుంది. పరస్వరం గా 'ఏ' ఉంది. సంధి జరిగే అవకాశం లేదు. అందుచేత పరస్వరానికి ముందుగా 'య్' ఆగమంగా వచ్చింది. కనుక ఇది 'యడాగమ' సంధి.

**ఈ) కింది పదాల మధ్య 'య' కారం చేర్చి రాయండి.**

1. మంచి + అదను = ..................................................
2. పది + ఆరువేల = ..................................................
3. పాడి + ఆవు = ..................................................
4. ఏలి + ఉన్న = ..................................................
5. నా + అనుభవం = ..................................................



## ప్రాజెక్టుపని



గొప్ప వ్యక్తులు రాసిన లేఖలను సేకరించి, తరగతిగదిలో ప్రదర్శించండి.



## సుభాషితం

| | |
|---|---|
| పర హితము సేయు నెవ్వడు<br>పరమ హితుండగును భూత పంచకమునకుం<br>బర హితమె పరమధర్మము<br>పర హితునకు నెదురు లేదు పర్వేందుముఖీ! | **భావం**<br>ఓ పార్వతీ! ఎవరు ఇతరులకు సహాయం చేస్తారో వారు ప్రకృతికి ఇష్టమైన స్నేహితులవుతారు. ఇతరులకు సహాయం చేయడానికి మించిన ధర్మం లేదు. అలా సహాయం చేసేవారు లోకంలో కీర్తిమంతులౌతారు. |



## నేనివి చేయగలనా?

| | |
|---|---|
| 1. కళల గురించి చర్చించగలను. | ఔను / కాదు |
| 2. పాఠంలోని పదాలకు అర్థాలను, పర్యాయపదాలను గుర్తించి రాయగలను. | ఔను / కాదు |
| 3. లేఖలను చదవగలను. సొంతమాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 4. నేను చూసిన ఒక దర్శనీయ ప్రాంతం గురించి మిత్రునికి లేఖ రాయండి. | ఔను / కాదు |



## ఉపాధ్యాయులకు సూచనలు


1. సంజీవదేవ్ రాసిన 'సంజీవదేవ్ లేఖలు', 'లేఖల్లో సంజీవదేవ్' రచనలను పరిశీలించండి.
2. విద్యార్థులకు ప్రముఖులు రాసిన లేఖలు పరిచయం చేయండి.



## చదవండి - ఆనందించండి

# గురుభక్తి

ఒకరోజు ధౌమ్యమహర్షి ఆశ్రమంలో కూర్చుని ఉన్నారు. ఆ సమయంలో వర్షం ఏకదాటిగా కురుస్తోంది. ఆశ్రమప్రాంతం అంతా జలమయం అయింది. వెంటనే ధౌమ్యమహర్షి తన శిష్యులను దగ్గరగా పిలిచి ఇలా అన్నాడు. ' శిష్యులారా! మన పంట చేనుకు ప్రక్కన ఉన్న కాలవగట్టు సక్రమంగా లేకపోతే మన పంట మొత్తం నీళ్ళపాలు అవుతుంది. అదే జరిగితే మన ఆశ్రమంలో అందరూ పస్తులు ఉండాలి. ముందు మీలో ఎవరో ఒకరు వెళ్లి పంటపొలాలను చూసి రండి' అని అన్నాడు.



గురువు మాటలకు అందరూ తలలు వంచుకొని రకరకాల కారణాలు చెప్పారు తప్ప, ఆ వర్షంలో పంటచేనుకు వెళ్లడానికి ఎవరూ సాహసించలేదు. అక్కడ ఉన్న ఆరుణి అనే శిష్యుడు లేచి "గురుదేవా! ఆశ్రమానికి ఆహారం అందించే పంటచేను ఎలా ఉందో నేను చూసి వస్తాను" అని పంటచేను దగ్గరికి బయలుదేరాడు.

ఆరుణి పంటచేల గట్టు దగ్గరికి చేరుకున్నాడు. అక్కడ ఒక చోట కాలవగట్టుకి చిన్న గండిపడింది. ఆ గండిలో నుంచి నీరు పంటపొలాల్లోకి ప్రవహిస్తోంది. ఆరుణి గడ్డి, రాళ్ళు ,రప్పలు తెచ్చి గండికి అడ్డం వేసినా ప్రవాహం ఆగలేదు. ఆరుణి ఒక ఉపాయం ఆలోచించి చివరికి తానే గండికి అడ్డంగా పడుకున్నాడు. ప్రవాహాన్ని అడ్డుకున్నాడు.

తెల్లవారింది. ధౌమ్యమహర్షి ఆరుణిని వెతుక్కుంటూ పంటచేను దగ్గరికి వెళ్ళాడు. అడ్డంగా పడుకున్న ఆరుణి తడిసి, చలికి వణుకుతూ అక్కడే ఉన్నాడు. మహర్షి అతని దగ్గరికి వచ్చి పరిస్థితిని చూసి ఆశ్రమానికి తీసుకెళ్లాడు. సాయంత్రానికి ఆరుణి కోలుకున్నాడు. గురువు దగ్గరికి వచ్చి నమస్కారం చేశాడు. అప్పుడు ధౌమ్యమహర్షి "నీ గురుభక్తి, కార్యదీక్ష వెలకట్టలేనిది"! అని ఆరుణిని మెచ్చుకున్నాడు. ఇదంతా చూస్తున్న మిగతా శిష్యులు సిగ్గుతో తలవంచుకున్నారు. గురువుపై భక్తి ఉన్న వాళ్లకి ఆయన చెప్పిన ఏ పనీ కష్టంగా అనిపించదు. వాళ్ళు మంచి కార్యాలు చేస్తూ, ఉత్తమశిష్యులుగా అందరి మన్ననలు పొందుతారు.

జాజిపువు నాజూకు జాజాము నవకంబు
మల్లెపువ్వుల పరిమళ పరీవాహంబు - తెలుగుభాష
- రాయప్రోలు సుబ్బారావు



# 11 బాలచంద్రుని ప్రతిజ్ఞ

A2Y1G1

**వినడం - ఆలోచించి మాట్లాడడం**



1. చిత్రం గురించి మాట్లాడండి?
2. చిత్రంలో ఉన్న మహనీయుల గొప్పతనం గురించి చర్చించండి?
3. మీకు తెలిసిన యోధుల గురించి మాట్లాడండి.

**ఉద్దేశం:** భారతదేశచరిత్రలో రాజ్యకాంక్షతో జరిగిన యుద్ధాలు కొన్ని. ధర్మాన్ని రక్షించడం కోసం జరిగిన యుద్ధాలు మరికొన్ని. ఇలా ధర్మం వైపు నిలిచిన వారికి కొన్ని కష్టాలు ఎదురైనా చివరగా విజయాన్ని సాధించడం చూడవచ్చు. అలా ధర్మాన్ని రక్షించడం కోసం ప్రాణాలను లెక్కచేయని మహనీయుల గురించి తెలుసుకోవడమే ఈ పాఠం ఉద్దేశం.

**నేపథ్యం :** పల్నాటిరాజ్యం పొలిమేరల్లో యుద్ధ వాతావరణం ఏర్పడింది. ఆ సమయంలో పట్టణవీధుల్లో బాలచంద్రుడు బొంగరాలాట ఆడుతున్నాడు. నైపుణ్యంతో కూడిన ఆట అందరినీ ఆకట్టుకుంటోంది. అమ్మలక్క లందరూ చుట్టూచేరి చూస్తూ ఆనందిస్తున్నారు. ఒక బొంగరం పొరపాటున అన్నమ్మ అనే ఆమెకు తగిలింది. ఆమె కోపంగా “నీ పౌరుషం బొంగరాలాటలో కాదు. యుద్ధభూమిలో చూపించు. పల్నాటి వీరత్వాన్ని ప్రదర్శించు” అని అంది. వెంటనే బాలచంద్రుడు పౌరుషంతో యుద్ధరంగమునకు బయలుదేరి తల్లిదీవెనలు తీసుకునే సందర్భం లోనిది.

**కవి పరిచయం**



## శ్రీనాథుడు (1385 - 1475)

శ్రీనాథుడు పెదకోమటి వేమారెడ్డి ఆస్థానంలో విద్యాధికారిగా ఉండేవారు. వీరు రాసిన చాటుపద్యాలు ఆంధ్రదేశమంతటా ప్రసిద్ధి పొందాయి. మరుత్తరాట్చరిత్ర, శృంగారనైషధము, కాశీఖండము, హరవిలాసము, పల్నాటి వీరచరిత్రము, క్రీడాభిరామము మొదలైనవి రచించారు. వీరికి ‘కవి సార్వభౌముడు’ అనే బిరుదు ఉంది. ఈ పాఠ్యభాగం పల్నాటి వీరచరిత్రలోనిది.

# బాలచంద్రుని ప్రతిజ్ఞ

అని తల్లి పలికిన ననియె బాలుండు
"భయమేల గొల్పెదు భామ నీ విపుడు
నలగాము డెరుగును నాదుశౌర్యంబు
ప్రళయకాలమునాటి భైరవురీతి
సైంధవవధ వేళ సాహసస్ఫూర్తి
విజయుడు రణములో విహరించునట్లు
కౌరవ సేనలో గదబట్టిదూరి
వడముడిరణమున వ్రాలినయట్లు
వాయుపుత్రుడు లంక వడితోడఁజొచ్చి
భస్మంబుగావించి ప్రబలినభంగి
రాక్షసరణములో రామచంద్రుండు
వీరపరాక్రమవిధి జెందినట్లు
జలధిమధ్యంబున సారెకుదిరుగు
మందర శైలంబుమాడ్కిఁ దోఁపంగ
ఫాలాక్షుఁడతి రౌద్రపటిమ మీఱంగ
త్రిపురముల్ గాలిచి తీర్చినయట్లు
స్థావర జంగమ సకలవస్తువుల
ప్రళయాబ్ధి ముంచంగఁ బరగినరీతి
కామభూపదళము గడగడవణక
విక్రమక్రమశక్తి విడివడచొచ్చి
పృథ్విపై పీనుఁగు పెంటలుగాఁగ
విహరింతు మదిలోన వేడుకకొలఁది
ఉర్వీశు దళముల కురుమనిపిడుగ
గర్వించుపగవారి కంటిలో నెరుస
ఎదురెవ్వరే నాకు నీభువిలోన
నలగాముబలముల నలినలిచేసి
వండంగ తరగిన వడుపుననరికి
నెత్తురుమడుగులు నిండంగఁ జేతు
దహనునికడ్డంబె దట్టమౌ వనము
బడబాగ్ని నార్చునే పాథోధిమించి
భయదమౌపులికిని పశుగణం బెదురె



నాటి, నేటి యుద్ధాల గురించి చర్చించండి.

స్వాతికొక్కెరగుంపు సాళ్వంబు కెదురె
జింకలకదుపులు సివ్వంగికీడె
చిన్న మిర్యమునం చెడునె కారంబు
బాలుఁడనని నన్ను భావింపవలదు"
అనిన బాలుని మాట కైతమ్మ పలికె

ద్విపద అంటే రెండు పాదాలు గల పద్యం. ఇది గానయోగ్యమైనది.

## సారాంశం

యుద్ధానికి పోవద్దని పలికిన తల్లి ఐతమ్మతో బాలచంద్రుడు ఇలా పలికాడు. నన్ను ఎందుకు భయపెడతావు. నా పరాక్రమం నలగామరాజునకు తెలుసు. ప్రళయకాలంలో కాలభైరవుని వంటి వాడిని. సైంధవుని చంపేవేళ అర్జునుడు యుద్ధంలో విహరించినట్లుగా విహరిస్తాను. కౌరవసైన్యంలో గదపట్టుకొని భీముడు యుద్ధం చేసినట్లుగా చేస్తాను. హనుమంతుడు లంకలోకి వేగంగా ప్రవేశించి లంకాదహనం చేసినట్లుగా చేయగలను. శ్రీరామచంద్రుని వలె రాక్షసులతో యుద్ధం చేసి వీరత్వానికి ప్రతీకయై నిలుస్తాను. దేవదానవులు సముద్రాన్ని చిలికినప్పుడు సముద్రం మధ్యలో మంధరపర్వతం ఆధారమై నిలిచినట్లు నిలుస్తాను.

ఫాలాక్షుడు గొప్ప శౌర్య పరాక్రమం ఉట్టిపడేటట్లు, త్రిపురాసురునితో యుద్ధం చేసినట్లు చేస్తాను. శివుడు కోపంతో త్రిపురాలను కాల్చినట్లు చెలరేగుతాను. మహాశివుడు ప్రళయకాలంలో భూమండలాన్ని సముద్రంలో ముంచినట్లు యుద్ధంలో సైన్యాన్ని నశింపజేస్తాను. నలగామరాజు సైన్యం గడగడ వణికేటట్లు గొప్ప పరాక్రమాన్ని ప్రదర్శిస్తాను. యుద్ధరంగంలో శత్రుసైన్యం కుప్పలు తెప్పలుగా పడేటట్లు, నా మనస్సు ఆనందపడేట్లు విహరిస్తాను.


మహారాజు సైన్యం పాలిట ఉరుములు లేని పిడుగునౌతాను. గర్వించే సైన్యానికి కంటిలో నలుసునై వేధిస్తాను. ఆ సమయంలో నన్ను ఈ భూమిపై ఎదిరించే వారెవరున్నారు? నలగామరాజు బలగాన్ని తుక్కుతుక్కుగా చేస్తాను, వంట చేసేటప్పుడు కూరముక్కలు తరిగినట్లుగా తరుగుతాను. యుద్ధంలో రక్తం మడుగులు కట్టిస్తాను.

దావాగ్ని దహనం చెయ్యడానికి అడవి అడ్డమా...? బడబాగ్నిని సముద్రం ఆర్పగలదా...? భయంకరమైన పులిని జంతుసమూహం ఎదిరించగలదా...? డేగను కొంగలు అడ్డుకోగలవా...? వేగంలో సివంగికి జింకలసముహం సాటి ఔతుందా...? మిరియపుగింజ చిన్నదైనా కారం చెడుతుందా?'.. అని బాలచంద్రుడు పలికాడు. నీవు నన్ను చిన్న బాలునిగా భావించవద్దని తల్లితో చెప్పాడు.

## ఇవి చేయండి

**ఉపాధ్యాయుడు చెప్పిన కింది పదాలను (ఉక్తలేఖనం) రాయండి.**

ఫాలాక్షుడు, శౌర్యము, స్ఫూర్తి, భస్మము, పృథ్వి, త్రిపురములు, ఉర్వీశుఁ
వాయుపుత్రుడు, పరాక్రమము, స్థావరము, మంధరశైలము, బడబాగ్ని



## అవగాహన - ప్రతిస్పందన

1. పాఠంలోని ద్విపద పాదాలను రాగయుక్తంగా పాడండి.
2. బాలచంద్రుడు ఎవరితో ఏమన్నాడో చెప్పండి.
3. బాలచంద్రునికి తల్లి ఏమని చెప్పిందో ఊహించి
4. **కింది గీతాన్ని చదివి ప్రశ్నలకు జవాబులు రాయం**



పల్లవి: విశ్వభారత వీర లేవోయీ
ప్రగతి పథముల వెంట పదవోయీ

చ: స్వాతంత్ర్య వీరుండు రాణాప్రతాపుండు
నీ జాతి వాడురా ప్రళయాగ్ని వీవురా
వీరాభిమన్యుండు పలనాటిబాలుండు
నీ సహోదరులురా లయ ఝంఝ వీవురా ॥

చ: ధీర ఝాన్సీరాణి నీ వీరమాతరా
కాకతీ రుద్రమ్మ నీ సోదరేనురా
మగువ మాంచాల నీ బంగారు వదినరా
వీరవంశము నీది వీర రక్తమ్మురా ॥

చ: పదునాల్గు భువనాల నిన్నడ్డు మొనగాడు
లేడురా జగదేక వీరుడవు నీవెరా
శివ సముద్రమ్మువై బడబాగ్ని జ్వాలవై
లంఘించి వెలుగరా లోకాలనేలరా ॥ ॥వి॥

### ప్రశ్నలు

1. గేయంలో స్వతంత్ర వీరుడెవరు?

జ: ______________________________

2. కవి వీరాభిమన్యునితో ఎవరిని పోల్చాడు?

జ: ______________________________

3. గేయంలోని వీరవనితల పేర్లు రాయండి.

జ: ______________________________

4. కవి ఎవరికి ప్రేరణను కలిగిస్తున్నాడు?

జ: ______________________________



## వ్యక్తీకరణ - సృజనాత్మకత

**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. బాలచంద్రుని పరాక్రమాన్ని ఎవరెవరితో పోల్చడం జరిగింది?
2. బాలచంద్రుని పరాక్రమాన్ని రామాయణ, భారత, భాగవత వీరులతో పోల్చిన అంశాలను వివరించండి.
3. బాలచంద్రుడు తనను ఎదిరించలేరనడానికి చెప్పిన పోలికలేవి?

**ఆ) కింది ప్రశ్నలకు 8 నుంచి 10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. పాఠ్యభాగ సారాంశాన్ని సొంతమాటలలో రాయండి?
2. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పోరాడిన ఇద్దరు వీరుల గురించి రాయండి.
3. తల్లి ఐతమ్మకి బాలచంద్రునికి మధ్య జరిగిన సంభాషణను రాయండి.



## భాషాంశాలు

**అ) కింద గీతగీసిన పదాలకు అర్థాలు రాయండి. వాటితో సొంతవాక్యాలు రాయండి.**

ఉదా: కౌరవసైన్యం కురుక్షేత్ర రణములో మరణించింది.

రణము = యుద్ధము

1. భోగిమంటలో వేసిన వస్తువులు కాలి భస్మం అవుతాయి.

భస్మం = ______________________________

2. జలధిలోని నీరు ఉప్పగా ఉంటుంది.

జలధి = ______________________________

3. హిమాలయ శైలము మంచుతో కప్పబడి ఉంటుంది.

శైలము = ______________________________

4. పృథ్వి గుండ్రంగా ఉంటుంది.

పృథ్వి = ______________________________

## ఆ) అర్థాలను జతపరచండి.

| | | | | |
|---|---|---|---|---|
| 1. | మది | (   ) | అ) | వేడుక |
| 2. | ఉర్వీశుడు | (   ) | ఆ) | పరాక్రమం |
| 3. | దళము | (   ) | ఇ) | మహారాజు |
| 4. | విక్రమము | (   ) | ఈ) | అగ్ని |
| 5. | సంతోషము | (   ) | ఉ) | అడవి |
| 6. | వనము | (   ) | ఊ) | మనస్సు |
| 7. | దహనుడు | (   ) | ఋ) | సైన్యం |

## ఇ) కింద ఇచ్చిన పదానికి సమానార్థక పదాలు వాక్యాలలో ఉన్నాయి. వాటిని గుర్తించి రాయండి.

1. బాలచంద్రుడు రణంలోకి దూకాడు. అతనికి యుద్ధకాంక్ష ఉంది.

   సమరం = ____________ ____________

2. జ్వలనుడు అడవిని దహించాడు. అగ్ని ధాటికి చెట్లన్నీ కాలిపోయాయి.

   వహ్ని = ____________ ____________

3. దేవతలు అమృతం కోసం అంబుధిని మథించారు. ఉదధి నుండి చంద్రుడు పుట్టాడు.

   సముద్రం = ____________ ____________

4. పుడమిపై కనకవర్షం కురిసింది. రైతులు ధరణిపై బంగారం పండిస్తున్నారు.

   పసిడి = ____________ ____________

   భూమి = ____________ ____________

## ఈ) కింది వానిలో ప్రకృతి వికృతులను జతపరచండి.

| | | | |
|---|---|---|---|
| 1. | పుత్రుడు | (   ) | అ) పసువు |
| 2. | రాక్షసుడు | (   ) | ఆ) పుడమి |
| 3. | పృథ్వి | (   ) | ఇ) బొట్టె |
| 4. | పశువు | (   ) | ఈ) రక్కసుడు |

## ఉ) కింది పదాలకు వ్యతిరేక పదాలు రాయండి.

1. భయం X ____________
2. న్యాయం X ____________
3. భువి X ____________
4. జయం X ____________



## వ్యాకరణాంశాలు

### గసడదవాదేశ సంధి

**అ) కింది వాక్యాలను పరిశీలించండి.**

1. కల్నల్ సంతోష్‌బాబు దేశంకోసం ప్రాణాలర్పించాడు. అతడు గొప్పవాడుగదా.
2. అందరు నిజముదెలిసి మసలుకోవాలి.
3. పాండవులు విరాటమహారాజు కొలువుసేసిరి.
4. లతకు ఏమి చేయాలో పాలుపోక ఉంది.

**గీతగీసిన పదాలను విడదీయండి.**

| | | | | |
|---|---|---|---|---|
| **ఉదా:** | గొప్పవాడు | + | కదా | = గొప్పవాడుగదా |
| 1. | నిజము | + | తెలిసి | = ______________ |
| 2. | కొలువు | + | చేసిరి | = ______________ |
| 3. | పాలు | + | పోక | = ______________ |

పై ఉదాహరణల్లో ప్రథమావిభక్తి ప్రత్యయాలైన డు-ము-వు-లు పూర్వపదం చివర ఉన్నాయి. పరుషాలైన క-చ-ట-త-ప లు పరపదం మొదట ఉన్నాయి. అప్పుడు వాటి స్థానంలో గ-స-డ-ద-వ లు ఆదేశంగా వచ్చాయి. ఒకానొక సమయంలో గసడదవలు రాకపోతే అవే రూపాలు యథాతథంగా ఉంటాయి. ఇలా రెండు విధాలుగా సంధి జరగడాన్ని గసడదవాదేశ సంధిలో గమనించవచ్చు.

### సప్తమీ విభక్తి

**ఆ) కింది వాక్యాలు చదవండి.**

| | | | |
|---|---|---|---|
| 1. | సరయు నదీతీరం | | కోసల దేశం ఉంది. |
| 2. | చాణక్యుడు మాటల | | నేర్పరి |
| 3. | కాశీ | అందు | గంగా నది ఉంది. |
| 4. | తల్లికి పిల్లల | | అనురాగం ఉంది. |
| 5. | గరుత్మంతునికి తల్లి | | భక్తి ఉంది. |

**పై వాక్యాలను సరిచేసి తిరిగి రాయండి.**

ఉదా: సరయునది తీరమందు కోసలదేశం ఉంది.

1. ________________________________________

2. ________________________________________

3. ______________________________

4. ______________________________

పై పట్టికను గమనిస్తే 'అందు' అనే ప్రత్యయం వాక్యాలను అర్థవంతంగా మార్చింది. ఇలా వాక్యంలోని కొన్ని పదాల మధ్యన చేరే 'అందున్, నన్' అనే ప్రత్యయాలను సప్తమీవిభక్తిగా చెప్పవచ్చు. సాధారణంగా సామీప్య, విషయసంబంధాన్ని, అంతటా వ్యాపించటాన్ని గురించి చెప్పేటప్పుడు 'సప్తమీవిభక్తి' ని ఉపయోగిస్తారు.

### ఇ) కింది ఖాళీలను పూరించండి.

| సమాస పదం | | విగ్రహ వాక్యం | సమాసం పేరు |
|---|---|---|---|
| ఉదా: వాయుపుత్రుడు | = | వాయువు యొక్క పుత్రుడు | షష్ఠీతత్పురుష సమాసం |
| 1. మా ఇల్లు | = | ________ | ________ |
| 2. నా పుస్తకం | = | ________ | ________ |
| 3. తల్లి మనసు | = | ________ | ________ |
| 4. రాజు సైన్యం | = | ________ | ________ |

### ఈ) సంధి పదాలను విడదీసి రాయండి.

X6C6R5

| | | | | |
|---|---|---|---|---|
| ఉదా: ఫాలాక్షుడు | = | ఫాల | + | అక్షుడు |
| 1. ప్రళయాబ్ధి | = | ________ | + | ________ |
| 2. భయమేల | = | ________ | + | ________ |
| 3. బాలుడని | = | ________ | + | ________ |
| 4. బడబాగ్ని | = | ________ | + | ________ |
| 5. నీవిప్పుడు | = | ________ | + | ________ |
| 6. వ్రాలినయట్లు | = | ________ | + | ________ |
| 7. తీర్చినయట్లు | = | ________ | + | ________ |
| 8. ఎదురెవ్వరు | = | ________ | + | ________ |
| 9. మంచిదని | = | ________ | + | ________ |
| 10. గదంబట్టి | = | ________ | + | ________ |



### ప్రాజెక్టుపని

మీకు తెలిసిన వీరవనితల చిత్రాలను సేకరించండి. వారి గురించి రాయండి.

## చమత్కార పద్యం

కం. తోక వెనకాలనుండును
టీకప్పున నుండు మండుటెండలనుండున్
మోకాలు ముందునుండును
ఆకాశము పైననుండు అద్దిరభన్నా

పై పద్యములో చమత్కారాన్ని గమనించండి.

**భావం:** ఈ పద్యంలో తోక వెనకాల, టీకప్పులో, మండుటెండలు, మోకాలుకు ముందు, ఆకాశంపైన ఏముంటుందని అడిగారు. ఇది ఒక చమత్కార పద్యము. పైకి అలా కనబడుతున్నా పద్యములో సమాధానం ఉంది. తోక ఎప్పుడూ వెనకాలే ఉంటుంది. టీ – కప్పులో ఉంటుంది. ఇప్పుడు మళ్ళీ ఒకసారి చదవండి. మీకు పద్య చమత్కారం అర్థమౌతుంది.

## నేనివి చేయగలనా?

1. యుద్ధంలో వీరోచితంగా పోరాడిన వీరుల గురించి మాట్లాడగలను. ఔను / కాదు
2. గేయాన్ని ధారాళంగా చదవగలను. భావాన్ని సొంతమాటల్లో చెప్పగలను. ఔను / కాదు
3. పాఠంలోని పదాలను, వాక్యాలను,వాక్యనిర్మాణంలో వినియోగించగలను. ఔను / కాదు
4. పాఠంలోని ప్రశ్నలకు జవాబులు సొంతమాటల్లో రాయగలను. ఔను / కాదు

## ఉపాధ్యాయులకు సూచనలు

1. పల్నాటివీరచరిత్రను సేకరించి చదవండి. విద్యార్థుల చేత చదివించండి.
2. పోరాటపటిమ పెంపొందించుకోడానికి ఉపకరించే మహనీయుల జీవితచరిత్రలను కథా రూపంలో విద్యార్థులకు వినిపించండి.
   ఉదా: అల్లూరి సీతారామరాజు, రాజా రామ్మోహన్‌రాయ్, గాంధీజీ, శివాజీ, భగత్సింగ్ మొదలైనవారు.


సాహితీ తరంగ సంగీత రసధుని – తెలుగుభాష
– నందూరి రామకృష్ణమాచార్యులు



## చదవండి – ఆనందించండి

### ఏకాగ్రత

అది హస్తినాపురం. విలువిద్యలో శిక్షణ పొందిన రాకుమారులు ధనుర్బాణాలు ధరించి నిలుచున్నారు. దూరంగా చెట్టు, దానిమీద పక్షి బొమ్మ ఉంది. ద్రోణుడు ముందుగా ధర్మరాజుతో "రాకుమారా! చెట్టును గమనించు, నీకేం కనపడుతున్నాయి" అని అన్నాడు. పక్షితో పాటు చెట్టు, కొమ్మలు, ఆకులు కూడా కనపడుతున్నాయని ధర్మరాజు సమాధానం చెప్పాడు. తర్వాత దుర్యోధనుడు, భీముడు మొదలైన శిష్యులందరినీ అదే విధంగా ద్రోణుడు అడిగాడు. వారు కూడా తమకు అన్నీ కనబడుతున్నాయని చెప్పారు.



తరువాత ద్రోణుడు అర్జునుడితో, నీకు చెట్టు కనబడుతున్నదా! అని ప్రశ్నించాడు. లేదని సమాధానం చెప్పాడు.మరి కొమ్మలు, ఆకులు కనబడుతున్నాయా? అని ద్రోణుడు అన్నాడు. లేదని సమాధానమిచ్చాడు. మరి పక్షి కనిపిస్తున్నదా? మరలా లేదనే సమాధానం వచ్చింది. మరినీకేం కనిపిస్తున్నది? పక్షి కన్ను అని సమాధానం వచ్చింది. ఆ లక్ష్యాన్ని ఛేదించు అని ద్రోణుని నోటినుంచి మాట వచ్చేలోపే అర్జునుడు విడిచిన బాణం పక్షి కన్నును తాకింది. ఆ ప్రాంగణమంతా కరతాళధ్వనులు మారుమ్రోగాయి. ఆనందంతో శిష్యుని ఏకాగ్రతను మెచ్చి గురు ద్రోణుడు ఆశీర్వదించాడు.

భారతంలోని ఈ ఇతివృత్తాన్ని గమనిస్తే అర్జునుడు తన దృష్టిని పూర్తిగా చేస్తున్న పని మీదే కేంద్రీకరించాడు. అలా మనస్సు ఒకే విషయాన్ని గురించి నిలకడగా ఆలోచించడమే ఏకాగ్రత. భూతద్దం ద్వారా సూర్యరశ్మి ఒకేచోట కదలకుండా వుంచితే అది చెక్కను క్షణాలలో కాల్చగలుగుతుంది. కానీ నేరుగా తాకే సూర్యరశ్మి ఆ చెక్కను కాల్చలేదు. అదే విధంగా సాధారణమైన స్థితిలో మన ఆలోచనా శక్తి చెల్లాచెదరై ఉంటుంది. అదే ఆలోచనా శక్తిని మనం ఒకే విషయంపై ఉంచినపుడు త్వరగా నేర్చుకోగలుగుతాం.

ఇది మనస్సుకు సంబంధించినది. మనస్సు ఒకే విషయంపై ఏకాగ్రతతో ఉండటాన్ని అభ్యాసం చేస్తే అన్ని విద్యలలోనూ రాణించగలుగుతారు. ఏ రంగంలోనైనా విజయం సాధించగలుగుతారు.

# 12 స్ఫూర్తి ప్రదాతలు

W5J1L9

## అపరఅన్నపూర్ణ డొక్కా సీతమ్మ (1841-1909)

భక్తులు కోరిన కోర్కెలు తీర్చే దైవంగా ప్రసిద్ధి పొందిన అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి ఒకావిడ పయనమై వెళుతున్నారు. ఆ ప్రయాణంలో ఆమెకు ఒక పెండ్లిబృందం ఎదురుపడింది. ఆ సమూహంలో పిల్లలు ఆకలితో ఏడుస్తుంటే ఒక పెద్దావిడ "దగ్గరలోనే నిత్యాన్నదాన కార్యక్రమం జరిగే ఒక ఇల్లు ఉంది. అక్కడికి వెళ్లి భోజనం చేయవచ్చు, పిల్లలకు పాలు పట్టవచ్చు. అంతవరకు ఓపిక పట్టండి" అని చెప్పడం ఆవిడ చెవిన పడింది. వెంటనే తన ప్రయాణాన్ని మార్గమధ్యంలోనే విరమించుకుని వారి కంటే ముందుగా ఆవిడ ఇంటికి చేరి వంటలు చేసింది. వారికి భోజనాలు వడ్డించింది. ఆ పెండ్లిబృందం వాళ్ళు ఆవిడ చూపిన ఆదరాభిమానాలకు అమితానంద భరితులయ్యారు. ఒకసారి బ్రిటిష్ ప్రభుత్వంలోని తహసిల్దార్ ఆకలితో ఆవిడ ఇంటికి వచ్చారు. దురదృష్టవశాత్తు ఆమె ఇంటిలో ఆ సమయానికి కూరగాయలు నిండుకున్నాయి. అప్పుడు ఆవిడ తమ ఇంటి ఆవరణంలోని గరికవేళ్లతో పచ్చడి తయారుచేస్తుంది. వచ్చిన అధికారికి భోజనం వడ్డిస్తుంది. బహురుచికరమైన ఆమె వంటకానికి, ఆతిథ్యానికి సదరు తహసిల్దారు సంతోషభరితుడయ్యాడు. ఆమె జీవితంలో ఇలాంటి సంఘటనలు కోకొల్లలు. అంతటి విశిష్ట దానశీల గుణాలు కలిగిన మాతృమూర్తి, అన్నార్తుల ఆకలితీర్చి 'అపర అన్నపూర్ణ'గా ప్రపంచ ఖ్యాతి గాంచిన ఆమె మరెవరో కాదు డొక్కా సీతమ్మ.

డొక్కా సీతమ్మ తూర్పు గోదావరి జిల్లా మండపేటలో భవానిశంకరం, నరసమ్మ దంపతులకు 1841వ సంవత్సరంలో జన్మించారు. లంకల గన్నవరానికి చెందిన ధనవంతుడు, వేదపండితుడు అయినా డొక్కా జోగయ్యతో వివాహం జరిగింది. ఆ పుణ్యదంపతుల ఇంట పాడిపంటలకు కొరత ఉండేది కాదు. అతిథులను దేవుళ్లుగా భావించేవారు. బాటసారులకు ప్రతినిత్యం విసుగు, విరామం లేకుండా ప్రేమాభిమానాలతో అన్నం వడ్డించేవారు. ఆ ఇల్లు నిత్యం అతిథిసత్కారాలతో, అన్న సంతర్పణలతో కన్నుల పండువగా కళకళలాడేది.




సీతమ్మకు అన్నదానం చేయడం పుట్టుకతో వచ్చిన లక్షణం. "అన్ని దానముల కంటే అన్నదానం మిన్న" అని నమ్మిన కుటుంబం వారిది. ఆమె ఇంట

ప్రతిరోజు వందలాదిమంది ఉచితంగా భోజనాలు చేసేవారు. గోదావరి వరదల సమయంలో రేవుకు ఆవలి లంక గ్రామాల్లో ఆకలికేకలు వినిపిస్తే భర్తతో కలిసి వెళ్ళింది. వారికి ఆహారాన్ని అందించి వారి ఆకలిదప్పులు తీర్చింది. కోనసీమలోని ప్రజలు నేటికీ వీరి గురించి గొప్పగా చెప్పుకుంటుంటారు. "సీతమ్మ గారి ఇల్లు తిరుపతిలోని నిత్యాన్నదానం వలె అతిథి మర్యాదలతో విలసిల్లేది". సమయానికి వంటచెరకు లేకపోతే సీతమ్మ తన చీరలనే వంటచెరకుగా మార్చి వంటావార్పు చేసిన సందర్భాలు కూడా అనేకం ఉన్నాయి.

వార్ధక్యం సమీపించినా సీతమ్మగారి ఓర్పు, సహనం, అసహనాన్ని చెంతచేరనీయలేదు. దాసదాసీల సహకారం తీసుకోమని భర్త చెప్పినా స్వయంగా సేవ చేయడంలో ఉన్న తృప్తిని, మధురానుభూతిని గురించి మృదుమధురంగా విన్నవించేది. రాచకురుపు(కేన్సర్ ) తో బాధపడుతున్నా అన్నదానం చేయడం మానలేదు. సీతమ్మ అమూల్య సేవలను గుర్తించి బ్రిటిష్ ప్రభుత్వం 1903వ సంవత్సరంలో 'ప్రశంసా పత్రం' ఇచ్చి సత్కరించింది.

డొక్కా సీతమ్మ జీవితచరిత్ర గురించి పలుభాషలలో అనేక గ్రంథాలు వెలువడ్డాయి. నిత్యాన్నదాత్రిగా ఖండాంతర ఖ్యాతిని గడించిన సీతమ్మ 1909వ సంవత్సరంలో కన్నుమూశారు. పాత గన్నవరం దగ్గర వైనతేయనదిపై నిర్మించిన నూతన ఆనకట్టకు "డొక్కా సీతమ్మవారధి" అని నామకరణం చేశారు. ఈ వారధికి వారి పేరు పెట్టడం ఆమెను తెలుగు ప్రజలు చిరకాలం గుర్తుంచుకున్నారనేందుకు చిహ్నంగా భావించవచ్చు. డొక్కా సీతమ్మ సేవాతత్పరత భావితరాలకు స్ఫూర్తిదాయకం.

## ఆంధ్ర తిలక్ గాడిచర్ల (1883-1960)



అది వెల్లూరు సెంట్రల్ జైల్. బందిపోటు దొంగలను, హంతకులను ఉంచే గది. అలాంటి గదిలో కట్టుకోవడానికి రెండు గోచీలు, మూర పొడవున్న రెండు తువ్వాళ్ళు ఇచ్చారు. పడుకోవడానికి చిన్న ఈతచాప, తినడానికి మట్టిచట్టి, తాగడానికి మట్టిముంత, మల-మూత్ర విసర్జనకు మరో మట్టిచట్టి ఇచ్చారు. కాలికి లావాటి కడియాలు వేశారు. మెడకు మరో కడియం వేసి కొయ్యముక్కను వీటిలో దూర్చారు. తలబోడి చేయించారు. తినడానికి పెట్టే రాగిసంగటి ముద్దలో రాళ్లు-పుల్లలు-పురుగులు తేలుతుండేవి. ఇలాంటి కఠిన కారాగార జీవితాన్ని భరతమాత ముద్దుబిడ్డ మూడు సంవత్సరాలపాటు అనుభవించారు. కేవలం బ్రిటిషువారి దమనకాండను నిరసిస్తూ 'విపరీత బుద్ధి' అనే పేరుతో రాసిన సంపాదకీయ వ్యాసం తెల్లవారి గుండెల్లో భయాన్ని పుట్టించింది. రాజద్రోహం నేరం కింద ఈ కఠినశిక్షను విధించారు. దానిని ఆనందంగా దేశంకోసం అనుభవించారు. వారే 'ఆంధ్రతిలక్'గా ప్రసిద్ధులైన గాడిచర్ల హరిసర్వోత్తమరావు.

అవి రాజమండ్రి టీచర్ ట్రైనింగ్ కాలేజీలో చదివే రోజులు. స్వాతంత్ర్య సమరయోధుడు బిపిన్ చంద్ర పాల్ ఇచ్చిన ఉపన్యాసానికి అక్కడి విద్యార్థులు ఎంతో ప్రభావితులయ్యారు. మరుసటిరోజు 'వందేమాతరం' బ్యాడ్జీలతో తరగతి గదికి వెళ్లారు. ప్రిన్సిపల్ మార్క్‌హంటర్ వాటిని తొలగించమని చెప్పాడు. దానికి విద్యార్థి నాయకుడిగా ఉన్న గాడిచర్ల అంగీకరించలేదు. దానికి వెంటనే అతన్ని కళాశాల నుంచి డిస్మిస్ చేశారు. అంతేకాదు 30 సంవత్సరాల

పాటు ప్రభుత్వ ఉద్యోగానికి అనర్హుడిగా ప్రకటించారు. అయినా దేశసేవలో వెనుకడుగు వేయని అకుంఠిత దేశభక్తుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు.

జీవితంలో కడు బీదరికాన్ని అనుభవించారు. ఏనాడు పదవులకోసం ప్రాకులాడలేదు. హిందూపత్రికకు సమీక్షావ్యాసాలు రాసేవారు. వచ్చిన పైకంతో జీవితాన్ని గడిపారు. ఎవరి దగ్గర చేయి చాచేవారు కాదు. అంతటి అభిమానధనుడు సర్వోత్తమరావు. స్వరాజ్యపత్రిక లో వీరు రాసిన వ్యాసాలు బ్రిటిష్‌వారిని అసహనానికి గురిచేసేవి. వారు చేసిన అన్యాయాలను మోసాలను గురించి ధైర్యంగా రాసేవారు. తాను నమ్మిన సిద్ధాంతాల కోసం జాతీయ నాయకులైన గాంధీగారిని కూడా విమర్శించడానికి వెనుకాడలేదు. అప్పుడు గాంధీగారు స్వయంగా 'ద బ్రేవ్ హరిసర్వోత్తమరావు' అని మెచ్చుకున్నారు.

పాతికేళ్ళవయస్సులో భారతదేశంలో వయోజనవిద్యా సమస్య గాడిచర్లవారిని ఆలోచింపజేసింది. వయోజనులు అక్షరాస్యులయితేనే భారత ప్రజాస్వామ్య వ్యవస్థ సరైన పునాదుల మీద నిలబడగలదని విశ్వసించారు. ఈ కలను సాకారం చేయడం కోసం అవిశ్రాంతంగా శ్రమించారు. గ్రంథాలయ ఉద్యమాన్ని చేపట్టారు. పగటిపూట గ్రంథాలయాలను దర్శించేవారు. రాత్రిపూట వయోజనవిద్యా కేంద్రాల పనితీరును సమీక్షించేవారు.


**ఆంధ్రపత్రిక** తొలిసంపాదకులు శ్రీ గాడిచర్ల. మహిళలసమస్యల పరిష్కారం కోసం 'సౌందర్యవల్లి'అనే పత్రికను నడిపారు. అలాగే ఆంధ్రవార్త ,వయోజనవిద్యా సమీక్ష, కౌముది, మాతృసేవ తదితర పత్రికలకు సంపాదకత్వం వహించారు.

అబ్రహాం లింకన్, The Neglected Emperor Poet తదితర రచనలు శ్రీ గాడిచర్ల సారస్వత కృషికి నిదర్శనాలు. 'ఆముక్త మాల్యద'ను రచించింది శ్రీకృష్ణదేవరాయలేనని ఆయన నిరూపించారు.

1955లో హైదరాబాద్‌లో తెలుగుభాషాసమితిని ప్రారంభించారు. ఉమ్మడి మద్రాసురాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు పోటీచేసి అధికమెజార్టీతో గెలుపొందారు. కర్నూలుజిల్లాలోని మహానందిక్షేత్ర ప్రాంతాన్ని, వన్యమృగ సంరక్షణ ప్రాంతంగా ప్రకటించేందుకు శ్రీ గాడిచర్ల కృషిచేశారు. 1939లో ప్రొద్దుటూరులో జరిగిన రాయలసీమ మహాసభలకు ఆంధ్ర రాష్ట్రీయ సహకార మహాసభలకు, ఆంధ్రరాష్ట్ర వ్యవసాయ పనిముట్ల ఉత్పత్తిదారుల సంఘం, అఖిలభారత వయోజనవిద్యా మహాసభలకు శ్రీ గాడిచర్ల అధ్యక్షులుగా ఎనలేనిసేవలు అందజేశారు. ఆంధ్రరాష్ట్ర స్థాపనకు అవిరళకృషి చేశారు. హరిసర్వోత్తమరావుగారు 1883లో కర్నూలుజిల్లా పాములపాడులో జన్మించారు. 1960లో మద్రాసులో కన్నుమూశారు. భరతమాత ముద్దుబిడ్డగా ఈ దేశానికి చేసిన సేవకు చిహ్నంగా విజయవాడలో సర్వోత్తమ భవనం నిర్మించారు. నేటితరం వీరి జీవితం నుండి త్యాగం, సేవ,దీక్ష,దేశభక్తి, స్వాభిమానం వంటి సుగుణాలను అలవర్చుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

## కలియుగభీముడు కోడిరామమూర్తి నాయుడు (1885-1942)

అవి బ్రిటిష్‌వారి అహంకారానికి దౌర్జన్యానికి నిదర్శనంగా నిలిచిన రోజులు. వారు తమను మించినవారు లేరనుకునేవారు. భారతీయులను అణువణువునా బానిసలుగా చూసేవారు. 'యూజిన్ పాండో' ఒక శ్వేతజాతీయుడు. అతని మహాకాయాన్ని, శారీరకదృఢత్వాన్ని చూసుకుని తెల్లవారు గర్వపడేవారు. అలాంటి పాండోను ఒక సామాన్య భారతీయుడు కుస్తీ పోటీకి ఆహ్వానించాడు. అతనివైపు ఎగాదిగా పాండో చూశాడు. ఒంపు తిరిగిన ఇనుపకండలు,



ఉక్కునరాలు, బిగుతయినశరీరం, శౌర్యానికి నిలువెత్తురూపం, నదురుబెదురు లేని మాట, చురుకైన చూపులు, సింహం వంటి నడక. తెల్లజాతి మల్లయోధుని భయకంపితుని చేశాయి. వెంటనే కుస్తీ నా వృత్తి కాదని చెప్పి తలవంచుకొని పక్కకు తప్పుకున్నాడు. అలా తెల్లవారి అహంకారానికి అంకుశమైన జగదేక మల్లుడు కోడి రామమూర్తి నాయుడు మన తెలుగువాడుట.

అది స్పెయిన్ దేశపు సుప్రసిద్ధ క్రీడాప్రాంగణం. ప్రేక్షకుల అరుపులతో మారుమోగుతోంది. ఆ దేశపు ప్రధానక్రీడ బుల్ ఫైట్. బలిసిన ఎద్లను ఉసిగొల్పుతారు. ఎవరైతే లొంగదీసుకుంటారో వారు ఆ ఆటలో విజేతలుగా నిలుస్తారు. అప్పటికే ఇద్దరు వీరులను అవి మట్టి కరిపించాయి. వాటి కొమ్ములు మొనతేరి ఉన్నాయి. పర్వతమంత ఆకారం వాటి సొంతం. కనుగుడ్లు ఎర్రగా ఉన్నాయి. మెడలో ఎర్రటి పూలమాల కనిపిస్తోంది. మరొక యోధుని యుద్ధానికి ఆహ్వానిస్తున్నట్లు రంకెలు వేస్తున్నాయి. వాటి అంచనాలు తలకిందులు అయ్యే క్షణం వచ్చిందని వాటికి తెలియదు. అతివేగంతో వస్తున్న ఆ ఎద్దు రెండుకొమ్ముల్ని అంతే వేగంతో ఒడిసి పట్టుకున్నాడు. ఒక్క క్షణం పాటు క్రీడా మైదానంలో నిశ్శబ్దం అలముకుంది. ఏం జరగబోతోందో ఎవరికీ అర్థం కాలేదు. ఎద్దును పైకెత్తాడు. గిరగిర తిప్పాడు. దూరంగా విసిరాడు. సింహనాదం చేశాడు. కొన్ని నిముషాలపాటు చప్పట్లు మోగుతూనే ఉన్నాయి.

ఆ కరతాళధ్వనులు, అభినందనలను భారతమాతకు అంకితం చేశాడు. అతడు బలంలో వేగంలో ఆంజనేయుని వంటివాడు. ఆయనే భరతమాత ముద్దుబిడ్డ కోడి రామమూర్తినాయుడు.

వైస్రాయి లార్డ్ మింటో కోడి రామమూర్తి బలాన్ని గురించి వినిఉన్నాడు. స్వయంగా తానే పరీక్షించదలచాడు. అతని కాలికి ఇనుపగొలుసులు కట్టాడు. మరోవైపు ఆ గొలుసులను తన కారుకి తగిలించాడు. స్వయంగా కారును వేగంగా నడపడం కోసం గేర్లు మార్చాడు. ఒక్క అంగుళం కూడా కారు కదల్లేదు. వైస్రాయ్ ఆశ్చర్యపోయాడు. ఇంతటి బలానికి కారణాన్ని అడిగాడు. మీరు తినే మాంసాహారం గురించి చెప్పమన్నాడు. అప్పుడు రామమూర్తి నాయుడు గారు "నా పేరు లోనే కోడి ఉంది. కాని నేను పూర్తి శాకాహారిని" అన్నాడు.

కోడి రామమూర్తినాయుడు యోగవిద్యలో ప్రాణాయామాన్ని అభ్యసించారు. వీరు ఊపిరిబిగబట్టి ఒంటినిండా ఇనుపగొలుసులు కట్టించుకునేవారు. ఒక్కసారి ఊపిరి వదిలేసరికి గొలుసులు ముక్కలు ముక్కలుగా తెగిపోయేవి. ఛాతీ మీద ఏనుగును ఎక్కించుకునేవాడు. రొమ్ము పైభాగంలో పెద్ద బండరాళ్లను ఉంచుకొని సుత్తితో పగలగొట్టమనేవాడు. ఇవి వారి పరాక్రమానికి ఉదాహరణలు. నాయుడుగారికి బహుమతి రూపంగా వచ్చే జమాఖర్చులు అతని ఆంతరంగిక కార్యదర్శి రాసేవాడు. అతను చెప్పిన ప్రకారం మరో కంటికి తెలియకుండా కోడి రామమూర్తి దానధర్మాలకు కోటిరూపాయలకు పైగా ఆ రోజుల్లోనే వెచ్చించారు. ఇది వారి దానగుణానికి ఉదాహరణ. చివరిదశలో వీరి కాలికి రాచపుండు ఏర్పడింది. కాలు తీసి వేసే శస్త్రచికిత్స జరుగుతోంది. నొప్పి లేకుండా ఉండటానికి మత్తు ఇవ్వడానికి వైద్యులు ప్రయత్నించారు. దానికి వారు అంగీకరించలేదు. ప్రాణాయామం చేసి నొప్పిని భరించారు. శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఇలా భారతీయవిలువలతో జీవితాన్ని గడిపిన కోడి రామమూర్తి 1885లో శ్రీకాకుళంజిల్లా వీరఘట్టంలో జన్మించారు. 1942లో భారతమాత ఒడిలోకి చేరారు. యోధులకు మరణం ఉండదు. వారి కీర్తి వారిని

జీవింప చేస్తుందనేది వాస్తవం. వీరిని ఆదర్శంగా తీసుకొని శారీరకబలాన్ని, మానసికబలాన్ని నేడు ప్రతి ఒక్కరూ కలిగిఉండాలి.

తద్వారా దేశానికి మన శక్తియుక్తులను వినియోగించగలం. దేశసేవలో భాగస్థులం కాగలం. కోడి రామమూర్తి నాయుడిని గురించి వరవిక్రయం నాటకకర్త కాళ్ళకూరి నారాయణరావు ఇలా అన్నారు.

"సాధుపథవర్తి
సన్మిత్రచక్రవర్తి
రమ్యతరకీర్తి
శ్రీ కోడి రామమూర్తి"

## బహుముఖ ప్రజ్ఞాశాలి, కవిశేఖర డాక్టర్ ఉమర్ అలీషా (1885-1945)



భారతదేశచరిత్రలో 1885-1947 మధ్యకాలం చాలా కీలకమైనది. అది పరాయిపాలనలో, మూఢనమ్మకాలతో, అంటరానితనం మొదలైన సమస్యలతో సతమతమవుతున్న కాలం. ఆ కాలంలో అజ్ఞానం, అంధకారాన్ని పారదోలడానికి అనేక మంది కృషిచేశారు. అటువంటి వారిలో చెప్పుకోదగ్గ స్వాతంత్ర్య సమరయోధుడు, సాహితీవేత్త "డాక్టర్ ఉమర్ అలీ షా" ఒకరు.

ఇరాక్ దేశ రాజధాని బాగ్దాదు నుండి క్రీస్తుశకం 1472లో ఒక మహమ్మదీయ కుటుంబం ఢిల్లీకి వచ్చారు. ఆ మహ్మదీయుల సూఫీమతానికి చెందిన వారు. ఏకేశ్వరోపాసన, మతములన్ని ఒక్కటే, స్వీయసాధన లేకుంటే మోక్షం రాదు మొదలైన సిద్ధాంతాలను తూ.చ. తప్పకుండా పాటించేవారు. మొఘల్‌రాజు దారాసుఖోవ్ మరణా నంతరం ఢిల్లీ నుండి పిఠాపురం చేరి స్థిరనివాసం ఏర్పాటుచేసుకున్నారు. ఆ కుటుంబంలో 1885 ఫిబ్రవరి 28 వ తేదీన మౌల్వీ మోహియుద్దీన్ బాద్‌షా, చాంద్‌బీబీ దంపతులకు డాక్టర్ ఉమర్ అలీషా జన్మించారు.

### సాహితీవేత్తగా

ఉర్దూ మాతృభాష అయనప్పటికీ తెలుగుభాష మీద సాధికారత సాధించి సంస్కృతం, అరబ్బీ, పారశీకం, ఆంగ్లభాషలపై పట్టు సాధించారు. తెలుగుభాషపై మమకారంతో పదహారవ ఏటనే 'విద్యావిలాసం' అనే శతకం రాసిన ప్రతిభావంతుడు. 18వ ఏట 'మణిమాల' నాటకం రాసిన ఘనుడు. అనసూయ, కళ, విషాద సౌందర్యం, దానవ వధ, చంద్రగుప్త, మహాభారత కౌరవరంగం, విచిత్రబిల్హణీయం అనే నాటికలు; తారామతి, శాంత, పద్మావతి మొదలైన నవలలు రాశారు. జుల్గుర్భా అనే యునానీ వైద్య గ్రంథాన్ని రచించారు. స్త్రీ సమస్యలను, సామాజిక సమస్యలను ప్రస్తావించి పరిష్కారం చూపారు. దాదాపు 50 పైగా పుస్తకాలు రచించి తెలుగువారికి అందించిన కారణజన్ముడు.

### స్వాతంత్ర్య సమరయోధులుగా - సంఘ సంస్కర్తగా

గాంధీగారిచ్చిన విదేశీవస్తుబహిష్కరణ, సహాయనిరాకరణల పిలుపునందుకొన్నారు ఉమర్ అలీషా. స్వరాజ్య సాధనకు త్యాగం అవసరం అని, ధర్మసంస్థాపనకు స్వరాజ్యం అవసరం అని భావించారు. జాతీయ నాయకులైన

చిత్తరంజన్ దాస్, బిపిన్ చంద్రపాల్‌తో కలసి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు.

విజయవాడలో 'ఆంధ్ర అంటుదోషనివారణ మహాసభ' జరిపి ముఖ్య వక్తగా అంటరానితనం పై పోరాటానికి పిలుపునిచ్చారు. కొన్ని వేల మందితో విశాఖపట్నం, ఏలూరులలో బహిరంగ సభలు జరిపి ప్రజలలో చైతన్యం నింపిన స్ఫూర్తి ప్రదాత.

### పీఠాధిపతిగా – ప్రజాప్రతినిధి

పిఠాపురంలో శ్రీ విశ్వవిజ్ఞాన విద్యాపీఠానికి 6వ పీఠాధిపతిగా పదవి చేపట్టారు. అన్నార్తులకు అభాగ్యులకు అనేక సామాజిక సేవాకార్యక్రమాలు చేశారు.

అనేక విద్యా సంస్థలకు విరివిగా విరాళాలు అందించారు. ఉత్తరమద్రాస్ రిజర్వుడ్‌స్థానం నుంచి అఖిలభారత శాసన సభ్యులుగా (పార్లమెంట్ సభ్యులు) 1934 – 1945 వరకు దాదాపు 10 సంవత్సరాలు బ్రిటీష్ ప్రభుత్వంలో బాధ్యతలు నిర్వహించారు. 1924 లో అఖిలభారత ఖిలాఫత్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా, ముస్లింలీగ్ మద్రాస్ కార్యదర్శిగా సేవలందించారు.

### బిరుదులు

వీరి సేవలకు గుర్తింపుగా 1924లో ఆల్ ఇండియా ఓరియెంటల్ కాన్ఫరెన్స్ వారు 'పండిట్' బిరుదును, అలిఘడ్ విశ్వవిద్యాలయం వారు 'మౌల్వీ' బిరుదును, 1936లో అమెరికాదేశం 'డాక్టర్ ఆఫ్ లిటరేచర్' అనే గౌరవ డాక్టరేట్‌లతో సత్కరించారు.

ఆంధ్రులందరూ గర్వించదగ్గ బహుముఖ ప్రజ్ఞాశాలి. సాహితీమూర్తి అయిన వీరు నిర్విరామ ప్రజాసేవలో ఉండగానే 1945 జనవరి 23వ తేదీన పరమపదించారు. వారి రచనలు, సూక్తులు, చేసిన సేవలు ఎల్లకాలం ప్రజల మదిలో మెదులుతూనే ఉంటాయి.

" సమాజానికి సామాన్యుడే కేంద్రం"
"విద్య అంటే తనను తాను తెలుసుకోవడం"
"వాక్కే శస్త్రము, కలమే అస్త్రము" **– డాక్టర్ ఉమర్ అలీషా**

## అభినవగానగంధర్వుడు – బాలు (1946-2020)

విజయవాడలో ఒక సంగీతకచేరి జరుగుతోంది. ఆ కచేరీలో పాడడానికి వచ్చిన ఒక యువకుడు ఆలస్యంగా ద్వారం దగ్గరకు వచ్చాడు. లోపలికి వెళ్ళడానికి కాపలాదారుడ్ని అనుమతి అడిగాడు. కాపలాదారుడు లోపల ఉన్న వారికే కూర్చోడానికి స్థలం లేదు. తలుపులు మూసి తాళం కూడా వేశాను. తిరిగి వెళ్ళిపో అన్నాడు. ఎలాగోలా ఆ యువకుడు వేదిక వద్దకు చేరుకొని,తన పాటలతో ప్రేక్షకులందరినీ మంత్రముగ్ధులను చేశాడు.కాపలాదారుడు తన తప్పుతెలుసుకొని, ఆ యువకుడి దగ్గరకు వెళ్ళాడు. తనను క్షమించమని ప్రాధేయపడ్డాడు. ఆ యువకుడు వినయంగా చిరునవ్వులు చిందిస్తూ ఫరవాలేదని అతనిని అభినం దించాడు. అతనే గాన గంధర్వుడు, పాటల మాంత్రికుడు శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం.



బాలు నెల్లూరుజిల్లా కోనేటమ్మపేట గ్రామంలో 1946 జూన్ 4వ తేదీన జన్మించారు. తండ్రి శ్రీపతిపండితారాధ్యుల సాంబమూర్తి, తల్లి శకుంతలమ్మ. సాంబమూర్తి హరికథా గేయగాయకులు కావడంతో బాలు తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్నారు.

బాలు జీవితంలో జరిగిన మరొక సంఘటన ఉంది. గూడూరులో 'కాళిదాసు కళానికేతన్' సంస్థ ప్రతి సంవత్సరం లలిత, జానపద వాద్య సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తూ వుండేది. బాలు ప్రతి యేడూ ఈ కార్యక్రమాల్లో పాల్గొనేవారు. పాల్గొన్న ప్రతిసారీ అతనికే బహుమతి వచ్చేది. 1964 లో జరిగిన ఒక కార్యక్రమానికి ప్రముఖ నేపథ్యగాయని ఎస్.జానకి ముఖ్య అతిథిగా వచ్చారు. పోటీలలో గెలుపొందిన గాయనీ గాయకుల పాటలు శ్రద్ధగా విన్నారు. అద్భుతంగా పాడిన బాలుకు ద్వితీయ బహుమతి ప్రకటించడంపై ఆశ్చర్యానికి గురయ్యారు. వెంటనే వేదిక మీద నుంచే మైకు తీసుకున్నారు. "ప్రథమ బహుమతి గెల్చుకున్న గాయకుణ్ణి కించపరచడం కాదు. కానీ, నా ఉద్దేశ్యంలో ఆ బహుమతి బాలసుబ్రహ్మణ్యానికే రావాలి. వర్ధమాన కళాకారులకు ఇలాంటి అన్యాయం జరిగితే వాళ్ళ భవిష్యత్తు అంధకారమౌతుంది" అంటూ ఆవేశంతో నిర్మొహమాటంగా తన అభిప్రాయం తెలియజేశారు. అలా వ్యక్తపరిచిన జానకి మాటలే బాలూ గుండెలో ఆత్మవిశ్వాసాన్ని నింపాయి. సభాకార్యక్రమం ముగిశాక బాలుతో మాట్లాడుతూ "మీ గాత్రం చాలా వైవిధ్యంగా ఉంది. సినిమాల్లో పాడేందుకు ప్రయత్నించండి" అంటూ జానకి బాలుకు సలహా యిచ్చారు. నాటి నుండి ఆమెనే తన గురువుగా బాలు భావించారు.

"పిట్ట కొంచెం కూత ఘనం" అన్నట్లు ఒకవైపు విద్యాభ్యాసం చేస్తూ మరొకవైపు సినీ నేపథ్య గాయకులుగా పేరు ప్రఖ్యాతులు పొందారు. 1966లో ఎస్.పి.కోదండపాణి అండదండలతో సినీపరిశ్రమలోకి అడుగు పెట్టారు. తెలుగు సినీరంగంలోనే కాకుండా తమిళం, కన్నడ, మలయాళం, హిందీ తదితర భాషల్లో మనోరంజకమయిన పాటలు పాడారు. బాలు తన 40 ఏళ్ల సినీ ప్రస్థానంలో16 భాషలలో 40వేల పాటలతో శ్రోతలను, ప్రేక్షకులను ఉర్రూతలూగించారు.40 సినిమాలకు సంగీత దర్శకత్వం వహించారు. బాలు పాడిన పాటలు అశేష ప్రజానీకాన్ని మంత్రముగ్ధులను చేశాయి. అలాంటి ఆణిముత్యాలలో 'మేజర్ చంద్రకాంత్' సినిమాలోని పాట ప్రతి భారతీయుని హృదయంలో దేశభక్తిని నింపుతుంది.

**పాట – 1**

పల్లవి : 'పుణ్యభూమి నాదేశం నమో నమామీ....'
ధన్యభూమి నాదేశం సదా స్మరామీ....'
'బొబ్బిలి పులి' సినిమాలోని ఈ పాట భవబంధాలు శాశ్వతం కాదని తెలియజేస్తుంది.

**పాట – 2**

పల్లవి: జననీ జన్మ భూమిశ్చ – స్వర్గాదపి గరీయసి.....
ఏ తల్లి నిను కన్నదో ........

బాలులో కేవలం గాయకుడు మాత్రమే కాదు. ఆయనలో ఒక విలక్షణ నటుడు కూడా దాగి ఉన్నారు. 1969లో 'పెళ్లంటే నూరేళ్లపంట' చిత్రం ద్వారా తన నటనాచాతుర్యాన్ని ప్రదర్శించారు. నటుడిగానే గాకుండా

తమిళం, కన్నడ, హిందీ సినీ కథానాయకుల సినిమాలకు తెలుగులో డబ్బింగ్ చెప్పేవారు. ఏ హీరోకి తాను పాట పాడుతుంటే వారి స్వరం లాగే అనుకరిస్తూ పాడడం వీరిలోని ప్రత్యేకత.

టీవీలో ప్రసారమయ్యే 'పాడుతా తీయగా' కార్యక్రమానికి ప్రధాన న్యాయనిర్ణేతగా, వ్యాఖ్యాతగా బాలు వ్యవహరించారు. మారుమూల ప్రాంతాల నుండి ఈ కార్యక్రమంలో పాల్గొన్న వేలాదిమంది యువగళాలకు సూచనలిచ్చి తీర్చిదిద్దారు.

టీవీలో 'స్వరాభిషేకం' కార్యక్రమంలో బాలు సుమధుర గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు సంగీత ప్రియులను అలరించింది.

సంగీత గాయకులుగా వీరు సినీరంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. తెలుగు,తమిళ పాటలతో పాటు కన్నడ పాటలకు కూడా జాతీయపురస్కారాలు వచ్చాయి. విశిష్ట వ్యక్తుల విశిష్టసేవలకు భారతప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రదానం చేసే 'పద్మశ్రీ', 'పద్మభూషణ్' పురస్కారాలను వీరు అందుకున్నారు. తెలుగు సినీరంగానికి వీరు చేసిన సేవలను గుర్తించి మనరాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు నంది పురస్కారాలు ప్రదానం చేసింది.

బహుముఖ ప్రజ్ఞాశాలి, సినీరసమయ జగతికి రాకేందుమూర్తి బాలు. కరోనా మహమ్మారికి గురయ్యారు. 74 ఏళ్ళ వయస్సులో మృత్యువుతో పోరాటం చేశారు. విధిరాత ముందు సుస్వరం మూగబోయింది. 25-09-2020 నాడు కీర్తిశేషులయ్యారు. బాలు మరణానంతరం భారత ప్రభుత్వం 'పద్మవిభూషణ్' పురస్కారం ప్రకటించి గౌరవించింది. బాలు జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం.


## భారత్ స్కౌట్స్ - గైడ్స్


అది వేసవి కాలం. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర ఒక ప్రత్యేకమైన డ్రెస్ వేసుకున్న బాలుడు, బాలిక నిలుచుని వున్నారు. అక్కడ నడవలేని వృద్ధ దంపతుల చేతులను పట్టుకొన్నారు. దగ్గరలో ఉన్న ఆటోని పిలిచి, వారిని అందులో కూర్చో బెట్టారు. తరువాత కుడిచేతి మూడువేళ్ళతో సెల్యూట్ చేశారు. వారిని పంపిన తరువాత తిరిగి వారు మళ్లీ ప్రభుత్వ ఆసుపత్రి మెట్ల దగ్గర నిలిచారు. ఇలా దేవాలయాలవద్ద, ఉత్సవాల సమయాల్లో, ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినపుడు ఆపదలో, అవసరంలో ఉన్న ప్రజలకు స్వచ్ఛందంగా సేవాకార్యక్రమాలు చేసే బాల బాలికలు పాఠశాలలో ఒక బృందంగా ఏర్పడతారు. వారినే స్కౌట్స్, గైడ్స్ (బాల భటులు ) అని అంటారు.

ఆరు నుండి పది సంవత్సరాల వయస్సు గల బాలురను 'కబ్స్' అంటారు. బాలికలను 'బుల్ బుల్'లు అంటారు. పదకొండు నుండి పదహారు సంవత్సరాల వయస్సు గల బాలురను 'స్కౌట్స్' అంటారు. బాలికలను 'గైడ్స్' అంటారు.



పదిహేడు సంవత్సరాల నుంచి ఇరవైఐదు సంవత్సరాల వయస్సు గల యువకులను 'రోవర్స్' అంటారు. యువతులను 'రేంజర్స్' అంటారు. ఇది అంతర్జాతీయ సేవా సంస్థ.







## స్కౌట్స్ శిక్షణలో నేర్చుకొనే అంశాలు

1. జాతీయపతాకాన్ని ,స్కౌటుపతాకాన్ని ఎగరవేయడం. వాటి పట్ల మర్యాదగా మసలుకోవడం.
2. జాతీయగీతాలను పాడటం
3. ప్రథమచికిత్స చేయడంలో శిక్షణ పొందడం.
4. తాళ్ళతో రకరకాల ముడులు వేయడంతో పాటుగా, ముడుల ఉపయోగాలను తెలుసుకోవడం.
5. రకరకాల వస్తువులతో, రంగురంగుల కాగితాలతో అందమైన వస్తువులను తయారుచేయడం మొదలైనవి.

దీనిని 1907 లో రాబర్ట్ స్టీఫెన్ స్మిత్ బేడన్ పవెల్ స్థాపించాడు. ఈ ఉద్యమానికి ముఖ్యంగా సేవ, సచ్ఛీలం, ఆరోగ్యం, హస్తకళలు అనేవి నాలుగు మూలస్తంభాలుగా ఉన్నాయి.

ప్రాథమికస్థాయి నుంచి కళాశాలస్థాయి వరకు చదివేపిల్లలకుఈ స్కౌట్స్ గైడ్స్ సంస్థ శిక్షణ యిస్తుంది. ఇందులో సేవా కార్యక్రమాలలో పాల్గొని విశేష సేవలందించిన విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో రాజ్యపురస్కార్, దేశ స్థాయిలో రాష్ట్రపతి అవార్డులు ప్రదానం చేస్తారు.

స్కౌట్స్‌లో చేరిన తరువాత వారందరిచే ప్రమాణం చేయిస్తారు. కుడిచేతి వందనం ఎడమచేతి కరచాలనం వీరి సంప్రదాయం. అదే వారి రహస్యసంకేతం. వీరు బూడిదరంగు చొక్కా , ముదురు నీలిరంగు ప్యాంట్ ధరిస్తారు. భుజాలపై బ్యాడ్జ్ వుంటుంది. స్కౌట్స్ బ్యాడ్జ్‌ని చొక్కా ఎడమజేబుకి ధరిస్తారు. మెడకు "స్కార్ఫ్" దానికి వోగల్ వుంటుంది. తలకు బ్లూ బెరట్ క్యాప్ ధరిస్తారు. బూడిదరంగు నైలాన్‌బెల్టు కట్టుకుంటారు. నల్లనిబూట్లు వేసుకుంటారు. భారత్ స్కౌట్స్ గుర్తులో Fleur-de-lis (కలువ పువ్వు), Trefoil, అశోకచక్రం ఉంటాయి.

ప్రతి స్కౌట్స్ విద్యార్థి, మాస్టారు సలహా మేరకు ప్రతీ రోజు ఒక మంచిపని చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలి. ప్రొద్దున్నే లేవగానే ప్రతీ స్కౌట్ విద్యార్థి తాను ఆరోజు ఒకరికి సేవ చేయడానికి సిద్ధంగా ఉండాలి. ఒకరోజు మరచిపోతే రెండవరోజు రెండు మంచిపనులు చేయాలి. ఒక మంచిపని చేసిన తరువాత స్కార్ఫ్ చివర ఒక చిన్న ముడి వేయాలి. ఇలా ప్రతిదినం చేసి తన దినచర్యలో రాసుకోవాలి. 30 రోజులు చేసిన తరువాత తన ట్రూపు లీడర్‌కి, లేదా స్కౌట్ మాస్టారుకి చూపించాలి.

### స్కౌట్స్ విద్యార్థులు చేయు సేవా కార్యక్రమాలు

1. ముసలివారిని రోడ్డు దాటించటంలో సహాయపడటం.
2. మూగజీవుల దాహార్తిని తీర్చి, సేవచేయటం.
3. చెట్లను నాటి రోజూ నీరుపోయటం.
4. అనారోగ్యంగా ఉన్న వారికి సహాయంచేయటం.
5. జాతరలో క్యూలను ఏర్పాటుచేయటం.
6. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగాచేయటం.



స్కౌట్స్ ప్రమాణ చిహ్నం

ఈ విధంగా పాఠశాలస్థాయిలో స్కౌట్-గైడ్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. దీనివలన విద్యార్థులలో దేశభక్తి, సేవాగుణం,పరోపకారం మొదలైన సద్గుణాలు అలవడి వారు భావిభారత పౌరులుగా తయారౌతారనటంలో సందేహం లేదు. మీరు కూడా స్కౌట్ – గైడ్ ఉద్యమంలో చేరతారు కదా !

## అభ్యాస ప్రశ్నలు

**అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి.**

1. స్కౌట్స్‌లో విశేష సేవలందించిన విద్యార్థులకు ఏయే అవార్డులు ఇస్తారు?
2. బహుముఖ ప్రజ్ఞాశాలిగా బాలు ఎందుకు పిలువబడ్డారు?
3. కవిశేఖర ఉమర్ అలీషా తెలుగు సాహిత్యానికి ఎలాంటి కృషి చేశారు?
4. కోడి రామమూర్తిని కలియుగభీముడని ఎందుకు అంటారు?

Z4P8S8

**ఆ) కింది ప్రశ్నలకు 8 నుంచి 10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. స్వాతంత్ర్యోద్యమ కాలంలో గాడిచర్లవారు అనుభవించిన జైలు జీవితం ఎట్టిది?
2. అన్నార్తుల పాలిట అపర అన్నపూర్ణగా డొక్కా సీతమ్మను ఎందుకు పిలుస్తారు?
3. స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులు చేసే సేవాకార్యక్రమాల గురించి రాయండి?

తేనెలూరు భాష మన తెలుగుభాష
తేట తెల్లముగ తెలుపు భాష మన తెలుగుభాష

# పద విజ్ఞానం

**అ**

అంకుశం = అడ్డు, ఆటంకం
అకుంఠితము = స్థిరం
అనుభూతి = శరీరానికి, మనసుకు కలిగే అనుభవం
అనురాగం = ప్రేమ, స్నేహం
అమితం = అధికం
ఆనందం = సంతోషం

**ఆ**

ఆత్మ = బుద్ధి
ఆచరణ = అమలులో పెట్టుట
అబ్ధి = సముద్రం
అంకురం = ఆరంభం
అంకురితం = స్థిరము

**ఇ**

ఇంపు = ఇష్టం

**ఈ**

ఈడు = వయసు

**ఉ**

ఉర్రూతలూగించు = అధికమైన ఉత్సాహం కలిగించు
ఉసిగొల్పు = ప్రోత్సహించు
ఉజ్జీవం = బ్రతుకు, చైతన్యం

**ఎ**

ఎరుగు = తెలియు, గ్రహించు

**ఏ**

ఏడాది = సంవత్సరం

**ఒ**

ఒడిసి పట్టు = గట్టిగా పట్టుకొను

**క**

కంచె = గడ్డిబీడు, పొద
కటకట = అయ్యో, కష్టం
కదుపులు = మంద, సమూహం
కనకము = బంగారం
కర్కశము = కఠినం
కర్ణము = చెవి
కల = స్వప్నం, ధ్వని
కలవరం = మనసులో ఆందోళన
కింకిణి = గజ్జె, చిరుగంట
కుదురు = పొదు, ఆధారం
కునుకు = నిద్ర
కులం = వంశం, తెగ
కేరింతలు = నవ్వులు
కొక్కెర = కొంగ
కోకొల్లలు = సమృద్ధి

**గ**

గగనం = ఆకాశం
గణం = గుంపు, సమూహం
గర్భం = కడుపు

**చ**

చట్టి = నోరు వెడల్పుగా గల చిన్న మట్టిపాత్ర
చింత = దుఃఖం
చూరు = ఇంటి మీద కప్పుచివర
చెడ = మిక్కిలి, ఇష్టం వచ్చినట్లు
చొక్కి = పరవశించి
చొచ్చి = ప్రవేశించి తిరుగునది

**జ**

జలధి = సముద్రం
జ్ఞాపకం = జ్ఞప్తి, గుర్తు, ఎరుక

**త**

తగువు = గొడవ
తత్పరత = ఆసక్తి

తలము = స్థలము, చోటు
తహతహ = ఆసక్తి
తువ్వాలు = తుండుగుడ్డ
తేజం = ప్రకాశం

**ద**

దగా = మోసం
దమనము = అణచుట
దహనుడు = అగ్ని
దళము = సైన్యం, సేన
దిగంతాలు = దిక్కుల చివర
దిగులు = భయం
దిటవు = శక్తి, ధైర్యం
దృఢము = గట్టిది
దేవేసినట్టు = తిప్పినట్టు
దౌర్జన్యం = బలాత్కారం, చెడ్డతనం

**న**

నల్గడలు = నాలుగు దిక్కులు
నిదర్శనం = ఉదాహరణం
నిశ్చింత = దిగులు లేకుండా
నిస్వనము = ధ్వని
నీరెండ = లేతయెండ
నెరుసు = ముక్కలు

**ప**

పటిమ = నేర్పు
పరవశము = తనను తాను మరచుట
పరాక్రమం = సామర్థ్యం, పౌరుషం
పర్వు = వ్యాపించు (పరువు రూపాంతరం)
పల్లం = లోతు, గోయి
ప్రతిబింబం = నీడ
ప్రదానం = ఇచ్చుట
ప్రబలు = వృద్ధి పొందు
ప్రభావితం = ప్రభావం చూపటం
ప్రళయం = భూమిపై ప్రాణులు నశించేకాలం
పాథోధి = సముద్రం
ప్రాధేయపడు = బ్రతిమాలు, దీనంగాఅడుగు
పిన్న = చిన్న
పెళ్ళ = ముక్క
ప్రేమ = ప్రీతి

**ఫ**

ఫాలము = నొసలు

**బ**

బాజాలు = మంగళ వాయిద్యాలు
బీడు = పనికిరాని, వ్యర్థము
బృందం = సమూహం

**భ**

భంగి = విధము
భత్యము = చెల్లించే సొమ్ము
భరోసా = హామీ
భస్మం = బూడిద
భీతి = భయం

**మ**

మంద = సమూహం
మంటి = మట్టి
మడి = వరి పొలం, మాగాణిపొలం
మడిసెక్క = చిన్న పొలం
మార్దవం = మృదుత్వం
మీరుట = అతిక్రమించుట
ముసురు = విడువక కురిసే వాన
మెదలు = కొంచెంగా కదులు, తిరుగు
మెచ్చు = సంతోషం
మైత్రి = స్నేహం
మొన = కొన, చివరి భాగం

**ర**

రణం = యుద్ధం
రిత్త = వట్టి, కల్ల, ఊరక

| | | | |
|---|---|---|---|
| రోమంథము | = నెమరువేయుట | వెలితి | = తక్కువ, లోపం |
| రౌద్రం | = భయంకరం | వైణలికుడు | = వేణువుతో జీవించేవాడు |
| | **ల** | | **శ** |
| లోటు | = లోపం తక్కువ | శక్యము | = సాధ్యము |
| | **వ** | శాబకం | = పిల్లి కూన |
| వడి | = వేగం | శైలం. | = కొండ |
| వర్తమానం | = ప్రస్తుత కాలం | శోకం | = ఏడుపు |
| వర్ణం | = రూపం, రంగు, కులం | శౌర్యం | = బలం |
| వాడ | = వీధి, ఇళ్ల వరస | | **స** |
| వడలు | = వాడిపోవు | సంకల్పం | = కోరిక పనిచేయాలనే ఆలోచన |
| వాసన | = సంస్కారం, అనుభూతి | స్వప్నం | = కల, నిద్ర |
| వాలు | = దిగుట, దుముకుట | సారెకు | = కుమ్మరి వాని చక్రం |
| విజయుడు | = అర్జునుడు | సాహసం | = తెగింపు |
| విపంచి | = వీణ | సాళ్వము | = డేగ |
| విరమించు | = మానుకొను, విశ్రాంతి పొందు | స్థావరం | = కదలనిది, స్థిరమైనది |
| | | స్వాదు | = ఇంపైన, మధురమైన |
| విహరించు | = వేడుకగా తిరుగు | సివ్వంగి | = పునుగుపిల్లి, కస్తూరి మృగం |
| వీచి | = అల | సుమ్మా | = చూడుమి |
| వీడు | = వదలు, విడుచు | సూర్యాత్మజ | = యమునా నది |
| వీనులు | = చెవులు | స్ఫూర్తి | = ప్రకాశం |
| వీవెన | = విసన కర్ర | సోకి | = తాకి |
| వెచ్చించు | = ఖర్చు చేయు | | |

## విభక్తులు

| ప్రత్యయము | - | విభక్తి |
|---|---|---|
| డు, ము, వు, లు | - | ప్రథమా విభక్తి |
| నిన్, నున్, లన్, కూర్చి, గురించి | - | ద్వితీయా విభక్తి |
| చేతన్, చేన్, తోడన్, తోన్ | - | తృతీయా విభక్తి |
| కొఱకున్, కై | - | చతుర్థీ విభక్తి |
| వలనన్, కంటెన్, పట్టి | - | పంచమీ విభక్తి |
| కిన్, కున్ యొక్క, లోన్, లోపలన్ | - | షష్ఠీ విభక్తి |
| అందున్. నన్ | - | సప్తమీ విభక్తి |
| ఓ, ఓయి, ఓరి, ఓసి | - | సంబోధన ప్రథమా విభక్తి |

## పర్యాయ పదాలు

| | | |
|---|---|---|
| అనురాగము | = | ప్రేమ, స్నేహం |
| అమితము | = | మిక్కిలి, అధికం |
| అరణ్యము | = | అడవి, కాన |
| ఆత్మ | = | మనస్సు, హృదయం |
| ఏడాది | = | ఏడు, సంవత్సరం |
| కనకము | = | బంగారం, పసిడి |
| కన్ను | = | నేత్రం, దృష్టి |
| కర్ణము | = | చెవి, వీను |
| కుదురు | = | ఊత, అధారం |
| కులము | = | తెగ, జాతి |
| గగనము | = | ఆకాశం, అంతరిక్షం |
| గర్భము | = | కడుపు, పిండం |
| గోవు | = | ఆవు, ధేనువు |
| చెట్టు | = | మాను, వృక్షం |
| జలధి | = | సముద్రం, కడలి |
| తల్లి | = | అమ్మ, జనని |
| దహనుడు | = | అగ్నిదేవుడు, అనలం |
| దళము | = | సేన, సైన్యం |
| దిటవు | = | శక్తి, ధైర్యం |
| దుగ్ధము | = | పాలు, క్షీరం |
| పరాక్రమము | = | శౌర్యం, పౌరుషం |
| పల్లము | = | లోతు, గోయి |
| పెళ్లి | = | వివాహం, పరిణయం |
| ప్రళయము | = | యుగాంతం, విలయం |
| ప్రేమ | = | పేర్మి, ప్రీతి |
| ఫాలాక్షుడు | = | శివుడు, హరుడు |
| మంద | = | గుంపు, సమూహం |
| మైత్రి | = | చెలిమి, స్నేహం |
| మ్రాను | = | చెట్టు, భూరుహం |
| రణము | = | యుద్ధం, పోరు |
| లేగ | = | దూడ, పెయ్య |
| లోటు | = | లోపం, తక్కువ |
| వర్ణము | = | కులము, రంగు |
| విజయుడు | = | అర్జునుడు, గాండీవి |
| శైలము | = | కొండ, అద్రి |
| శోకము | = | దు:ఖం, బాధ |
| శౌర్యము | = | తేజం, ప్రతాపం |
| శ్రీరాముడు | = | రాఘవుడు, దాశరథి |
| స్వప్నము | = | కల, నిద్ర |

## వ్యాకరణ విజ్ఞానం

★ **సంధి** : పూర్వ పరస్వరములకు పరస్పరం ఏకాదేశం కావడం సంధి.
ఉదా : రాముడు + అతడు = రాముడతడు

★ **నిత్యం** : సూత్రంలో చెప్పిన వ్యాకరణ కార్యం తప్పనిసరిగ జరగడం.
ఉదా : జనకుడు + ఇతడు = జనకుడితడు

★ **నిషేధం** : సూత్రంలో చెప్పిన వ్యాకరణ కార్యం రాకపోవుట
ఉదా : మా + అత్త = మాయత్త

★ **వైకల్పికం** : సూత్రంలో చెప్పిన వ్యాకరణ కార్యం జరిగిన రూపం, జరగని రూపం రెండూ ఉండడం.
ఉదా : అది + ఏమి = అదేమి, అదియేమి

★ **బహుళం** : సూత్రంలో చెప్పిన వ్యాకరణ కార్యం కొన్ని సందర్భాలలో నిత్యంగా, కొన్ని సందర్భాలలో నిషేధంగా, కొన్ని సందర్భాలలో వికల్పంగా, కొన్ని సందర్భాలలో అన్యవిధంగా జరగడం.

ఉదా : రామ + అయ్య = రామయ్య (నిత్యం), దూత + ఇతడు = దూతయితడు (నిషేధం), మేన + అల్లుడు = మేనల్లుడు; మేనయల్లుడు (వైకల్పికం), ఒక + ఒక = ఒకానొక (అన్యవిధం)

★ **ఆగమం** : ఉన్న వర్ణాలకు అదనంగా కొత్త వర్ణం మిత్రునివలె వచ్చిచేరడం.
ఉదా : పండు + ఆకు = పండుటాకు

★ **ఆదేశం** : ఉన్న వర్ణాన్ని తొలగించి దాని స్థానంలో శత్రువులాగా వేరొక వర్ణం వచ్చిచేరడం.
ఉదా : తల్లి + తండ్రి = తల్లిదండ్రులు

★ **ఆమ్రేడితం** : ఒక పదాన్ని వెంట వెంటనే రెండుసార్లు ప్రయోగిస్తే రెండవ పదానికి ఆమ్రేడితం అని పేరు.
ఉదా : అయ్యో + అయ్యో = అయ్యయ్యో

★ **ద్విత్వం** : ఒకహల్లు అదే హల్లుతో కలవడం.
ఉదా : అమ్మ

★ **సంయుక్తం** : ఒకహల్లు మరొక హల్లుతో కలవడం.
ఉదా : పరమేశ్వరుడు

★ **సంశ్లేష** : సంధి జరుగునప్పుడు మొదటిపదం చివరిహల్లు, రెండవపదం మొదటి హల్లుతో కలవడం.
ఉదా : పూచెను + గలువలు = పూచెన్గలువలు

★ **ద్రుతం** : 'న'కారానికి ద్రుతం అని పేరు.సామాన్యంగా ద్రుతం ఁ, ం, న్, ను అనే నాలుగు రూపాలతో కనిపిస్తుంది.
ఉదా : తోచెన్

★ **ద్రుతప్రకృతికం** : ద్రుతం చివర కలిగిన పదం.
ఉదా : తోచెన్

★ **త్రికము** : 'ఆ, ఈ, ఏ' అనే సర్వనామాలు
ఉదా : ఆ కాలము, ఈ కన్య, ఏ విధంగా

★ **విభక్తి** : పదాలమధ్య ఉండే సంబంధాన్ని తెలిపేది.
ఉదా : భూతదయ కంటె మించిన ధర్మం లేదు

★ **పూర్వ పదం** : సమాసంలోని అర్థవంతమైన రెండు పదాలలో మొదటిపదం.
ఉదా : దేవ + ఆలయం

★ **ఉత్తర పదం** : సమాసంలోని అర్థవంతమైన రెండు పదాలలో రెండవపదం.
ఉదా : రాజ + ఇంద్రుడు

★ **విగ్రహ వాక్యం** : విభక్తులతో కలిసి ఉండి సమాసాన్ని వివరించి చెప్పేది.
ఉదా : రాజు యొక్క భవనం

★ **సమాసం** : అర్థవంతమైన రెండు పదాల కలయిక.
ఉదా : గ్రంథాలయం

★ **కర్త** : క్రియకు గల ఆధారాన్ని తెలిపే పదం.
ఉదా : రాముడు పండ్లను తిన్నాడు.

★ **కర్మ** : క్రియా ఫలితాన్ని అనుభవించేవాడు.
ఉదా : హనుమంతుడు సముద్రమును దాటెను.

★ **సకర్మకం** : కర్మ ఉన్నా, క్రియాపదం వల్ల కర్మ వున్నట్లు తెలిసినా అది సకర్మకం.
ఉదా : కైకేయి రెండువరములను కోరెను.

★ **అకర్మకం** : కర్మ లేకున్నా, క్రియాపదంవల్ల కర్మ లేనట్లు తెలిసినా అది అకర్మకం.
ఉదా : దశరథుని మంత్రి సుమంత్రుడు.

★ **క్రియ** : పనిని తెలిపేది.
ఉదా : భరతుడు నందిగ్రామం చేరెను.

★ **సమాపక క్రియ** : వాక్యం చెప్పదలచిన భావాన్ని పూర్తిచేసే క్రియ.
ఉదా : కౌసల్య దానధర్మములు చేసింది.

★ **అసమాపక క్రియ** : వాక్యం చెప్పదలచిన భావాన్ని పూర్తిచేయని క్రియ.
ఉదా : సుమిత్ర రాముని తండ్రిగా భావించమని చెప్పి,

★ **వాక్యం** : కర్త ,కర్మ ,క్రియలను కలిగి సంపూర్ణ అర్థాన్ని ఇచ్చేది.
ఉదా : శబరి పండ్లను పెట్టింది.

★ **సామాన్య వాక్యం** : సమాపక క్రియతో పూర్తయ్యే వాక్యం.
ఉదా : రవి పరుగు పెట్టాడు.

★ **ఉత్వ సంధి** : ఉత్తునకచ్చు పరమగునపుడు సంధి నిత్యముగానగు.
ఉదా : భీముడు + ఇతడు

★ **ఇత్వ సంధి** : ఏమ్యాదుల యిత్తునకు సంధి వైకల్పికముగానగు.
ఉదా : మరి + ఏమిటి

★ **అత్వ సంధి** : అత్తునకు సంధి బహుళముగానగు.
ఉదా : దమ్మ + అక్క = దమ్మక్క

★ **యడాగమ సంధి** : సంధి లేని చోట స్వరంబుకంటే పరంబైన స్వరంబునకు యడాగమంబగు.
ఉదా : మేన + అల్లుడు = మేనయల్లుడు

★ **గసడదవాదేశ సంధి** : ప్రథమ మీది పరుషములకు గ- స- డ-ద-వ లు బహుళంబుగానగు.
ఉదా : వాడు + కొట్టె = వాడుగొట్టె; వాడుకొట్టె

★ **సరళాదేశసంధి** : ద్రుత ప్రకృతికము మీది పరుషములకు సరళములగు.
ఉదా : పూచెన్ + కలువలు = పూచెనుగలువలు

## పొడుపు కథలు

1. పున్నమికి పూత – అమవాస్యకు ఆరగింపు – **తేనెపట్టు**
2. ఊరంతటికి ఒకటే దుప్పటి – **ఆకాశం**
3. కోడి కాని కోడి – **పకోడి**
4. కాయ గాని కాయలు – **తలకాయ, ఎంద్రకాయ**
5. జీవికి పుట్టింది కాని చలనం లేదు – **గ్రుడ్డు**
6. నిద్రలో కూడా కన్నులు మూయనిది – **చేప**
7. వినే వాటికి కనే వాటికి బెత్తెడు దూరం

   – **చెవులు, కన్నులు**
8. మా ఊరెద్దు మీ ఊరికి పోదు

   మీ ఊరెద్దు మా ఊరికి రాదు – **చెట్టు**
9. ఇంట్లో కలి, ఒంట్లో కలి **వాకలి, ఆకలి**
10. నల్లటి పొదవల్ల పుట్టింది

    పరరాజు కళ్ళల్లో పడింది

    అరచేతి పట్నానికి వచ్చింది

    గోరింక పట్నాన సచ్చింది – **పేను**
11. ఏడుగురు అన్నదమ్ములం మేము

    విడివిడిగా ఉంటే చెప్పగలరు

    కలసి ఉంటే చెప్పలేరు – **ఇంద్ర ధనస్సు**
12. కొనేటప్పుడు నల్లగా

    తినేటప్పుడు ఎర్రగా

    పారేసేటప్పుడు తెల్లగా – **నేరేడు పండు**
13. ఉరుములు మెరుపులు లేకుండా

    వానలు వరదలు లేకుండా

    ఉత్తరాది చెరువు ఊరకనె నిండింది – **కొబ్బరి కాయ**
14. చూస్తే చూపులు

    నవ్వితే నవ్వులు

    గుద్దితే గుద్దులు – **అద్దం**
15. చెట్టున పుట్టిన చెంగి

    రాతిన పుట్టిన రంగి

    తీగన పుట్టిన తిమ్మి

    బావ నోట్లో వసంతములాడె – **తాంబూలం**
16. గోడ మీద బొమ్మ

    గొలుసుల బొమ్మ

    వచ్చి పోయే వారికి

    వడ్డించు బొమ్మ – **తేలు**
17. శిలవృక్షం తలబుట్టిన

    చెలువలు ముష్వరును గూడి చిడి ముడి పడుచున్

    దలవాకిట రమియింతురు

    సలలితముగ దీని నెరుగు సరసులుగలరే?

    – **సున్నం, వక్క, ఆకు**
18. తెల్లటి భూమిలో

    నల్లటి విత్తనాలు

    చేతితో చల్లుతారు

    నోటితో వేరుతారు – **కాగితం, అక్షరాలు**
19. కిటకిట తలుపులు

    కిటారు తలుపులు

    ఎప్పుడు తెరిచిన

    చప్పుడు గావు – **కళ్ళు**
20. అడవిలో పుట్టింది

    అడవిలో పెరిగింది

    మాయింటి కొచ్చింది

    తైతక్కలాడింది – **మజ్జిగ కవ్వం**
21. ముక్కున పైనము నడుచును

    ప్రక్కన నోరుండు గాలి పారణ సేయున్

    గ్రక్కున వేసిన కూయున్

    మక్కువతో దీని దెలియ మనుజులుగలరే?

    – **బొంగరం**
22. కాళ్ళు రెండు గలవు గాని మానిషి గాదు

    నోరు గల్గి యెదుటి వారి నరుచు

    గాలి మేసి లెస్సగానరుంమోయును

    దీని భావమేమి? తిరుమలేశ – **సైకిలు**

## తొలి తెలుగు రచనలు

| | | | |
|---|---|---|---|
| 1. | తొలి తెలుగు ఇతిహాసం | – ఆంధ్రమహాభారతము | (నన్నయ, తిక్కన, ఎర్రన) |
| 2. | తొలి తెలుగు రామాయణం | – రంగనాథ రామాయణం | (గోన బుద్ధారెడ్డి) |
| 3. | తొలి తెలుగు శతకం | – వృషాధిప శతకం | (పాల్కురికి సోమనాథుడు) |
| 4. | తొలి తెలుగు పురాణం | – మార్కండేయ పురాణం | (మారన) |
| 5. | తొలి తెలుగు ప్రబంధం | – మనుచరిత్ర | (అల్లసాని పెద్దన) |
| 6. | తొలి తెలుగు యక్షగానం | – సుగ్రీవ విజయం | (కందుకూరి రుద్రకవి) |
| 7. | తొలి తెలుగు అచ్చుతెనుగు కావ్యం | – యయాతి చరిత్ర | (పొన్నగంటి తెలగనార్యుడు) |
| 8. | తొలి తెలుగు నాటకం | – మంజరీ మధుకరీయం | (కోరాడ రామచంద్రశాస్త్రి) |
| 9. | తొలి తెలుగు నవల | – రాజశేఖరచరిత్ర | (కందుకూరి వీరేశలింగం) |
| 10. | తొలి తెలుగు కథానిక | – దిద్దుబాటు | (గురజాడ వేంకట అప్పారావు) |
| 11. | తొలి తెలుగు యాత్రా చరిత్ర | – కాశీయాత్రా చరిత్ర | (ఏనుగుల వీరాస్వామి) |

## తెలుగులో జ్ఞానపీఠ పురస్కార గ్రహీతలు

| సంఖ్య | కవి | సంవత్సరం | రచన |
|---|---|---|---|
| 1 | విశ్వనాథ సత్యనారాయణ | 1970 | శ్రీమద్రామాయణ కల్పవృక్షం |
| 2 | సి. నారాయణ రెడ్డి | 1988 | విశ్వంభర |
| 3 | రావూరి భరద్వాజ | 2012 | పాకుడురాళ్ళు |

## ముఖ్యమైన దినోత్సవాలు

1. **ఫిబ్రవరి–21** : ప్రపంచ మాతృభాషా దినోత్సవం
2. **ఫిబ్రవరి–28** : జాతీయ సైన్సు దినోత్సవం
3. **ఏప్రిల్–16** : ఆంధ్ర నాటకరంగ దినోత్సవం (కందుకూరి వీరేశలింగం జయంతి)
4. **ఏప్రిల్–23** : ప్రపంచ పుస్తక దినోత్సవం
5. **ఏప్రిల్–30** : బాలకార్మికుల దినోత్సవం
6. **జూన్–5** : ప్రపంచ పర్యావరణ దినోత్సవం
7. **ఆగష్టు–29** : జాతీయ క్రీడాదినోత్సవం (ధ్యాన్‌చంద్ జయంతి)
8. **ఆగష్టు–29** : తెలుగు భాషా దినోత్సవం (గిడుగు వేంకటరామమూర్తి జయంతి)
9. **సెప్టెంబర్–5** : జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం (డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి)
10. **నవంబర్–7** : బాలల సంరక్షణ దినోత్సవం
11. **నవంబర్–14** : జాతీయ బాలల దినోత్సవం (జవహర్‌లాల్ నెహ్రూ జయంతి)
12. **నవంబర్–20** : ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం
13. **డిసెంబర్–22** : జాతీయ గణిత దినోత్సవం (శ్రీనివాస రామానుజన్ జయంతి)

## ప్రాథమిక విజ్ఞానం

### త్రికరణములు
1. మనసు
2. వాక్కు
3. కర్మ

### చతుర్వేదములు
1. ఋగ్వేదము
2. యజుర్వేదము
3. సామవేదము
4. అధర్వణవేదము

### వేదాంగములు
1. శిక్ష
2. ఛందస్సు
3. వ్యాకరణము
4. నిరుక్తము
5. జ్యోతిష్యము
6. కల్పము

### పంచమాతృమూర్తులు
1. కన్న తల్లి
2. అన్న భార్య
3. గురుని భార్య
4. భార్య తల్లి (అత్త)
5. రాజు భార్య

### పంచగంగలు
1. గంగ
2. కృష్ణ
3. గోదావరి
4. తుంగభద్ర
5. కావేరి

### షట్చక్రవర్తులు
1. హరిశ్చంద్రుడు
2. నలుడు
3. పురుకుత్సుడు
4. పురూరవుడు
5. సగరుడు
6. కార్తవీర్యార్జునుడు

### షడ్రుచులు
1. తీపి
2. పులుపు
3. ఉప్పు
4. కారం
5. చేదు
6. వగరు

### సప్తఋషులు
1. కశ్యపుడు
2. అత్రి
3. భరద్వాజుడు
4. విశ్వామిత్రుడు
5. గౌతముడు
6. వశిష్ఠుడు
7. జమదగ్ని

### అష్టదిక్పాలురు
1. ఇంద్రుడు
2. అగ్ని
3. యముడు
4. నిరృతి
5. వరుణుడు
6. వాయుదేవుడు
7. కుబేరుడు
8. ఈశానుడు

### నవరత్నాలు
1. వజ్రం
2. వైఢూర్యం
3. గోమేదికం
4. పుష్యరాగం
5. మరకతం
6. మాణిక్యం
7. నీలం
8. పగడం
9. ముత్యం